మంగళవారం
20•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 282
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఫ్రంట్‌కు అంకురార్పణ

ఏదో మామూలు పద్ధతుల్లో.. బీజేపీ, కాంగ్రెస్, కేసీఆర్, మమతలకు సంబంధించిన ఎజెండా కాదు. ఇది ప్రజల ఎజెండా. మా ఎజెండా దేశ ప్రజల కోసమనేది మీకు భవిష్యత్తులో అర్థమవుతుంది. ఇది ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్న ఆలోచనావిధానం. దీనికి గొప్ప ప్రాంతమైన కోల్‌కతాలో అంకురార్పణ జరిగింది.

– కే చంద్రశేఖర్‌రావు
తెలంగాణ ముఖ్యమంత్రి

ఇది ఒక శుభపరిణామం. రాజకీయాలు నిరంతర ప్రక్రియ. మేము ఇండియాను ఒక దేశంగా ప్రేమిస్తాం. మారుతున్న భారత రాజకీయాల నేపథ్యాన్ని, రైతులు, ఇతర వర్గాలకు చెందిన సమస్యలకు సరైన పరిష్కార మార్గాలు రూపొందించుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించాం. మేం ఇప్పుడే చర్చలు ప్రారంభించాం. నిజమే.. బలమైన ఫెడరల్ ఫ్రంట్ అవసరం ఉన్నది.

– మమతాబెనర్జీ
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి


సోమవారం కోల్‌కతాలోని సచివాలయంలోకి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తోడ్కొని వెళ్తున్న బెంగాల్ సీఎం మమతాబెనర్జీ. చిత్రంలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు కూడా ఉన్నారు.

కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీతో ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు ఫలప్రదం

రెండుగంటలపాటు సుదీర్ఘ చర్చలు.. కేసీఆర్ అభిప్రాయాలతో ఏకీభవించిన మమత

దేశ రాజకీయాల్లో శుభపరిణామమని సంయుక్త ప్రకటన

- ఇది భారత ప్రజాసమూహాలను ఏకం చేసే ప్రక్రియ
- మా ఫ్రంట్.. రాజకీయ మూస పద్ధతులకు భిన్నమైంది
- అభివృద్ధిలో దేశం దశ, దిశను మార్చేందుకు ప్రత్యేక ఎజెండా
- దేశాన్ని పునర్నిర్వచించుకుని, పునర్నిర్దేశించుకోవాలి
- తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

- కేసీఆర్ ప్రయత్నం అద్భుతమైంది
- ఆయనకు అన్నివిషయాలపై అవగాహన ఉన్నది
- వారితో కలిసి దేశం కోసం పనిచేయడం గొప్పగా భావిస్తాం
- రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది
- పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ

ప్రజల కోసం అతి పెద్ద ఫెడరల్ ఫ్రంట్

(కోల్‌కతా/హైదరాబాద్, ప్రత్యేక ప్రతినిధి)

జాతీయ ఫెడరల్ ఫ్రంట్ వైపు తొలి అడుగు బలంగా పడింది. దేశంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ శక్తి ఆవిర్భావానికి నాందీప్రస్తావన జరిగింది. అభివృద్ధిలో దేశ దశ దిశలను మార్చేవిధంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక, ప్రత్యేక ఎజెండాకోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తీసుకొన్న చొరవకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ శ్రుతి కలిపారు. కోల్‌కతా సచివాలయంలో సోమవారం ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య దాదాపు రెండుగంటలపాటు సుదీర్ఘంగా జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పును సాధించే లక్ష్యంతో.. ప్రజలకోసం ఏర్పడే అతిపెద్ద ఫెడరల్ ఫ్రంట్ తమదని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. ప్రత్యామ్నాయ రాజకీయ పునరేకీకరణపై తాను తెలంగాణ ముఖ్యమంత్రి అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నానని బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రకటించారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో చర్చించి సమిష్టి నాయకత్వంతో ముందుకు కదులాలని ఇద్దరు ముఖ్యమంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఫ్రంట్ ఏర్పాటుపై నిదానంగా అడుగులు వేస్తామని సంయుక్తంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు దేశ రాజకీయాలకు శుభ పరిణామమని మమతాబెనర్జీ వ్యాఖ్యానించారు. ఇకపై తాము కలిసి కదులుతామని ఇతర పార్టీలను

మిగతా 2వ పేజీలో



1,00,116

కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ సాయం పెంపు

- పేదింటి బిడ్డల పట్ల ముఖ్యమంత్రి అవ్యాజ అనురాగం
- నా హృదయానికి దగ్గరైన పథకం కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్
- అమ్మాయి పెండ్లి భారం కాకూడదు.. అందుకే లక్షా నూటపదహార్లు
- ఆడపిల్లల తల్లులు సంతోషంతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు
- ప్రభుత్వ నిర్ణయానికి అందరి హర్షామోదాలు లభిస్తాయని ఆశిస్తున్నా
- అసెంబ్లీలో ప్రకటన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో పేదింటి ఆడపడుచులపట్ల ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తన అవ్యాజమైన ప్రేమానురాగాలను మరోసారి చాటుకొన్నారు. పేదింటి ఆడబిడ్డ పెండ్లి కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ప్రభుత్వం ఇప్పటివరకు అందిస్తున్న రూ.75,116 సహాయాన్ని లక్షా నూట పదహారు రూపాయలకు పెంచుతున్నట్టు సోమవారం శాసనసభలో ప్రకటించారు. వ్యక్తిగతంగా తన హృదయానికి ఎంతో దగ్గరైన పథకం కల్యాణలక్ష్మి అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు తీసుకొంటున్న సమయంలో తమకందిన సహాయానికి సంతోషిస్తూ, ఆడపిల్లల తల్లులు ఆనందబాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారని సంతోషం వ్యక్తంచేశారు. ఈ పథకం ఆర్థిక సహాయం పెంపు నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే సభ్యులంతా బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన ఆయన మాటల్లోనే..

'పేదరికం మనుషుల్ని అనేక రకాలుగా వేధిస్తుంది. పేదరికంతో బాధపడేవారికి కొన్నిసార్లు సంప్రదాయాలు కూడా భారంగా పరిణమిస్తాయి. మన సమాజంలో పెండ్లి అనేది చాలా ఖర్చుతో కూడుకొన్న అంశం. అందులోనూ ఆడపిల్ల పెండ్లి మరింత భారంగా మారిపోయింది. ఈ భారం వల్లనే చాలామంది తల్లిదండ్రులు తమ

మిగతా 12వ పేజీలో

ఏప్రిల్ 20 నుంచి మే 31 వరకు

పంట చెక్కుల పంపిణీ

19న లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

- 1.42 కోట్ల ఎకరాలకు పంట పెట్టుబడి కింద రూ.5,680 కోట్ల మొత్తం పంపిణీ
- చెక్కుల రూపంలోనే సాయం
- నగదు కొరత రాకుండా బ్యాంకులతో సంప్రదింపులు
- శాసనమండలిలో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటన
- 15 కల్లా గ్రామాలకు చెక్కులు చేరాలని సీఎస్ ఆదేశం

దేశానికే ఆదర్శం తెలంగాణ వ్యవసాయం


సోమవారం శాసనమండలిలో మాట్లాడుతున్న మంత్రి పోచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన పంట పెట్టుబడి సాయం పథకం ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభంకానున్నది. ఆ మరుసటిరోజు నుంచి మే 31 వరకు ఆయా గ్రామాల్లో రైతులకు పంట సాయం కింద ఎకరానికి రూ.4వేల చొప్పున చెక్కులు పంపిణీ చేయనున్నారు. మొత్తంగా రాష్ట్రంలోని 1.42 కోట్ల ఎకరాలకు పంట పెట్టుబడి కింద రూ.5,680 కోట్ల మొత్తాన్ని చెక్కులరూపంలో పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం శాసనమండలిలో ప్రకటించారు. దేశానికే తెలంగాణ వ్యవసాయం ఆదర్శంగా నిలువనున్నదని, తెలంగాణ రైతులు అప్పులపాలు కాకుండా, వారి ఆత్మగౌరవం కాపాడేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి ఫలిస్తున్నదని చెప్పారు. అందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. చెక్కుల రూపంలోనే పెట్టుబడి సాయాన్ని అందజేస్తామని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి పోచారం సమాధానమిస్తూ.. ఈ పథకం దేశాన్నే కదిలించిందని పేర్కొన్నారు. ఇలాంటి బ్రహ్మాండమైన పథకం దేశంలో, బహుశా ప్రపంచంలోనే ఎక్కడా ఉండకపోవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. దీనివల్ల 72 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలిగేలా భారీ ప్రణాళిక రూపొందించామన్నారు. బ్యాంకులలో నగదు కొరత రాకుండా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపామని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో ఇప్పటికే చర్చించగా.. అందుకు వారు సానుకూలత వ్యక్తం చేశారని వివరించారు. చెక్కుల

మిగతా 11వ పేజీలో



నాలుగో కేసులోనూ లాలూ దోషి

- దాణా స్కాంలో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు
- దుమ్కా ట్రెజరీ నుంచి అక్రమంగా నిధులు డ్రా చేసినట్టు నిర్ధారణ
- మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాను నిర్దోషిగా తేల్చిన కోర్టు

5

ఈతకు వెళ్లిన నలుగురు చిన్నారుల మృతి

3

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం
మృతులంతా 10-13 ఏండ్ల వయస్కులే

మే 8న దోస్త్ నోటిఫికేషన్

- షెడ్యూల్ జారీచేసిన ఉన్నత విద్యామండలి
- మూడుదశల్లో కౌన్సెలింగ్
- స్పాట్ కౌన్సెలింగ్‌పై నిర్ణయం తర్వాతే

3

స్వశక్తితో రాష్ట్రం పురోభివృద్ధి

సకలజనుల సౌభాగ్యమే సీఎం కేసీఆర్ లక్ష్యం

లౌకిక విధానంతో ముందుకెళుతున్నారని మజ్లిస్ నేత ప్రశంస

- బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనం
- పెద్ద రాష్ట్రాలు చేయలేని పని ఇక్కడ చేసి చూపిస్తున్నారు
- కేంద్రం నాలుగేండ్లుగా తగిన నిధులు ఇవ్వడం లేదు
- అందుకే రాష్ట్రం అప్పులు చేయాల్సి వస్తున్నది
- అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో అక్బరుద్దీన్ ఒవైసీ
- మైనార్టీలకు భారీ కేటాయింపులపై సీఎంకు కృతజ్ఞతలు

తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ


సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న అక్బరుద్దీన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు లౌకిక విధానంతో ముందుకు వెళుతున్నారని, అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశంసించారు. దేశంలోని పెద్దపెద్ద రాష్ట్రాలు చేయలేని పనిని చేసిచూపారని, మైనార్టీలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించి పెద్దపీట వేశారని చెప్పారు. రూ.మూడు లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మహారాష్ట్ర మైనార్టీలకు రూ.300 కోట్లు మాత్రమే కేటాయిస్తే తెలంగాణ రాష్ట్రం రూ.1.74 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. సెక్యులర్ విధానంలో ఎలా ముందుకు వెళుతున్నారో.. సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో చేసిన కేటాయింపులే కండ్లకు కడుతున్నాయని అన్నారు. కేంద్రం నుంచి సహకారం లేకున్నా, ఎన్ని వ్యతిరేక అంశాలున్నా

మిగతా 11వ పేజీలో

మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్

3

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఏప్రిల్ 20 వరకు గడువు
- 10 మైనార్టీ జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

లింగాయతులు, వీరశైవులకు మైనారిటీ హోదా!

5

- కేంద్రానికి సిఫారసు చేయనున్న కర్ణాటక సర్కారు
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు సంచలన నిర్ణయం



సోమవారం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో సమావేశమైన తెలంగాణ సీఎం కేసీఆర్



మమతతో భేటీ అనంతరం ఆమెతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ కవిత ఉన్నారు.



కోల్‌కతాలో కాళీమాతను దర్శించుకున్న సీఎం కేసీఆర్, ఎంపీలు కే కేశవరావు, కవిత

ఫ్రంట్‌కు అంకురార్పణ

మొదటిపేజీ తరువాయి...

కూడా ఈ వేదికపైకి తెస్తామని వెల్లడించారు.

ప్రజాచైతన్య వేదికగా ఫ్రంట్

ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాల్లో భాగంగా సోమవారం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకొన్న సీఎం కేసీఆర్‌కు పశ్చిమబెంగాల్ వ్యవసాయ శాఖ మంత్రి పూర్ణేనిబసు, ప్రభుత్వ అధికారులు ఘనస్వాగతం పలికారు. అక్కడినుంచి సచివాలయానికి వెళ్లిన సీఎం కేసీఆర్‌ను.. బెంగాల్ సీఎం మమతాబెనర్జీ పుష్పగుచ్ఛమిచ్చి సాదరంగా స్వాగతించారు. అనంతరం ఇద్దరు నేతలు బెంగాల్ సీఎం కార్యాలయంలో దాదాపు రెండుగంటలపాటు వర్తమాన దేశ రాజకీయాలు, మారుతున్న సమీకరణలపై ముఖాముఖి చర్చించారు. కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా బలమైన రాజకీయశక్తి తెర ముందుకు రావాల్సిన ఆవశ్యకతను కేసీఆర్ మమతకు వివరించారు. రాష్ట్రాలు బలోపేతం కావడంవల్లనే దేశం బలోపేతమవుతుందని పేర్కొన్నారు. డెబ్భై ఏండ్ల స్వతంత్ర భారతావనిలో ప్రజల జీవితాల్లో అనుకున్నమేరకు మార్పురాలేదన్న ఏకాభిప్రాయాన్ని ఇద్దరు ముఖ్యమంత్రులు వ్యక్తంచేసినట్లు తెలిసింది. జాతీయపార్టీలు చిన్నసైజు ప్రాంతీయ పార్టీలయ్యాయని, ఈ నేపథ్యంలో జాతీయస్థాయిలో ఒక సమిష్టి నాయకత్వం ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉన్నదని కేసీఆర్ అభిప్రాయపడగా, మమత.. తాను కూడా ఇదే తరహా అభిప్రాయంతో ఉన్నట్టు పేర్కొన్నారని సమాచారం. ఇదేదో రాజకీయ ఆరాటంగా కాకుండా.. దేశ భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చేలా, ప్రజాచైతన్య వేదికగా ఉండాలని ఇద్దరు నేతలు భావించినట్లు తెలిసింది.

మాది దేశంలోనే అతి పెద్ద రాజకీయ శక్తి: సీఎం కేసీఆర్

తాము ఏర్పాటు చేయాలనుకొంటున్న ఫెడరల్‌ఫ్రంట్ దేశంలోనే అతిపెద్ద రాజకీయశక్తిగా అవతరిస్తుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో సుదీర్ఘ చర్చల అనంతరం.. ఆమెతో కలిసి కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. తాము చేస్తున్న ప్రయత్నాన్ని కొందరు థర్డ్ ఫ్రంట్ అని తప్పుగా అర్థం చేసుకొంటున్నారని, 2019 ఎన్నికలకు ముందు పొలిటికల్ ఫ్రంట్ కడుతున్నట్టుగా భావిస్తున్నారని.. తమది ప్రజలకోసమే ఆవిర్భవిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ తప్ప.. ఎన్నికలకోసం మాత్రమే ఏర్పడే సాదాసీదా ఫ్రంట్ కాదని స్పష్టంచేశారు. 'ఇది దేశ ప్రజలకోసం ఏర్పాటుకానున్న ఫెడరల్‌ఫ్రంట్. నేను ఇటీవల హైదరాబాద్‌లో చెప్పాను. ఇప్పుడు మళ్లీ స్పష్టంచేస్తున్నదేమిటంటే.. ఇది ఏదో నాలుగైదు రాజకీయ పార్టీల పొత్తు కాదు. భారత ప్రజాసమూహాలను ఐక్యపరిచే ప్రక్రియ. దేశం గుణాత్మక దిశగా మార్పు చెందాల్సిన అత్యవసర పరిస్థితులు నెలకొన్నవనే విషయాన్ని మేము అర్థం చేసుకొన్నాం. ఆర్థికాభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్న దేశం మనది. చైనా వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలను మోడల్‌గా తీసుకోవాలి. అరవై శాతం పైగా యువశక్తి కలిగి ఉన్న దేశం మనది. సహజ వనరులు, యువత, ఖనిజసంపదతో అభివృద్ధి చెందేందుకు అత్యద్భుతమైన అవకాశాలు కలిగి ఉన్నది. మనకు ప్రకృతితోపాటు దేవుడు కూడా ఎంతో గొప్పగా సహకరిస్తున్నడు. చైనా, సింగపూర్ తదితర దేశాల మాదిరిగా ఆర్థికంగా ఎదుగడానికి నిర్దిష్ట ప్రణాళికలు అవసరం. ఆర్థికపరంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా మన వనరులను వాడుకుని ఇతర దేశాల కంటే ముందుగా వెళ్లాల్సిన అవసరమున్నది. అమెరికాలోని సిలికాన్‌వ్యాలీ అభివృద్ధిలో 60 శాతం భారతీయుల పాత్రే ఉన్నది. దేశంలో అపారమైన వనరులను ఉపయోగించుకుని, మానవ నైపుణ్యతను వెలికి తీయాల్సిన అవసరముంది. ఇలాంటి అనుకూల పరిస్థితులను అర్థం చేసుకోకుండా.. ఇంకా మూసధోరణితో కూడుకొన్న పరిపాలనను కాంగ్రెస్, బీజేపీలు కొనసాగించడం వల్ల దేశానికి ప్రయోజనం లేదు. ఈ సందర్భంలో అభివృద్ధిలో దేశ దశ, దిశను మార్చడానికి ప్రత్యామ్నాయ ప్రణాళిక, ప్రత్యేక ఎజెండా కావాలి.. దీనికోసం ప్రత్యామ్నాయ రాజకీయవేదికను నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాం' అని కేసీఆర్ తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో తమ భేటీ మంచి వాతావరణంలో జరిగిందని, సంప్రదింపులు, చర్చలు కొనసాగుతాయని, మంచి మార్పుకోసం కోల్‌కతా వంటి గొప్ప నగరంలో తొలి అడుగు పడిందని ఆయన పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తికి నిజమైన అర్థాన్నిచ్చే రియల్ ఫెడరల్‌ఫ్రంట్‌ను ఈ దేశానికి అందించే ప్రయత్నంలో ఉన్నామని, భావసారూప్యత కలిగిన పలువురు రాజకీయ నాయకులతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, అందరితో కలిసి ఏకాభిప్రాయాన్ని సాధించిన తర్వాత ఒక బలమైన ఫ్రంట్‌ను తెర ముందుకు తెస్తామని తెలిపారు. అన్నిరకాల సానుకూలతల మధ్య తమ ప్రయత్నం ఫలించి దేశం పరిఢవిల్లుతుందని ఆశిస్తున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.

దేశంలో బీజేపీ కాంగ్రెసేతర ఫ్రంట్ ఏర్పాటు, ఎన్నికల తర్వాత బయటి నుంచి మద్దతుల ప్రస్తావన చేసిన విలేకరులకు ముఖ్యమంత్రి కేసీఆర్ తమ లక్ష్యాలను విస్పష్టం చేశారు. ' మీరు రొటీన్ పద్ధతుల్లో ఆలోచిస్తున్నారు. క్షమించండి. మేం ఏర్పాటుచేయబోయే ఫ్రంట్ గొప్పదిగా రూపుదిద్దుకోనున్నది. కారణం.. మేం ఎంచుకోబోయే ఎజెండా అటువంటిది. వర్తమాన రాజకీయ మూస పద్ధతులకు పూర్తి భిన్నమైనది. ఏదో మామూలు పద్ధతుల్లో.. బీజేపీ, కాంగ్రెస్, కేసీఆర్, మమతలకు సంబంధించిన ఎజెండా కాదు. ఇది ప్రజల ఎజెండా. మా ఎజెండా దేశ ప్రజల కోసం అనేది మీకు భవిష్యత్తులో అర్థమవుతుంది. మీకు వినమ్రంగా చెప్పదలుచుకున్నది ఏమంటే.. ఇది ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్న ఆలోచనావిధానం. దీనికి గొప్ప ప్రాంతమైన కోల్‌కతాలో అంకురార్పణ జరిగింది. నాకు చాలా సంతోషం. మీకు తోచిన పద్ధతుల్లో మా ఫ్రంట్ గురించిన ఆలోచనలు చేయొద్దని మిమ్మల్ని కోరుతున్నా. మీరు చదువుకొన్న యువతీయువకులు, మీరు కూడా దేశాభివృద్ధికోసం ఆలోచించాల్సిన సమయమిది. 71ఏండ్లుగా రొటీన్ రాజకీయాలే సాగుతున్నాయి. అయితే కాంగ్రెస్ లేదా బీజేపీ. కాంగ్రెస్‌పై కోపం వస్తే బీజేపీ, బీజేపీపై కోపం వస్తే కాంగ్రెస్ ఇదేనా.. దీనివల్ల ఏమైతది. ఇస్ దేశ్‌మే కుచ్ చమత్కార్‌కా జరూరత్ హై..(ఈ దేశంలో చమత్కారం జరుగాల్సిన అవసరంఉన్నది.). మీరు విప్లవాత్మకంగా ఆలోచించేవారు. ఈ దేశం గొప్ప మార్పును చూడాల్సి ఉన్నది. ఈ దేశాన్ని పునర్నిర్వచించుకోవలసి ఉన్నది. ఈ దేశాన్ని పునర్నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉన్నది' అని కేసీఆర్ అన్నారు.

ఇది కేవలం రాజకీయ పార్టీలను ఒక వేదికపైకి తేవడానికి జరుగుతున్న ప్రయత్నం మాత్రమే కాదు. ప్రజలను ఏకంచేయడం, సరికొత్త అభివృద్ధి వైపు నడుపడం ఫ్రంట్ ప్రధాన లక్ష్యమని కేసీఆర్ స్పష్టంచేశారు. జాతి ప్రయోజనాలకోసం ఏర్పడుతున్న రియల్ ఫెడరల్‌ఫ్రంట్‌కు అందరూ సహకరించాలని కోరారు.

ఉమ్మడి నాయకత్వమే ఉంటుంది

నాయకత్వంపై విలేఖరులకు అడిగిన ప్రశ్నకు సీఎం కేసీఆర్ విస్పష్టంగా సమాధానం చెప్పారు. 'మీరేం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉమ్మడి నాయకత్వమే ఉండబోతున్నది. ఈ విషయంలో మీకు ఆందోళన అక్కరలేదు. ఈ విషయంపై మీరు అతిగా స్పందించకండి. నేను మరోసారి మీడియా మిత్రులను కోరుతున్నా. మీరు మాకు సహకరించండి. దేశం మారాల్సిన అవసరం ఉన్నది. విప్లవాత్మక మార్పు రావాల్సిన అవసరం ఉన్నది. ప్రతి అంశాన్ని పిన్‌పాయింట్ చేయకండి. దేశంకోసం కలెక్టివ్ లీడర్‌షిప్.. ఫెడరల్ లీడర్ నాయకత్వమే ఉంటుంది' అని కేసీఆర్ స్పష్టంచేశారు.



కోల్‌కతా పర్యటనకు బయలుదేరే ముందు అసెంబ్లీ లాబీలో సీఎం కేసీఆర్‌కు ఇమామే జామిన్‌ను కడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు



కోల్‌కతా సచివాలయంలో పశ్చిమబెంగాల్, తెలంగాణ ముఖ్యమంత్రులు మమతాబెనర్జీ, కేసీఆర్‌తో ఎంపీ కవిత సెల్ఫీ

కేసీఆర్‌తో ఏకీభవిస్తున్నా.. బలమైన ఫెడరల్ ఫ్రంట్‌ను కోరుకుంటున్నాం: మమత

దేశంలో బలమైన ఫెడరల్‌ఫ్రంట్‌ను కోరుకొంటున్నామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అన్నారు. రాష్ట్రాలు బలంగా ఉన్నప్పుడే దేశం పటిష్ఠంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశంలో ఒకేపార్టీ గుత్తాధిపత్యం ఉండరాదని అన్నారు. ఆ దిశలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. 'ఇది మంచి అడుగు, శుభారంభం'గా మమత అభివర్ణించారు. దేశ రాజకీయాల కోసం జాతీయ ప్రయోజనాలకోసం తమ మధ్య చర్చలు జరిగాయన్నారు. 'ఇది ఒక మంచి శుభపరిణామం. రాజకీయాలు నిరంతర ప్రక్రియ. ప్రభుత్వానిది నిరంతర అభివృద్ధి ప్రక్రియ. మేము ఇండియాను ఒక దేశంగా ప్రేమిస్తాం. మారుతున్న భారత రాజకీయాల నేపథ్యాన్ని చర్చించాం. రైతులు, ఇతర వర్గాలకు చెందిన సమస్యలకు సరైన పరిష్కార మార్గాలు రూపొందించుకోవాల్సిన ప్రణాళికలు ఏమిటన్నదానిమీదా చర్చించాం. మేం ఇప్పుడే చర్చలు ప్రారంభించాం. నిజమే.. బలమైన ఫెడరల్ ఫ్రంట్ అవసరం ఉన్నది. రాష్ట్రాలు బలంగా ఉన్నప్పుడు మాత్రమే కేంద్రం బలంగా ఉంటుంది. మేం అందరం ఎల్లప్పుడూ ఒక ఉమ్మడి కుటుంబంగా కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఇతర పార్టీలతో చర్చించాల్సి ఉన్నది. ఈ విషయంలో మాకు ఆత్రం ఏమీ లేదు. ఈరోజే ఏదో చేసేయాలనే తొందరలో ఏమీ లేము. దేశంకోసం రాజకీయ వేదికను రూపొందించేందుకు, ప్రజాసంక్షేమ కార్యక్రమాల రూపకల్పన దిశగా చర్చించాం.' అని మమత వివరించారు. మారుతున్న రాజకీయ పరిస్థితులను అనుసరించి అందరం కలిసి పనిచేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతుంటాయని, ప్రజాస్వామ్యంలో అందరం కలిసి పనిచేయడం గొప్ప విషయమని మమత అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలు ఫ్రంట్ రూపంలో ఏకమైతే ప్రధాన ప్రతిపక్షం బలహీనపడి బీజేపీకి మంచి జరుగుతుందన్న ఓ విలేకరి ప్రశ్నను ఆమె ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏదో ఒక పార్టీ మాత్రమే దేశాన్ని ఏలాలి.. దానికిష్టం వచ్చిన రీతిలో వ్యవహరించాలంటే కుదురదని స్పష్టంచేశారు. ప్రతి రాజకీయపార్టీకి ప్రాంతీయ గుర్తింపుతో పాటు, జాతీయ గుర్తింపును కలిగి ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

'మా చర్చలు, సంప్రదింపులు ఇకముందు కూడా కొనసాగుతాయి. కేసీఆర్‌కు ఈ విషయంలో మంచి అవగాహన ఉన్నది. ఆయన అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తున్నాను. మేము మిగతా పార్టీలతో సఖ్యతగా ఉంటాం, వారిని కలుపుకొని దేశం కోసం పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తాం' అని మమత విలేకరులతో అన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి త్వరలో చర్చించి ఒక రూపమిస్తామని, ఫెడరల్ ఫ్రంట్‌పై తాము తొందరపడటం లేదని.. దేశ ప్రయోజనాల కోసం నిదానంగా.. బలంగా అడుగులు వేస్తామని ఇద్దరు ముఖ్యమంత్రులు విలేకరుల సమావేశంలో సంయుక్తంగా ప్రకటించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట ఎంపీలు కే కేశవరావు, కల్వకుంట్ల కవిత, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మిత సబర్వాల్, ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి కోల్‌కతా వెళ్లారు.





ముహూర్తం

సూర్యోదయం: 6.24 గంటలకు

సూర్యాస్తమయం: 6.23 గంటలకు

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం తదియ సాయంత్రం 4.52 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: అశ్విని రాత్రి 7.45 వరకు తదుపరి భరణి, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 4.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.48 నుంచి 9.36 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.23 నుంచి 3.11 వరకు, వర్జ్యం: రాత్రి 9.18 నుంచి 10.54 వరకు.

లోకం పోకడ



దేశ రాజకీయాల్లో కీలక పరిణామం

- ఫెడరల్ ఫ్రంట్ దిశగా సీఎం కేసీఆర్ తొలి అడుగు
- తొలి పర్యటన సక్సెస్.. త్వరలో మలి యాత్ర
- కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికిన మమతాబెనర్జీ
- ఇరువురి భేటీపై జాతీయ రాజకీయ నేతల్లో ఆసక్తి
- రోజంతా జాతీయ చానళ్లలో చర్చోపచర్చలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకరావడానికి ఏర్పాటుచేయనున్న ఫెడరల్ ఫ్రంట్ విషయంలో కీలకమైన ముందడుగు పడింది. దేశ రాజకీయాల్లో కీలకమైన నేతగా ఉన్న పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీతో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు భేటీ విజయవంతమైంది. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై ఇద్దరు నేతల తొలి భేటీపై జాతీయస్థాయిలో అనేక రాజకీయపార్టీలు ఆసక్తి చూపాయి. జాతీయ, ప్రాంతీయ మీడియా ఈ అంశం మీదే రోజంతా వార్తాకథనాలు, చర్చలు ప్రసారం చేసింది. పలువురు జాతీయపార్టీల నేతలు బెంగాల్‌కు చెందిన నాయకులద్వారా సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది. ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా భవిష్యత్‌లో మరిన్ని సమావేశాలు, పర్యటనలు జరుగుతాయని ఈ సందర్భంగా ఇరువురు సీఎంలు ప్రకటించడం విశేషం. సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. టీఆర్ఎస్ ఎంపీలతో పలు రాష్ట్రాలకు సంబంధించిన వివిధ పార్టీల నేతలు ఇప్పటికే సంప్రదిస్తున్నారు.

కేసీఆర్‌కు ఘనస్వాగతం

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేయాలనే ఆకాంక్షను ప్రకటించిన సీఎం కేసీఆర్ తొలి పర్యటనకు కోల్‌కతాను ఎంచుకున్నారు. అసెంబ్లీ నుంచి సోమవారం మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో కోల్‌కతాకు బయలుదేరారు. ఆయన వెంట టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, సీఎంవో అధికారులు ఉన్నారు. సీఎం కేసీఆర్‌కు కోల్‌కతా సుభాష్‌చంద్రబోస్ విమానాశ్రయంలో బెంగాల్ వ్యవసాయశాఖ మంత్రి పూర్ణేందుబసు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి తాజ్‌బెంగాల్ హోటల్‌కు, ఆ తర్వాత బెంగాల్ సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అపూర్వ స్వాగతం పలికారు. 14 అంతస్తులు దిగివచ్చి ప్రవేశ ద్వారం వద్ద నిల్చున్నారు. దాదాపుగా ఐదు నిమిషాలపాటు కేసీఆర్ కోసం వేచిచూశారు. స్వయంగా ఆమె సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి హార్దిక స్వాగతం పలికారు. ఎంపీ కవిత కోసం వాకబు చేసిన మమత.. కవిత వాహనం వచ్చేవరకు అక్కడే ఉండి అందరినీ సాదరంగా తోడ్కొని చాంబర్‌కు వెళ్లారు. దాదాపుగా రెండుగంటలపాటు ఇద్దరు సీఎంలు ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలు, ఎజెండా, రెండు జాతీయపార్టీల వైఖరి, కలిసివచ్చే పార్టీల నేతలు ఎవరనేదానిపై మాట్లాడుకున్నారు. భేటీ ముగిసిన తర్వాత కేసీఆర్‌కు వీడ్కోలు పలికేందుకు మరోసారి 14 అంతస్తులు దిగివచ్చారు. అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశాన్ని నిర్వహించి భేటీ వివరాలు, లక్ష్యాలను వెల్లడించారు. ఇరువురి మధ్య మరోదఫా భేటీ కూడా జరిగే అవకాశమున్నదని తెలుస్తున్నది. కోల్‌కతాకు వచ్చిన కేసీఆర్‌కు బెంగాల్ ప్రభుత్వం భారీ కాన్వాయ్ ఏర్పాటుచేసింది. ఈ స్థాయిలో కాన్వాయ్‌ను గతంలో ఏ ఇతర రాష్ట్ర లేదా జాతీయ నేతకు ఏర్పాటు చేయలేదని సమాచారం. కేసీఆర్ రాక నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జాతీయ, స్థానిక మీడియా సచివాలయానికి వచ్చింది.

కలకత్తా కాళిని దర్శించుకున్న సీఎం

సీఎం కేసీఆర్ సోమవారం సాయంత్రం కోల్‌కతాలోని సుప్రసిద్ధ కాళీమాత ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. 2005లో కేంద్ర కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఈ ఆలయాన్ని సందర్శించారు. అప్పుడే ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే తిరిగి వస్తానని కేసీఆర్ మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో కాళీమాతను దర్శించుకొని మొక్కులు చెల్లించి పూజలు చేశారు.

నేడు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మాక్‌పోలింగ్

రాజ్యసభ ఎన్నికలకు సమాయత్తం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌పై పార్టీ ఎమ్మెల్యేలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని టీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం తెలంగాణభవన్‌లో మాక్ పోలింగ్ జరుగనున్నది. దీనికోసం నమూనా బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. మూడు స్థానాల ఎన్నిక కోసం ఈ నెల 23న ఓటింగ్ జరుగనున్నది. ఈ స్థానాల్లో టీఆర్ఎస్ తరపున జోగినపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్ బరిలో నిలిచారు. ఎమ్మెల్యేలకు ఓటు వేయడంపై ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసేందుకు మాక్‌పోలింగ్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ జరిగే రోజు ఉదయం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యేలందరు మరోసారి భేటీ కానున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థులకు ఎంఐఎం ఇప్పటికే మద్దతును ప్రకటించింది. దీంతో మూడు సీట్లను పార్టీ సులువుగా గెలుచుకుంటుందని పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలు

ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

2018-19 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్రంలోని 204 మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టెమ్రీస్) సోమవారం జారీచేసింది. 5వ తరగతిలో అన్ని సీట్లను, 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేయనున్నట్లు టెమ్రీస్ వెల్లడించింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 20 లోగా ఆన్‌లైన్ ద్వారా tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 75 శాతం సీట్లను మైనార్టీ విద్యార్థులతో, 25 శాతం సీట్లను మైనార్టీయేతర విద్యార్థులతో భర్తీ చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి నాంపల్లి హజ్‌హౌస్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇతర వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్ 040-23437909కు ఫోన్ చేయవచ్చు.

10 జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

మైనార్టీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో కొత్తగా 10 జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి పంపించినట్లు టెమ్రీస్ కార్యదర్శి షఫిఉల్లా సోమవారం తెలిపారు. సీఎం నుంచి అనుమతి రాగానే అవసరమైతే కొత్త విద్యాసంవత్సరం నుంచి ఈ కాలేజీలు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రెండు రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు తెలంగాణలో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం 204 గురుకుల పాఠశాలలు, రెండు గురుకుల జూనియర్ కాలేజీల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ఒక్కొక్క విద్యార్థిపై లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది టెమ్రీస్‌కు గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా రూ.735 కోట్ల నిధులు కేటాయించారని వెల్లడించారు. వచ్చే విద్యాసంవత్సరం (2019-20) నుంచి మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. గురుకులాల్లో ఇంగ్లిష్ మీడియంలో ఉర్దూ, తెలుగు భాషలు లాంగ్వేజీలుగా విద్యాబోధన కొనసాగుతున్నదని చెప్పారు. గురుకుల విద్యార్థులకు రోబోటిక్స్, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని, ఆరుగురు విద్యార్తులు ఒక ప్రాజెక్టును రూపొందించి నాసాకు పంపించారని వివరించారు. ఏప్రిల్ లేదా మే నెలలో జరిగే రోబోటిక్స్ లీగ్‌లో మైనార్టీ గురుకుల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం మైనార్టీ గురుకులాల్లో 48,200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.



సోమవారం హజ్‌హౌస్‌లో మైనార్టీ గురుకులాల ప్రవేశాలపై రూపొందించిన ప్రాస్పెక్టస్‌ను విడుదల చేస్తున్న టెమ్రీస్ కార్యదర్శి షఫిఉల్లా, జాయింట్ సెక్రటరీ లియాఖత్‌హుస్సేన్, అదనపు కార్యదర్శి దిలావర్ తదితరులు

ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు మృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం

టేకులపల్లి, నమస్తే తెలంగాణ: ఈత సరదా మరో నలుగురు చిన్నారుల జీవితాన్ని చిదిమేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లిలో ఒంటిపూట బడులు ముగిసిన తర్వాత ఈతకు వెళ్లిన నలుగురు విద్యార్థులు చెరువులో మునిగిపోయి మృత్యువాత పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లావుడ్యా రత్న కుమారుడు సౌజన్ (13) ఎనిమిదో తరగతి, భూక్య నగేశ్ కుమారుడు సిద్ధు (11) ఏడో తరగతి, బానోతు శంకర్ కుమారుడు సంతోష్ (10) ఐదో తరగతి, బానోతు రత్న కుమారుడు దిలీప్ (10) ఐదో తరగతి విద్యార్థులు స్థానిక బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్నారు. వీరంతా సోమవారం సాయమ్మ చెరువులో ఈతకు వెళ్లారు. ఒక్కసారిగా చెరువులోకి దిగడం, సరాసరి లోతులోకి వెళ్లడం, ఎవరికీ ఈత రాకపోవడంతో మృతిచెందినట్లుగా స్థానికులు చెప్తున్నారు. చేపల వేటకు వెళ్లిన స్థానికులకు చిన్నారుల మృతదేహాలు కనిపించాయి. తహసీల్దార్ సరికొండ అంజంరాజు, టేకులపల్లి, బోడు ఎస్సైలు గడ్డం ప్రవీణ్‌కుమార్, అరుకుల అనిల్‌కుమార్ సంఘటనాస్థలం వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతదేహాలను కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మే 8న దోస్త్ నోటిఫికేషన్

- మూడుదశల్లో కౌన్సెలింగ్
- స్పాట్ కౌన్సెలింగ్‌పై నిర్ణయం తర్వాతే
- డిగ్రీ కాలేజీలకు జియోట్యాగింగ్, యాప్ రూపకల్పన
- దోస్త్-2018 కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు
- షెడ్యూల్ జారీచేసిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు మే 8న నోటిఫికేషన్ విడుదల చేయాలని దోస్త్ -2018 అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు షెడ్యూల్‌ను జారీచేశారు. మే 10 నుంచి 26 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు, రూ.400 ఆలస్య ఫీజుతో మే 29 వరకు గడువు విధించడంతోపాటు మూడుదశల్లో అడ్మిషన్లు నిర్వహించాలని నిర్ణయించారు. జూన్ 30 వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేసి, జూలై రెండు నుంచే తరగతులను ప్రారంభించాలని సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశమైన దోస్త్ అడ్మిషన్ల కమిటీ నిర్ణయించింది. సమావేశం అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీబీసీఎస్ విధానంలో, విద్యాక్యాలెండర్ ప్రకారం దోస్త్-2018 అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని బీకాం కాలేజీల్లో ప్రవేశాలు పొందే విధానాల్లో మార్పులు తీసుకొచ్చామన్నారు. సీఈసీ వారికి బీకాంలో 60 శాతం సీట్లు, ఇతర గ్రూపుల వారికి 40 శాతం, హెచ్‌సీఈ వారికి బీఏలో 60 శాతం, ఇతర గ్రూపులకు 40 శాతం, బీఎస్సీలో ఎంపీసీ వారికి 50 శాతం, బైపీసీ వారికి 50 శాతం చొప్పున సీట్లు కేటాయించినట్టు వెల్లడించారు. ఏప్రిల్ 20లోగా కాలేజీల వివరాలు దోస్త్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. గతంలో దోస్త్ పరిధిలోకి రాని కాలేజీలకు కూడా ఈసారి అవకాశం కల్పించినట్టు పాపిరెడ్డి తెలిపారు. అడ్మిషన్లతో ఈ పాస్, ఎంసెట్ అడ్మిషన్లను అనుసంధానం చేస్తున్నట్టు వివరించారు. దీనివల్ల మోసాలు, నకిలీ ప్రవేశాలు ఉండవన్నారు. డిగ్రీ కాలేజీల గుర్తింపు కోసం జియో ట్యాగింగ్ చేశామనని చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎస్ఎంఎస్ ద్వారా దోస్త్ సూచనలు పంపించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇంటర్ ఫలితాలు, దోస్త్ మార్గదర్శకాల అనుసంధానం, రిజిస్ట్రేషన్ ఫీజు తదితర అంశాల గురించి చర్చించామని వివరించారు. దోస్త్-2018కి సంబంధించి ప్రత్యేక యాప్ రూపొందించనున్నట్టు చెప్పారు. స్పాట్ కౌన్సెలింగ్‌పై తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. దోస్త్ అడ్మిషన్లకు సంబంధించి సూచనల పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్, దోస్త్ కన్వీనర్ లింబాద్రి, వైస్ చాన్స్‌లర్లు పాల్గొన్నారు.


దోస్త్-2018 షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి , విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్, దోస్త్ కన్వీనర్ లింబాద్రి తదితరులు

దోస్త్-2018 షెడ్యూల్ వివరాలు

దోస్త్ నోటిఫికేషన్	మే 8న
వెబ్ దరఖాస్తుల ప్రారంభం	మే 10 నుంచి 26 వరకు
రూ.400 ఆలస్య రుసుంతో	మే 27 నుంచి 29 వరకు
తొలిదశ సీట్ అలాట్‌మెంట్	జూన్ 4న
కాలేజీల్లో రిపోర్టింగ్ తేదీ	జూన్ 5 నుంచి12 వరకు
రెండోదశ వెబ్ ఆప్షన్లు	జూన్ 13 నుంచి 14 వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 19న
రిపోర్టింగ్ తేదీలు	జూన్ 20 నుంచి 25 వరకు
మూడోదశ వెబ్ కౌన్సెలింగ్	జూన్ 26 నుంచి 27వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 30న
రిపోర్టింగ్	జూలై 2 నుంచి 4 వరకు
తరగతులు ప్రారంభం	జూలై 2 నుంచి..

పౌష్టికాహారం సరఫరాకు 103.62 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పౌష్టికాహారం సరఫరా కోసం 103 కోట్ల 62 లక్షలు 47 వేల నిధులను మహిళాశిశు సంక్షేమం, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంజూరుచేసింది. నిధుల విడుదలకు సంబంధించి సోమవారం ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం జగదీశ్ ఉత్తర్వులు జారీచేశారు.

543 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మత్తుపదార్థాలు రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని డీఆర్ఐ అధికారులు సోమవారం తార్నాక సమీపంలో పట్టుకున్నారు. ఇందులో 543 కిలోల గంజాయి ఉన్నదని, దీని విలువ రూ.81 లక్షలు ఉంటుందని డీఆర్ఐ హైదరాబాద్ జోన్ అడిషనల్ డైరెక్టర్ ఎంకే సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామని చెప్పారు. ఒకరిని అదుపులోకి తీసుకొన్నామని, దర్యాప్తు కొనసాగుతున్నదని వివరించారు.



కర్ణాటకలో లౌకిక వాదానికి, మతోన్మాదానికి మధ్య ఎన్నికల పోరు జరుగుతున్నది. మతవాదాన్ని ఓడిస్తాం. కర్ణాటకలో గెలిచి రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తాం. ఆయన నాయకత్వాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు.

సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి



సర్దార్ మన్మోహన్‌సింగ్ మౌనంగా ఉండటం మూలంగానే బీజేపీ గొప్పలు పోతూ గోల చేస్తున్నది. సింగ్ నిశ్శబ్దాన్ని వీడాలి. దేశాభివృద్ధి తాబేలులా నడుస్తుండటానికి కారకులెవరో చెప్పాలి. గొప్పగా తీర్చిదిద్దిన ఆర్థికవ్యవస్థను నాశనం చేసిందెవరో ప్రజలకు తెలుపాలి.

నవజ్యోత్ సింగ్ సిద్ధూ, పంజాబ్ మంత్రి

చరిత్రలో నేడు



1739

ఢిల్లీని ఆక్రమించిన ఇరాన్ పాలకుడు నాదిర్షా.

1800

'ఎలక్ట్రిక్ బ్యాటరీ'ని కనుగొన్న ఎలిసాండ్రో వోల్టా.





1977

ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఓటమి.

ఎట్టకేలకు గో రక్షకులకు ముకుతాడు పడింది. యూపీ దాద్రిలో అఖ్లాక్ అనే వ్యక్తిని హత్యచేసిన నేరస్థులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు శిక్షవేసింది. ఘటన జరిగి 30 నెలలు గడిచిన నేపథ్యంలో ఈ తీర్పు దేశవ్యాప్తంగా జరిగిన ఇలాంటి ఘటనల్లో తగు న్యాయం దక్కుతుందన్న సంకేతం అందినట్లు అయ్యింది. జార్ఖండ్‌లో కూడా మరో కేసులో నేరస్థులకు శిక్షపడింది. ఏదేమైనా గో రక్షకుల పేరుతో జరిగిన ఆగడాలపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సత్వర తీర్పులతో దోషులను శిక్షించటం ముదావహం.

ది హిందూ

ఆధునికాభివృద్ధి, నాగరిక జీవితానికి ప్లాస్టిక్ పెనుప్రమాదంగా తయారైంది. ప్లాస్టిక్ వ్యర్థాలు సర్వత్రా దర్శనమిస్తున్నాయి. నదీ, సముద్రతీరాలన్నీ, భూ ఉపరితలమంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నది. ఏటా ప్రపంచవ్యాప్తంగా 300 టన్నుల ప్లాస్టిక్ వస్తువులు తయారై వినియోగించబడుతున్నాయి. అవన్నీ వ్యర్థాలుగా పర్యావరణానికీ, మనిషి ఆరోగ్యానికీ పెను ప్రమాదంగా తయారయ్యాయి. తాగే నీటిలోనూ ప్లాస్టిక్ వ్యర్థాలు సూక్ష్మస్థాయిలో ఉండి ఆరోగ్యాన్ని బలి తీసుకుంటున్నాయి. పాలిప్రొపిలిన్, పాలిఇథిలిన్, టెరిపాథలేట్ లాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు మనిషి ఆరోగ్యానికి తీవ్ర హాని చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్లాస్టిక్ వ్యర్థాల భూతాన్ని అంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

పుతిన్ ఘన విజయం

రష్యా అధ్యక్షుడిగా పుతిన్ మరో పర్యాయం ఘన విజయం సాధిస్తారనేది ప్రపంచమంతా ఊహించిందే. ప్రపంచంలో రష్యాను ఒక ప్రధాన శక్తిగా నిలుపు తున్నందుకు రష్యాలో ఆయనకు తిరుగులేని మద్దతు లభిస్తున్నది. 76.6 శాతం ఓట్లు పొందిన పుతిన్‌కు దరిదాపులలో ప్రత్యర్థులు అంటూ లేరు. పుతిన్ తరువాత రెండవ స్థానంలో నిలిచిన పావెల్ గ్రడినిన్‌కు 11.8 శాతం ఓట్లు లభించాయి. మూడు, నాలుగవ స్థానాల్లోని అభ్యర్థులకు లభించిన ఓట్లు నామమాత్రమే. పుతిన్ అధ్యక్ష పదవికి పోటీ చేయడం ఇది నాలుగవ సారి. దేశాధ్యక్ష పదవికి రెండు పర్యాయాలకు మించి పోటీ చేయకూడదనే నిబంధన ఉండటంతో ఆయన 1999 నుంచి అధ్యక్ష, ప్రధాని పదవులకు పోటీ చేస్తూ దేశంలో తిరుగులేని అధికారాన్ని చలాయిస్తున్నారు. రష్యన్లు సోవియెట్ పాలనలో స్టాలిన్ తరువాత ఇంత సుదీర్ఘ కాలం ఏలిన నేతను చూడటం ఇదే మొదటిసారి. ప్రధాన ప్రత్యర్థిని ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించారనే విమర్శ ఒకటి పుతిన్‌పై ఉన్నది. అయితే ఆ ప్రధాన ప్రత్యర్థి రంగంలో ఉన్నప్పటికీ, పుతిన్ గెలిచేవారనేది ఆయనంటే గిట్టని యూరోపియన్ రాజకీయ విశ్లేషకులు కూడా అంగీకరిస్తారు. తమ వ్యతిరేక దేశాల నాయకులలో అవలక్షణాలను ఆపాదించి, బదనాం చేయడం యూరోపియన్ పత్రికలకు అలవాటే. రష్యా ఎన్నికలలో అక్రమాలు జరిగాయని ప్రచారం కూడా జోరుగా సాగుతున్నది. పుతిన్‌ను నాటో దేశాల నాయకులెవరూ వెంటనే అభినందించడం లేదు. ఎవరు ఏమన్నా రష్యాలో పుతిన్‌కున్న ప్రతిష్ఠ కాదనలేనిది. ఆయన ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ద్వారా గెలిచారనేది వాస్తవం.

పుతిన్ ఇంకా ఆరేండ్లు, అంటే 2024 వరకు రష్యా అధ్యక్షుడిగా ఉంటారు. రష్యా రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తానని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతానని ఆయన కొత్తగా ఎన్నికైన సందర్భంగా ప్రకటించారు. లిబియాతో సహా పాత సోవియెట్ అనుకూల రాజ్యాలలో పట్టు కోసం కూడా ఆయన ప్రయత్నిస్తారు. మధ్య ఆసియాలో రష్యా ప్రాబల్యం చెక్కుచెదిరే విధంగా లేదు. రష్యా, అమెరికాలో మాదిరిగానే యూరప్‌లో జాతీయవాదశక్తులు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో యూరోపియన్ జాతీయవాద పోకడలకు ప్రతిగా రష్యా, చైనా దేశాలలో బలమైన నాయకులు ఆవిర్భవించారు.

సోవియెట్ యూనియన్ కుప్పకూలిన తరువాత, అక్కడ అమెరికా అనుకూల శక్తులదే పెత్తనం నడిచేది. రష్యా నుంచి విడిపోయిన సోవియట్ రిపబ్లిక్‌లలో అమెరికా సైన్యాలు తిష్టవేశాయి. ఒకప్పుడు అగ్రరాజ్యమైన తమకు ఈ గతి పట్టింది కదా అని రష్యా ప్రజలు కుమిలిపోతున్న దశలో పుతిన్ అధికారానికి వచ్చారు. కమ్యూనిస్టు పార్టీ శిథిలాలలో నుంచి ఎదిగిన జాతీయవాద దృక్పథం కలిగిన మాజీ గూఢచారులు, నాయకులు, ఇతర రంగాల వారు ఏకమైన నేపథ్యంలో వారి ప్రతినిధిగా పుతిన్ అధికారాన్ని చేపట్టగలిగారు. అధికారానికి వచ్చిన తరువాత ఆయన ఆర్థిక సంక్షోభంలో ఉన్న రష్యాను గట్టెక్కించారు. మరోవైపు అగ్రరాజ్యమైన అమెరికాను తన పొరుగుదేశాలలో స్థానం లేకుండా చేశారు. క్రమంగా రష్యాను మళ్ళా ప్రాబల్య రాజ్యంగా తీర్చిదిద్దారు. కృత్రిమ ఉద్యమాలు నడిపించడం, ప్రభుత్వాలను కూలదోయడం నాటో దేశాలకు అలవాటే. కానీ అంతే దృఢంగా, దురుసుగా పుతిన్ వ్యవహరించడం యూరప్ దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. సిరియా ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికా తన సేనలను పంపినప్పుడు, రష్యా రంగంలోకి దిగి అడ్డుకున్నది. రష్యా అధ్యక్ష ఎన్నికలకు ముందు పరిణామాలు గమనార్హమైనవి. గూఢచారిపై దాడి కేసులో రష్యాను పశ్చిమ యూరప్ దేశాలు రష్యాను దాదాపుగా బహిష్కరించాయి. మరోవైపు అమెరికా ఎన్నికలలో తలదూర్చారనే ఆరోపణలతో రష్యా ప్రముఖులపై ఆంక్షలు వచ్చి పడ్డాయి. ఇవన్నీ పుతిన్‌ను బలహీనపరుచలేదు సరికదా, రష్యా ప్రజలలో ఆయన స్థానాన్ని మరింత సుస్థిర పరిచాయి. ఏ నాయకుడైనా దేశాన్ని బలంగా తీర్చిదిద్దితే, ప్రజల జీవన స్థితిగతులను మారిస్తే, ఎన్నిక కాకపోవడమంటూ ఉండదనడానికి పుతిన్ ప్రాభవం ఉదాహరణ.

పుతిన్ ఇంకా ఆరేండ్లు, అంటే 2024 వరకు రష్యా అధ్యక్షుడిగా ఉంటారు. రష్యా రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తానని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతానని ఆయన కొత్తగా ఎన్నికైన సందర్భంగా ప్రకటించారు. లిబియాతో సహా పాత సోవియెట్ అనుకూల రాజ్యాలలో పట్టు కోసం కూడా ఆయన ప్రయత్నిస్తారు. మధ్య ఆసియాలో రష్యా ప్రాబల్యం చెక్కుచెదిరే విధంగా లేదు. రష్యా, అమెరికాలో మాదిరిగానే యూరప్‌లో జాతీయవాదశక్తులు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో యూరోపియన్ జాతీయవాద పోకడలకు ప్రతిగా రష్యా, చైనా దేశాలలో బలమైన నాయకులు ఆవిర్భవించారు. పుతిన్‌కు తోడు, రష్యాలో జిన్‌పింగ్ మరింత బలపడ్డారు. ట్రంప్ ఇప్పుడున్న అంతర్జాతీయ వ్యవస్థల పట్ల ఏ మాత్రం గౌరవం చూపడం లేదు. అమెరికా బలహీనపడే కొద్దీ ట్రంప్ విధానాలు బలపడుతయి. చైనా ఆర్థిక– సైనిక శక్తిగా బలపడుతున్నది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతం మొదలుకొని, దక్షిణాసియా, ఆఫ్రికా వరకు తన ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నది. బలమైన నాయకులు పుట్టుక రావడం వల్ల ఆయా దేశాలు బలపడటం బాగానే ఉంటుంది. కానీ ఆంతరంగికంగా ప్రజాస్వామ్య వ్యవస్థలు బలోపేతం కావడం లేదు. ప్రపంచీకరణ విధానాలు కొద్దీ ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో బలహీన దేశాలు తమ ప్రయోజనాలు కాపాడుకోవడం కష్టమవుతుంది. అంతర్జాతీయ వ్యవస్థలు కూడా బలహీనపడుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా జాతీయవాదశక్తులు బలపడేలోగా అంతర్జాతీయ వ్యవస్థలను బలోపేతం చేయడం అవసరం. లేకపోతే బలమైన రాజ్యాల మధ్య ప్రపంచ దేశాలు తల్లడిల్లిపోతాయి.

జనగళం

దేశానికే ఆదర్శం

రైతే రాజ్యం ఏలాలి. మన రైతుకు రక్షణ కావాలి అనే పాట ఎన్నాళ్లకో అక్షర సత్యం అయింది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి రూపొందించిన మన బడ్జెట్ దేశానికే మార్గదర్శిగా ఉన్నది. వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్దపీట వేశారు. రైతు లక్ష్మి, విద్యుత్, మహిళా శిశు సంక్షేమం, మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయడం హర్షణీయం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదపడుతుంది. ఇప్పటికే రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను చేపట్టింది. ఎకరాకు 8 వేల పెట్టుబడి ఖర్చులు ఇవ్వడం లాంటివి దేశానికే ఆదర్శం.

- అనభేరి లతా కుమారి, హైదరాబాద్

కాలుష్యాన్ని అడ్డుకోవాలె

హైదరాబాద్ మహానగరంలో నానాటికీ వాహనాల సంఖ్య పెరుగుతున్నది. దీంతో వాయుకాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యం కూడా పెరుగుతున్నది. అవసరం ఉన్నా లేకున్నా వాహనదారులు హారన్లు మోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు. అలాగే నగరంలో ఎక్కడచూసిన రోడ్లపైన, బస్తీల్లో వివిధ సందర్భాల్లో పెడుతున్న డీజే నుంచి వచ్చే శబ్దకాలుష్యం కూడా ఈ మధ్య బాగా పెరిగింది. ఇలాంటి కాలుష్యాలను అరికట్టాల్సిన అవసరం ఉన్నది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి.

- కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, హైదరాబాద్

అన్ని రంగాలకు ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల సంక్షేమానికి ఉపయోగపడేలా ఉన్నది. వ్యవసాయరంగానికి అధిక నిధులు కేటాయించడం, బడుగు, బలహీనవర్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. సాగునీటి ప్రాజెక్టుల కోసం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి, దేవాలయాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడం ముదావహం.

- కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్ జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

జాతీయం



షా ఆలమ్ ఖాన్

శాస్త్రీయతపై దాడి ప్రగతి నిరోధకమే

ఈ మధ్య శాస్త్రీయ సిద్ధాంతాలపై దాడి ఎక్కువైంది. శాస్త్రీయ సిద్ధాంతాల సహేతుకత గురించి రాజకీయ నేతలు మాట్లాడటమే ఇప్పటి ప్రమాదం. ఇది ఎక్కడో ఒకచోట ఒక వ్యక్తి చేస్తున్న దాడిగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా వ్యవస్థీకృతంగా మూకుమ్మడి దాడి జరుగుతున్నది. దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగానూ శాస్త్రీయ సిద్ధాంతాలపై దాడి ఎక్కుపెట్టబడింది. ప్రపంచవ్యాప్తంగా మతబోధకులు, ముఖ్యంగా రాజకీయ నేతల నుంచి ఈ దాడి జరుగుతుండటం అతిపెద్ద ప్రమాదకర సూచిక.

శాస్త్రీయ సిద్ధాంతాలను పూర్వపక్షం చేస్తూ, వక్రీకరిస్తూ దేశంలో మన రాజకీయ నేతలు మాట్లాడటం ఈ మధ్య మరీ పెరిగిపోయింది. ఏ సమాజంలోనైనా శాస్త్రీయ ఆలోచనలు తగ్గిపోవటం ఆ సమాజం అంధకారంలోకి వెళుతున్నదానికి సంకేతంగా చెప్పుకోవచ్చు. ఎవరైనా శాస్త్రీయ ఆలోచనలు, సిద్ధాంతాలపై దాడి చేస్తారో, వక్రీకరిస్తారో వారు సమాజాభివృద్ధికి అడ్డంకిగా, విరోధులుగా ఉంటారు. వారు తమ రాజకీయ అవసరాలు, విశ్వాసాల నేపథ్యంలోంచి మాట్లాడుతూ ప్రజల మనసుల్లో మూఢ విశ్వాసాలను పాదుకొల్పుతూ వారి రోజువారీ జీవితంలో చీకటిపొరలను పరుస్తారు. మొత్తంగా సామాజిక జీవితాన్ని అంధకారం చేస్తారు. సామాజిక శాస్త్రీయ జీవితాన్ని మత మౌఢ్యం చేస్తారు. ఈ నేపథ్యంలోంచే మన దేశంలో రాజకీయ నేతలు శాస్త్రీయ సిద్ధాంతాలపై చేస్తున్న దాడిని చూడాలి. దాంతో సమాజానికి ఒనగూడే ప్రమాదాన్ని పసిగట్టాలి. నిజానికి ఇవ్వాళ రాజకీయ నేతల వైఖరి, శాస్త్రీయ సిద్ధాంతాలపై వారుచేస్తున్న దాడి తీవ్రమైనది. మన ప్రధాని నరేంద్ర మోదీ ఓ సందర్భంలో మాట్లాడుతూ.. మన వేద కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ ఉన్నదని, ఆధునిక శాస్త్రం చేసిన గొప్పేమీ లేదని చెప్పుకొచ్చారు. మన పురాణ ఇతిహాసాల్లోనే ఇంకా మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉన్నదని అంటున్నారు. ఇక కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖామంత్రి అయితే– స్టీఫెన్ హాకింగ్ కూడా మన వేదాల గొప్పతనాన్ని కొనియాడారని చెబుతున్నాడు. శాస్త్ర సాంకేతిక, ఆధునిక అభివృద్ధికి మూలస్తంభంగా నిలిచిన, ఐన్‌స్టీన్ చెప్పిన E=mc2 సూత్రం కూడా మన వేదాల్లోనే ఉన్నదని ఆయన చెప్పుకొస్తున్నారు.

ఇంకా ఇలాంటి వారు చేస్తున్న వింత వాదనలు వింటే వారు ఒక పద్ధతి ప్రకారం కావాలని చేస్తున్న ప్రచారంగా కూడా కనిపిస్తుంది. పురాణాలు, ఇతిహాస గాథలను ఆధారంగా చేసుకొని వినాయకుడి తలను నరికిన తర్వాత, ఆ కాలంలోనే ఏనుగు తలను అమర్చిన గొప్ప శాస్త్రీయత నాటిదని అంటున్నారు. ప్రాణికోటికి ముఖ్యంగా మనుషులకు కావలసిన ప్రాణవాయువు (ఆక్సీజన్)ను మన ఆవులు పేడనుంచి ఇస్తున్నాయని చెబుతున్నారు. ఇలాంటి వాదనలు చేస్తున్నవారు మరో అడుగుముందుకు వేసి డార్విన్ చేసిన జీవపరిణామ సిద్ధాంతం కూడా తప్పని చెప్పుకొస్తున్నారు. తాతల కాలం నుంచి ఎవరిని చూసినా ఏ ఒక్కరు కూడా కోతుల నుంచి మనుషులు తయారైన ఉదంతం కనిపించటం లేదని వాదిస్తున్నారు!

అయితే ఇక్కడ ఒకటి మనం చెప్పుకోవాలి. శాస్త్రీయ సిద్ధాంతాలు, విషయాలతో విభేదించటం తప్పుకాదు. విచక్షణ, హేతుబద్ధత కలిగిన మనిషిగా ప్రతిదాన్నీ ప్రశ్నించటం అవసరం. కానీ దానికి ఓ సహేతుకత పునాదిగా ఉన్నప్పుడు దాన్ని గౌరవించాలి కూడా. ప్రతి శాస్త్రీయ సిద్ధాంతం– తర్వాతి వారు ప్రశ్నించటం, దానిలోని లోపాలను, ఆచరణాత్మక వాస్తవికతలను ఎత్తిచూటం ద్వారానే అది సుసంపన్నమవుతుంది. మరింత ఆచరణాత్మకంగా శాస్త్రీయంగా రూపుదాల్చుతుంది. నిజానికి శాస్త్రీయ సిద్ధాంతాలేవీ శిలాశాసనాలుగా మార్పునకు లోనవకుండా ఉండవు. ప్రతి శాస్త్రీయ సిద్ధాంతం నిత్యనూతనంగా ప్రశ్నలను ఎదుర్కొని నిలుస్తుంది. దీని ద్వారానే శాస్త్ర సిద్ధాంతాలు సమాజ అవసరాలను తీర్చే విధంగా రూపుదిద్దుకుంటున్నాయి. డార్విన్ సిద్ధాంతాన్ని తప్పు పడుతున్నవారు, దానికి ప్రతిగా ఏం చెప్పదల్చుకున్నారో సమాజాన్ని ఒప్పించగలుగాలి. అంతేకానీ ఏకపక్షంగా మత విశ్వాసాలతో శాస్త్రజ్ఞానాన్ని నిరాకరించటం మూర్ఖత్వం మాత్రమే. శాస్త్రీయ సిద్ధాంతాలను మత విశ్వాసాల పునాదిగా ప్రశ్నిస్తే, నిరాకరిస్తే అది పూర్తిగా వితండ వాదమూ, అంధ విశ్వాసమూ అవుతుంది. పునాది లేని, హేతుబద్ధత లేని పురాణాల పూనికగా చేసే వాదనలతో శాస్త్రీయ సిద్ధాంతాలను నిరాకరించటం సమాజాన్ని అంధకారంలోకి నెట్టడమే. ఇది పూర్తిగా శాస్త్రీయతకు, అభివృద్ధికి వ్యతిరేకమైనది.

అబద్ధాల పునాదిగా శాస్త్రజ్ఞానాన్ని నిరాకరించటమనేది శాస్త్రీయ అభివృద్ధికి బద్ధ శత్రువు. ప్రస్తుతం దేశంలో మతం పునాదిగా గల రాజకీయ శక్తులు చేస్తున్న వాదనలు ప్రగతి నిరోధకమైనవి. శాస్త్రవిజ్ఞానం, మతం మధ్యన వైరుధ్యం సృష్టించి సమాజాన్ని చీకట్లోకి తీసుకెళ్లే కుట్ర జరుగుతున్నది. అయితే జాతీయత, సంప్రదాయ ఆచారాల పేరుతో శాస్త్రీయతను నిరాకరించటం ప్రమాదకరం. నిజానికి శాస్త్ర అభివృద్ధికి, జాతీయ భావనకు వైరుధ్యమేమీ లేదు. శాస్త్రీయ విజ్ఞానాన్ని విరోధిగా చూడటం ద్వారా ఏ సమాజమూ ముందుకుపోలేదు. నిజానికి జాతీయాభివృద్ధికి శాస్త్రీయత సహాయకారిగా ఉంటుంది, బలాన్ని చేకూరుస్తుంది. చైనా, జపాన్, దక్షిణకొరియా లాంటి ఆధునిక జాతి రాజ్యాలు శాస్త్రీయంగా ఎంతో ముందుకుపోయాయి. అభివృద్ధి చెందాయి. పాశ్చాత్య దేశాల్లో కూడా ఇలాంటి ఒక సందర్భం కనిపిస్తుంది. గర్భవిచ్ఛిత్తి చట్టం కోసం చర్చికు వ్యతిరేకంగా అక్కడి శాస్త్రీయజ్ఞానం పునాదిగా ఆ సమాజాలు తీవ్రపోరాటం చేసి విజయం సాధించాయి. అలాగే ఇలాంటి పరిస్థితే మనదేశంలో మతం పునాదిని, మత విధానాల హేతుబద్ధతను ప్రశ్నించే పరిస్థితిని ఊహించలేం.


దేశంలో మతవాద రాజకీయపార్టీ వాదులు అదేపనిగా శాస్త్రీయ సిద్ధాంతాలపై దాడులు ఎక్కుపెట్టారు. భౌతికదాడులు, హత్యలదాకా పోయారు. హిట్లర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేశాడో చరిత్ర సాక్ష్యంగా ఉన్నది. అనేకమంది శాస్త్రవేత్తలు, నోబెల్ గ్రహీతలపై కూడా హిట్లర్ హయాంలో దాడులకు గురయ్యారు. ఐన్‌స్టీన్, ఫిలిప్ లెనార్డ్, జోహన్నెస్ స్టార్క్ లాంటి శాస్త్రవేత్తలు బాధితులుగా మిగిలారు. ఈ క్రమంలోంచే అమెరికా అధ్యక్షుడు కూడా తన రాజకీయ, వ్యాపార కారణాలతో శాస్త్రీయ జ్ఞానానికి పరిధులు విధిస్తున్నాడు.

ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాటలు మనకు శిరోధార్యంగా నిలుస్తా యి. 'శాస్త్రవిజ్ఞానం మాత్రమే మానవ జాతి సమస్యలకు పరిష్కారం చూపుతుంది. పేదరికం నుంచి మనుషులను గట్టెక్కిస్తుంది. అక్షరాస్యత మనిషిని మూఢ విశ్వాసాలనుంచి విముక్తి కలిగిస్తుంది. అతీతశక్తులు, మత, ఆచార విశ్వాసాల సంకెళ్ల నుంచి మనిషిని విముక్తి చేస్తుంది. మన ఆచారాలు, మత విశ్వాసాలు మన సహజ వనరులను వృథా చేస్తాయి. అభివృద్ధిని కుంటుపడేసి ప్రజలను ఆకలి దప్పులకు ఎరవేస్తాయి' అని నెహ్రూ చెప్పారు.

ఇలాంటి రాజకీయవాదుల పరిస్థితి ఎలా ఉన్నదంటే.. తమ వాదనతో చంద్రున్ని కూడా రూపుమార్చుకొమ్మని ఆదేశించే స్థితికి చేరారు. రాజకీయవాదులు శాస్త్ర విజ్ఞాన విషయాల్లో తలదూర్చకుండా ఉంటే మంచిది. ఈ క్రమంలో మన ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాటలు మనకు శిరోధార్యంగా నిలుస్తాయి. 'శాస్త్రవిజ్ఞానం మాత్రమే మానవ జాతి సమస్యలకు పరిష్కారం చూపుతుంది. పేదరికం నుంచి మనుషులను గట్టెక్కిస్తుంది. అక్షరాస్యత మనిషిని మూఢ విశ్వాసాల నుంచి విముక్తి కలిగిస్తుంది. అతీతశక్తులు, మత, ఆచార విశ్వాసాల సంకెళ్ల నుంచి మనిషిని విముక్తి చేస్తుంది. మన ఆచారాలు, మత విశ్వాసాలు మన సహజ వనరులను వృథా చేస్తాయి. అభివృద్ధిని కుంటుపడేసి ప్రజలను ఆకలి దప్పులకు ఎరవేస్తాయి' అని నెహ్రూ చెప్పారు. ఆయన మాటలే నేడు దేశానికి వెలుగుబాటలు కావాలి. సమాజాభివృద్ధికి మార్గదర్శకం కావాలి.

(వ్యాసకర్త: ఢిల్లీ ఎయిమ్స్‌లో ప్రొఫెసర్)

విద్య



డాక్టర్ అనభేరి రాజేశ్వర్‌రావు

వృత్తి నైపుణ్యాలకు పెద్దపీట

దేశ సర్వతోముఖాభివృద్ధికి, బంగారు తెలంగాణ కోసం ప్రభుత్వం కృషిచేస్తున్నది. ఇందులో భాగంగానే గ్రామీణవృత్తుల్లో యువతకు నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తున్నది. తద్వారా నిరుద్యోగ యువత స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ ఆర్థికాభివృద్ధిని సాధించుకునే అవకాశం లభిస్తున్నది. ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు బాల్య, విద్యార్థి దశ నుంచే పెంపొందించాలి. దీనికి జాతీయస్థాయిలో ఉన్న జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ (NIOS) సహకారాన్ని, రాష్ట్రంలోనున్న ప్రభుత్వ, ప్రైవేట్ ప్రభుత్వామోదిత పారిశ్రామిక శిక్షణాసంస్థలను (ఐటీఐ), మోడల్ స్కూళ్లలో, తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీలాంటి సంస్థలు బేసిక్ ఎడ్యుకేషన్ నుంచి సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్ స్థాయి వరకు వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన బాలబాలికలకు వారి ఉత్సాహాన్ని, వనరులను పరిగణనలోకి తీసుకోవాలి. భవిష్యత్తులో మన ప్రాంతంలోని ప్రకృతి వనరులను, మానవ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలి. వ్యవసాయాధార, కంప్యూటర్ ఆధారిత, మహిళా సాధికారత, మహిళాభ్యుదయానికి సంబంధించిన బ్యూటీ కల్చర్‌లో, ఇంజినీరింగ్ కోర్సుల్లో సెక్రటేరియట్ కోర్సులు, ఇన్సూరెన్స్ కోర్సులు, పారా మెడికల్ కోర్సులతో పాటు చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నది. గ్రామీణ, పట్టణ స్థాయిలోని నిరుద్యోగ యువతకు, పాఠశాలల్లోని బాలబాలికలకు ప్రత్యేక కోర్సులను ప్రవేశపెడుతున్నది. పారిశ్రామిక అవసరాలకు, వ్యవసాయరంగాభివృద్ధికి అనుగుణంగా వృత్తి కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించటం ప్రశంసనీయం.

దేశంలో 77 శాతం బడీడు పిల్లలు సెంకడరీ విద్యను పూర్తి చేశారు. అయితే ఇందులో కేవలం 52 శాతం పిల్లలే సీనియర్ సెకండరీ విద్యను నమోదు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆర్థిక వనరులు, మానవ వనరులు వృథా అవుతున్నాయి. జాతీయ సగటుకు దిగువన మన రాష్ట్ర అక్షరాస్యతా శాతం ఉంటున్నది. ఈ విషయా న్ని ప్రభుత్వం, మేధావులు, అధికారులు గమనించాలి. రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సులను నైపుణ్య రంగాభివృద్ధిని పెంపొందించేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సమిష్టిగా ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, మేధావులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి.

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో స్వతంత్రంగా జీవనాన్ని కొనసాగించే, ఆర్థికాభివృద్ధికి దోహదపడే సేవారంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, టర్నర్, టూల్, డై కంప్యూటర్ ప్రోగ్రామర్, ప్లాస్టిక్ ఇంజినీరింగ్ డీజిల్ మెకానిక్, మెకానిక్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, డ్రాఫ్ట్‌మెన్, మోటార్ సైకిల్ మెకానిక్, డీజిల్ ఇంజినీరింగ్ మెకానిక్, సర్వేయర్ లాంటి వృత్తి కోర్సులను నిర్వహిస్తున్నది. రెగ్యులర్‌గా నిర్వహించబడుతున్న మోడల్ స్కూళ్లల్లో బ్యాంకింగ్ ఫైనాన్స్, ఇన్స్యూరెన్స్, యానిమేషన్ మల్టీమీడియా ఎంటర్‌టైన్‌మెంట్, ఆరోగ్య విద్యకు సంబంధించిన న్యూట్రీషియన్, ఫిజికల్ ఎక్సర్‌సైజ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, వ్యవసాయరంగానికి చెందిన మైక్రో ఇరిగేషన్, పర్యాటకశాఖకు చెందిన హాస్పిటాలిటీ, కంప్యూటర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులను పాఠశాల విద్యాశాఖ, సీనియర్ సెకండరీ స్థాయి విద్యార్థులకు కల్పిస్తున్నది.

జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ రెగ్యులర్ ఐటీఐ కోర్సు పూర్తిచేసిన వారికి కేవలం ఒక భాష, ఒక పాఠ్యాంశానికి చెందిన సబ్జెక్టుల్లో పరీక్షకు హాజరై పాసయితే సెకండరీ స్థాయి అర్హత గల ధృవపత్రం జారీ చేస్తున్నది. తదనంతరం వీరు ఇంటర్, డిగ్రీస్థాయి వరకు విద్యను దూర విద్యా విధానం లేదా రెగ్యులర్‌గా తమ విద్యాస్థాయిని విద్యాసంస్థల్లో చేరి పెంచుకునేందుకు ప్రోత్సహిస్తున్నది.

మన రాష్ర్టానికి అత్యంత ఉపయోగాత్మకంగా ఉండే వ్యవసాయాధారిత వృత్తి కోర్సుల్లో భాగంగా పుట్ట గొడుగుల ఉత్పత్తి, తేనె, పట్టు పురుగు పెంపకానికి చెందిన కోర్సు, ఫౌల్ట్రీ ఫార్మింగ్ కోర్సు, సాయిల్, ఫర్టిలైజర్ మేనేజ్‌మెంట్ కోర్సు, జూట్ ప్రొడక్షన్ కోర్సు, డిప్లొమా ఇన్ ఇన్యూరెన్స్ సర్వీస్, ఒక సంవత్సరం టైప్ రైటింగ్ కోర్సు హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ సెకండరీ, సీనియర్ సెంకడరీ స్థాయి కోర్సులు ప్రధానంగా ఈ టైప్‌రైటింగ్ కోర్సు హిందీ ఇంగ్లీష్, టైప్‌రైటింగ్ కోర్సు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సెక్రటేరియట్ ప్రాక్టీస్, స్టెనోగ్రఫీ (హిందీ, ఇంగ్లీష్, తెలుగు) నిర్వహిస్తున్నది. ఆరు నెలల బేసిక్ కంప్యూటర్ కోర్సు, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసెంబ్లీ, వెబ్ డిజైనింగ్, డెవలప్‌మెంట్, డెటా ఎంట్రీ, ఆపరేషన్స్, కంప్యూటర్, ఆఫీస్ అప్లికేషన్స్, అడ్వాన్స్డ్ వెబ్ డిజైనింగ్, ఒక సంవత్సరపు సర్టిఫికెట్ కోర్సు ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, ఆరు నెలల ఇంజినీరింగ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రధానంగా నిత్యం ఉపయోగపడే హౌజ్ వైరింగ్, ఎలక్ట్రికల్ అప్లయన్సెస్, వ్యవసాయ మోటార్, ట్రాన్స్‌ఫార్మర్ రీవైండింగ్, రేడియో, టేప్‌రికార్డర్ రిపేరింగ్, ప్లంబింగ్, నిర్మాణరంగంలో అవసరమయ్యే కన్‌స్ట్రక్షన్, సూపర్‌విజన్, ఫోర్‌వీలర్ ఛాసిస్ మెకానిజం.

ఒక సంవత్సరపు ఎలక్ట్రిక్ టెక్నీషియన్, రేడియో, టీవీ టెక్నీషియన్ రిఫ్రిజిరేషన్ , ఫర్ కండీషనింగ్, సర్టిఫికెట్ ఇన్ ఫుట్‌వెయిర్ డిజైన్, ప్రొడక్షన్ లాంటి కోర్సులను, సర్టిఫికెట్ ఇన్ ఫోర్ వీలర్ మెకానిజం. సెకండరీ స్థాయిలో ప్రత్యేకంగా కార్పెంటరీ, సోలార్ ఎనర్జీ టెక్నీషియన్, బయోగ్యాస్ ఎనర్జీ టెక్నీషియన్, వెల్డింగ్ టెక్నాలజీ, సీనియర్ సెంకడరీ స్థాయిలో ఫర్నీచర్, కాబినెట్ మేకింగ్, ఎలక్ట్రోప్లేటింగ్ లాంటివి. కమ్యూనిటీ హెల్త్ కోర్సు, హోమియో క్లినిక్ మేంటెనెన్స్, ఆయుర్వేదిక్ థెరపీలాంటి కోర్సులు, రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ రేడియోగ్రఫీ, డిప్లమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలొజీ, డిప్లొమా ఇన్ లాబోరేటరీ టెక్నాలజీ కోర్సులను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో ఎన్.ఐ.ఓ.ఎస్ నిర్వహిస్తున్నది. మహిళలకు ప్రత్యేకంగా ఉపకరించే ఆరునెలల కోర్సుల్లో ప్రధానంగా కటింగ్, టేలరింగ్, డ్రెస్ మేకింగ్ బ్యూటీకల్చర్, హెయిర్ కేర్, ఎం బ్రాయిడరీ సర్టిఫికెట్ కోర్సును, ఒక సంవత్సరపు కటింగ్, టేలరిం గ్, డ్రెస్ మేకింగ్, సర్టిఫికెట్ ఇన్ చిల్డ్రన్స్ వేర్, లేడిస్ వేర్, మెన్స్‌వేర్ కోర్సులను సెకండరీ స్థాయిలో లాండ్రీ సర్వీసు, బేకరీ, కన్‌ఫెక్షనరీ కోర్సును, సీనియర్ సెకండరీ స్థాయి లో హౌజ్ కీపింగ్, కేటరింగ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్, హోటల్ ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్స్, ప్రిజర్వేషన్స్ ఆఫ్ ఫ్రూట్స్, వెజిటేబుల్స్ (కూరగాయల పరిరక్షణ) కోర్సులను ప్రవేశపెట్టడం జరిగింది. రెండేండ్ల డిప్లొమా ఇన్ డ్రెస్ డిజైనింగ్ ఉపాధ్యాయులకు అవసరమైన సర్టిఫికెట్ ఇన్ ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్, ఎడ్యుకేషన్ (ఈసీసీఈ). టాయ్ మేకింగ్, జాయ్‌పుల్ లెర్నింగ్ కోర్సులు ప్లే సెంటర్ మేనేజ్‌మెంట్ కోర్సు, లైబ్రరీ అటెండెంట్ కోర్సు హిందుస్థానీ మ్యూజిక్, డ్యాన్స్ కోర్సులు, సెక్యూరిటీ సర్వీస్, ఫైర్ ప్రివెన్షన్, ఇండస్ట్రియల్ సేఫ్టీలాంటి ప్రత్యేక కోర్సులను సైతం బాలబాలికలు, నిరుద్యోగులు తమ జీవన నైపుణ్యాలను, వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు దూర విద్యావిధానంలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కోర్సులన్నీ రాష్ట్ర, జాతీయ గుర్తింపు పొందినవే కావడం వల్ల నిరుద్యోగులకు, యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం లభిస్తున్నది.

యువత జీవన నైపుణ్యాభివృద్ధికి, పారిశ్రామిక, వ్యవసాయాధారిత అవసరాలకు అనుగుణంగా వీరి సామర్థ్యాలను, వృత్తి నైపుణ్యాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే నిర్విరామకృషి చేయాలి.

తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం, విద్యాశాఖ, ఎన్ఐఓఎస్, భారత ప్రభుత్వ కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ప్రత్యేకంగా హస్తకళల, చేనేతరంగ అభివృద్ధి శిబిరాలను కరీంనగర్, నల్గొండ, వరంగల్, గద్వాల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో గత ఫిబ్రవరిలో నిర్వహించింది. చేనేత రంగాభివృద్ధిని, వారి కుటుంబాలను ప్రోత్సహించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందించేందుకు జాతీయ సార్వత్రిక విద్యా సంస్థల్లో చేరిన ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఉచితంగా వారి విద్యాభివృద్ధికి నైపుణ్యాభివృద్ధికి దోహదపడేందుకు ప్రవేశం కల్పిస్తూ చర్యలు తీసుకోవటానికి ప్రభుత్వాలు అంగీకరించాయి.

జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ,పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఉమ్మడిగా రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు, చిన్నారుల విద్యాభివృద్ధికి, విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఉపాధ్యాయులు, ప్రసార సాధనాలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు ఉద్యమస్ఫూర్తితో ప్రత్యేక చొరవ తీసుకోవాలి. యువత జీవన నైపుణ్యాభివృద్ధికి, పారిశ్రామిక, వ్యవసాయాధారిత అవసరాలకు అనుగుణంగా వీరి సామర్థ్యాలను, వృత్తి నైపుణ్యాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే నిర్విరామ కృషి చేయాలి. తద్వారా భారతదేశ ఆర్థికాభివృద్ధి, బంగారు తెలంగాణలో చైతన్య జీవనానికి మార్గదర్శకంగా మన యువత జీవనం దేశానికి మార్గదర్శిగా పెంపొందే ఆస్కారం ఉంటుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

మళ్లీ బ్యాలెట్‌కు వెళ్లొద్దు

- అది తిరోగమన చర్య అవుతుంది: మాజీ సీఈసీ కృష్ణమూర్తి



హైదరాబాద్: ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాలు (ఈవీఎం) పూర్తిగా విశ్వసించదగినవని, వాటిని వదిలి బ్యాలెట్ పత్రాల ఎన్నికల విధానానికి వెళితే అది తిరోగమన చర్య అవుతుందని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి అన్నారు. బ్యాలెట్ ఎన్నికల విధానంలో అవకతవకలకు అవకా శం, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో తీవ్రమైన జా ప్యం, కాగితాల వృథా వంటి పలు ప్రతికూలాంశాలు ఉన్నాయని ఆయన సోమవారం పీటీఐ వార్తాసంస్థతో చెప్పారు. మన దేశ ఈవీఎం విధానాన్ని విదేశాలు కూడా కొనియాడటం గర్వకారణమన్నారు.కానీ తిరిగి పాత విధానాన్నే అవలంబించాలని కొన్ని పార్టీలు కోరడం దురదృష్టకరమన్నారు. 'కొన్ని పార్టీలు ఎన్నికల్లో బాగా రాణించలేనంత మాత్రాన ఈవీఎంల వ్యవస్థ మంచిది కాదని అనుకోవడం, కొత్త విధానాన్ని వదిలేసి పాత బ్యాలెట్ ఎన్నికల విధానాన్ని కోరుకోవడం సరికాదు. అది తిరోగమన చర్య అవుతుందన్నది నా అభిప్రాయం' అని ఆయన స్పష్టం చేశారు. ఈవీఎంల వినియోగంతో ఎన్ని ఓట్లు పడ్డాయి, వాటిలో చెల్లినవి, చెల్లనివి ఎన్ని అనేది వెంటనే తనిఖీ చేసుకోవచ్చు, కాగితపు బ్యాలెట్ విధానంలో అటువంటి అవకాశం లేదన్నారు.

లింగాయతులు, వీరశైవులకు మైనారిటీ హోదా!

- కేంద్రానికి సిఫారసు చేయనున్న కర్ణాటక
- అసెంబ్లీ ఎన్నికల ముందు సిద్ధరామయ్య సర్కార్ సంచలన నిర్ణయం



లింగాయత్, వీరశైవ స్వాములతో భేటీ అనంతరం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: కర్ణాటకలో సిద్ధరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు సంచలన నిర్ణయం తీసుకొన్నది. లింగాయతులు, వీరశైవులను ప్రత్యేక మతం వారిగా గుర్తించి వారికి మైనారిటీ హోదా కల్పించాలని సోమవారం క్యాబినెట్ భేటీలో నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి సిఫారసు చేస్తామని క్యాబినెట్ భేటీ తర్వాత రాష్ట్ర న్యాయశాఖ మంత్రి టీబీ జయచంద్ర మీడియాకు చెప్పారు. మైనారిటీ కమిషన్ కమిటీ సిఫారసుల మేరకే ఈ నిర్ణయం తీసుకొన్నామని, ఇది ఇప్పటికే మైనారిటీ హోదాలో ఉన్న వారి ప్రయోజనాలు, హక్కులకు వ్యతిరేకం కాదన్నారు. ఈ నిర్ణయం వచ్చే ఎన్నికలపై పెను ప్రభావం చూపే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాలో లింగాయతులు, వీరశైవులు 17% వరకు ఉన్నారు. మాజీ సీఎం, బీజేపీ నేత యడ్యూరప్ప తదితర నేతలు లింగాయత్ వర్గం వారే. ఈ రెండు వర్గాల వారిలో చాలా మంది ఎప్పుడూ బీజేపీకే ఓటు వేస్తారన్న అభిప్రాయాలు ఉన్నాయి. రాజకీయ పలుకుబడి కలిగి, గణనీయ జనాభా గల ఈ రెండు వర్గాలను తమ వైపు తిప్పుకొని, బీజేపీ ఓటు బ్యాంకును దెబ్బకొట్టడానికే సీఎం సిద్దరామయ్య ఈ ఎత్తు వేశారని పరిశీలకులు భావిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రభుత్వం హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. సిద్ధరామయ్య సర్కార్ నిప్పుతో చెలగాటమాడుతున్నదని బీజేపీ మండిపడింది. మరోవైపు మైనారిటీ కమిషన్ రిపోర్టు లింగాయతులకు ప్రాధాన్యమిచ్చి తమను చిన్నచూపు చూసిందని వీరశైవ సంస్థలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

నోబెల్ గ్రహీత మాటల్ని మోదీపైకి ఎక్కుపెట్టిన రాహుల్

- నిరుద్యోగం పెరుగుతున్నా 'అచ్ఛే దిన్' అంటూ బుకాయిస్తున్నారని విమర్శ



న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్నదని ప్రపంచం మొత్తం కోడై కూస్తున్నా.. ప్రధాని మాత్రం 'అచ్ఛేదిన్' అంటూ బుకాయిస్తున్నారని దుయ్యబట్టారు. నోబెల్ అవార్డు గ్రహీత ఆర్థికవేత్త పాల్ క్రుగ్మన్ ఇటీవల ఓకార్యక్రమంలో చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తూ రాహుల్ ఈ మేరకు సోమవారం ట్విట్టర్లో స్పందించారు. 'రెండేండ్లుగా మేం చెబుతున్న విషయాల్నే క్రుగ్మన్ కూడా ధ్రువీకరించారు. ప్రస్తుతం భారత్‌కు అతిపెద్ద ముప్పు నిరుద్యోగమే. కానీ ఈ వాస్తవాన్ని ప్రధాని అంగీకరించకపోవడం దురదృష్టకరం. ఆయన ప్రవచిస్తున్న 'అచ్ఛేదిన్'కు ఎక్కడ దెబ్బ తగులుతుందోనన్న భయంతోనే ప్రధాని వాస్తవాల్ని తిరస్కరిస్తున్నారు' అని అన్నారు. తయారీరంగం అభివృద్ధి చెందకుంటే భారత్ తీవ్ర నిరుద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కోవాలని ఇటీవల క్రుగ్మన్ హెచ్చరించారు.

పుతిన్‌దే రష్యా అధ్యక్ష పీఠం

వరుసగా నాలుగోసారి ఎన్నిక

రికార్డుస్థాయిలో 76.6% అనుకూల ఓట్లు ■ వెల్లువెత్తిన రిగ్గింగ్ ఆరోపణలు



ఆదివారం రాత్రి మాస్కోలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న వ్లాదిమిర్ పుతిన్

మాస్కో, మార్చి 19: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ఎన్నికయ్యారు. వరుసగా మూడు దఫాలుగా అధ్యక్ష పీఠంపై కూర్చున్న పుతిన్.. మరో ఆరేండ్లపాటు కొనసాగనున్నారు. రెండు దశాబ్దాలుగా రష్యాను ఏలుతున్న పుతిన్ ఈ ఎన్నికల్లో రికార్డుస్థాయిలో అనుకూల ఓట్లను పొందగలిగారు. అయితే రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షాలు, పలు స్వచ్ఛంద సంస్థలు ఆరోపిస్తుండటం సంచలనం రేపుతున్నది. అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలువగా, సోమవారం నిర్వహించిన కౌంటింగ్‌లో పుతిన్‌కు 76.67 శాతం ఓట్లు లభించాయి. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పావెల్ గ్రుడినిన్ 11.79శాతం ఓట్లతో రెండోస్థానంలో నిలిచారు. 2000 సంవత్సరంలో మొదటిసారిగా అధ్యక్షుడిగా ఎన్నికైన పుతిన్, తాజా విజయంతో 2024 వరకు పదవిలో కొనసాగనున్నారు. ఇప్పటికే స్టాలిన్ తర్వాత అత్యధిక కాలంపాటు రష్యా అధ్యక్షుడిగా పనిచేసిన రికార్డు పుతిన్ పేరిట నమోదైంది. విజయం అనంతరం పుతిన్ మాట్లాడుతూ.. తన గెలుపులో ప్రజల నమ్మకాన్ని, ఆశను చూస్తున్నానన్నారు. నిరవధికంగా అధ్యక్షపీఠంపై కొనసాగే ఉద్దేశం తనకు లేదన్నారు. 2030 వరకు అధ్యక్షుడిగా కొనసాగుతారా అన్న ప్రశ్నకు 'నాకు వందేండ్లు వచ్చే వరకు ఇదే పీఠంపై కొనసాగుతా అనుకుంటున్నారా? అలాంటిదేం లేదు' అని చెప్పారు. పుతిన్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలిపారు. పుతిన్ హయాంలో చైనా-రష్యా సంబంధాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరాలెస్ సైతం పుతిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు అధ్యక్ష ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయపరమైన కారణాల వల్ల పోటీ నుంచి తప్పుకున్న అలెక్సీ నవాల్నె మాట్లాడుతూ.. అధికారులు మోసపూరితంగా వ్యవహరించి పుతిన్‌కు సహాయం చేశారని, పలుచోట్ల నిబంధనల ఉల్లంఘన జరిగిందని తన పరిశీలనలో తేలిందన్నారు. గోలోస్ స్వచ్ఛంద సంస్థ సైతం రిగ్గింగ్ ఆరోపణలను సమర్థించింది. పలువురు పుతిన్ మద్దతుదారులు దొంగ ఓట్లు వేశారని, గుంపులుగా పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి హడావుడి చేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నది. రష్యాలో తలదాచుకుంటున్న అమెరికాకు చెందిన విజిల్ బ్లోయర్ ఎడ్వర్డ్ స్నోడెన్ సైతం ఓ స్కూల్‌లో రిగ్గింగ్ జరుగుతున్న ఫొటోను ట్వీట్ చేశారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. రిగ్గింగ్ ఆరోపణలు వెల్లువెత్తడంతో పలు దేశాల అధ్యక్షులు, ప్రధానులు పుతిన్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు నిరాకరించారు.

నాలుగో కేసులోనూ లాలూ దోషే

దాణా స్కాంలో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

దుమ్కా ట్రెజరీ నుంచి అక్రమంగా నిధులు డ్రా చేసినట్లు నిర్ధారణ

మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాకు ఊరట.. నిర్దోషిగా తేల్చిన కోర్టు



తీర్పు అనంతరం రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ప్రాంగణంలో లాలూ

రాంచీ: దాణా కుంభకోణంపై దాఖలైన నాలుగో కేసులోనూ బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ దోషిగా తేలారు. దుమ్కా ట్రెజరీ నుంచి రూ.3.13కోట్లు అక్రమంగా డ్రాచేసిన కేసులో ఆయనను దోషిగా తేలుస్తూ రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం తీర్పు చెప్పింది. దీంతో ఆయనపై నమోదైన నేరపూరిత కుట్ర, అవినీతి అభియోగాలను ధ్రువీకరించినట్లయ్యింది. ఇప్పటికే మూడు కేసుల్లో దోషిగా తేలిన లాలూ ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్నారు. అనారోగ్యంతో గత శనివారం దవాఖానలో చేరిన లాలూ (69) సోమవారం నేరుగా సీబీఐ ప్రత్యేక కోర్టుకు వచ్చారు. లాలూతో పాటు మరో 18మందిని దోషులుగా తేలుస్తూ న్యాయమూర్తి శివపాల్ సింగ్ తీర్పు చెప్పారు. కాగా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీహార్ మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా సహా మరో 12మందిని న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించింది. మార్చి 21 తర్వాత కోర్టు దోషులకు శిక్ష ఖరారు చేయనున్నది. కాగా దాణా కుంభకోణంపై దాఖలైన మొత్తం ఐదుకేసుల్లో ఇప్పటివరకు నాలుగింటిలో లాలూ దోషిగా తేలారు. దొరందా ట్రెజరీలో రూ.139 కోట్ల నిధుల స్వాహా కేసు విచారణలో ఉన్నది.

ఇదీ నేపథ్యం

1990వ దశకంలో జరిగిన కుంభకోణం ఇది. లాలూ సీఎంగా ఉన్న సమయంలో పశువుల దాణా పేరిట నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఎదురయ్యాయి. వివిధ ట్రెజరీల నుంచి అక్రమంగా నిధులు డ్రా చేసుకున్నారన్నది అభియోగం. దీంతో లాలూ, జగన్నాథ్ మిశ్రా తదితరులపై కేసులు నమోదయ్యాయి. లాలూపై ఐదు కేసులు నమోదు కాగా, తొలికేసులో 2013 సెప్టెంబర్ 30న శిక్ష పడింది. అదే ఏడాది డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత దేవ్‌గఢ్ ట్రెజరీ కేసులో గత ఏడాది డిసెంబర్ 23న లాలూకు న్యాయస్థానం మూడున్నరేండ్ల జైలుశిక్ష విధించింది. నాటినుంచి ఆయన రాంచీలోని బిర్సాముండా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఇక మూడో కేసు చాయ్‌బాసా ట్రెజరీ నుంచి రూ.37.62 కోట్లు అక్రమంగా పొందిన కేసు. ఇందులోనూ లాలూను ఈ ఏడాది జనవరి 24న కోర్టు దోషిగా తేల్చింది. ఈ కేసులో ఆయనకు ఐదేండ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. దుమ్కా ట్రెజరీ నుంచి రూ.3.13 కోట్లకు పైగా నిధులు స్వాహా చేసిన కేసులోనూ లాలూ సహా 47మందిపై అభియోగాలు నమోదయ్యాయి. వీరిలో 14మంది విచారణ సమయంలో మరణించారు. దుమ్కా ట్రెజరీ కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం లాలూ సహా 18మందిని దోషులుగా ప్రకటించింది. కోర్టు తీర్పుపై తానేమీ మాట్లాడనని లాలూ మీడియాతో అన్నారు. ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేస్తామని ఆర్జేడీ ఉపాధ్యక్షుడు రఘువంశ్ ప్రసాద్ సింగ్ చెప్పారు.

2జీ కేసులో ఢిల్లీ హైకోర్టుకు ఈడీ

న్యూఢిల్లీ: కేంద్ర టెలికం శాఖ మాజీ మంత్రి ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళిపై 2జీ కుంభకోణంలో భాగంగా వచ్చిన మనీల్యాండరింగ్ ఆరోపణలను ప్రత్యేక కోర్టు కొట్టేసిన నేపథ్యంలో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. గత ఏడాది డిసెంబర్ 21న రాజా, కనిమొళి, డీఎంకే అధినేత కరుణానిధి భార్య దయాళు అమ్మాల్, కళైజ్ఞర్ టీవీ డైరెక్టర్ తదితరులపై ఈడీ చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని ప్రత్యేక కోర్టు కేసును కొట్టేసింది. ఈడీ తన చార్జిషీట్‌లో స్వాన్ టెలికం ప్రైవేట్ లిమిటెడ్ రూ.200 కోట్లను డీఎంకే ఆధ్వర్యంలో నడుస్తున్న కళైజ్ఞర్ టీవీకి చెల్లించిందని పేర్కొన్నది. కాగా అదేరోజు రాజా, కనిమొళి తదితరులపై సీబీఐ నమోదు చేసిన 2జీ కేసును కూడా ట్రయల్ కోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే.

నిర్మాణ కార్మికులు జాతి నిర్మాతలు: సుప్రీంకోర్టు

ఆరు నెలల్లో వారి సంక్షేమానికి నమూనా పథకాన్ని రూపొందించాలని కేంద్రానికి ఆదేశం

న్యూఢిల్లీ: నిర్మాణ కార్మికులు కేవలం మౌలిక సదుపాయాలను మాత్రమే నిర్మించరని, వారు దేశ నిర్మాతలని సుప్రీంకోర్టు పేర్కొంది. నిర్మాణ కార్మికుల విద్య, వైద్యం, సామాజిక భద్రత, పెన్షన్ వంటి సమస్యల పరిష్కారానికి వచ్చే సెప్టెంబర్ 30లోగా ఒక నమూనా పథకాన్ని రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సెస్ రూపంలో రూ.37,400 కోట్లు వసూలు చేసినా, రూ.9,500 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నట్టు కనిపిస్తున్నదని పేర్కొంది. మిగిలిన రూ.28 వేల కోట్లతో దేశంలో లక్షల సంఖ్యలో ఉన్న నిర్మాణ కార్మికులకు ఎందుకు లబ్ధి చేకూర్చడం లేదని ప్రశ్నించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఆరు నెలల్లో నిబంధనలను రూపొందించాలని సూచించింది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, 1996, సెస్ చట్టం, 1996 ఉల్లంఘనకు గురయ్యాయని జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం మండిపడింది. 'విద్య, వైద్యం, సామాజిక భద్రత, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్‌తోపాటు రాజ్యాంగం ప్రతిపాదించినట్టు నిర్మాణ కార్మికులు గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ఇతర వసతులనూ కార్మిక శాఖ చేకూరుస్తుందని ఆశిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. ఈ ప్రక్రియ వచ్చే సెప్టెంబర్ 30 లోపే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.



లోక్‌సభలో టీఆర్ఎస్, టీడీపీ ఇతర ప్రతిపక్ష సభ్యుల ఆందోళన

చర్చకు రాని అవిశ్వాసం

విపక్షాల ఆందోళనతో సాగని పార్లమెంట్.. వరుసగా 11వ రోజు వాయిదా పడిన ఉభయ సభలు

న్యూఢిల్లీ, మార్చి 19: కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండానే పార్లమెంట్ మరోసారి వాయిదా పడింది. వివిధ డిమాండ్లపై ఆయా పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేయడంతో ఉభయ సభల్లో ఎటువంటి కార్యకలాపాలు కొనసాగలేదు. దీంతో వరుసగా 11వ రోజు సభ మరుసటి రోజుకు వాయిదా పడింది. మంగళవారం ఉదయం రాజ్యసభ సమావేశమైన పది నిమిషాలకే మరుసటి రోజుకు వాయిదా పడింది. కాగా లోక్‌సభ తొలుత మధ్యాహ్నం వరకు, ఆ తరువాత మరుసటి రోజుకు వాయిదా పడింది. సభలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో తాను అవిశ్వాసంపై తీర్మానాన్ని చేపట్టలేకపోతున్నానని స్పీకర్ సుమిత్రా మహాజన్ పేర్కొన్నారు. ఈ గందరగోళం మధ్యనే హోం మంత్రి రాజ్‌నాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం సహా ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్ చేస్తూ వైసీపీకి చెందిన వైవీ సుబ్బారెడ్డి, టీడీపీకి చెందిన తోట నరసింహం, గల్లా జయదేవ్ ప్రభుత్వంపై అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన నోటీసులకు స్పీకర్‌కు అందజేశారు. లోక్‌సభలో తొలుత ప్రశ్నోత్తరాల సమయం తుడిచిపెట్టుకుపోవడంతో జీరోఅవర్‌ను చేపట్టారు. ఈ సమయంలో టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే సభ్యులు ప్లకార్డులు చేతపట్టుకొని వెల్‌లోకి దూసుకెళ్లారు. రిజర్వేషన్ల కోటాను పెంచాలని టీఆర్ఎస్, కావేరీ నది నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐఏడీఎంకే సభ్యులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ రెండో దఫా బడ్జెట్ సమావేశాలు ప్రతిపక్ష సభ్యుల నిరసనల కారణంగా రోజూ వాయిదా పడుతున్నాయి. రాజ్యసభలో కూడా ఇవే దృశ్యాలు పునరావృతం కావడంతో సభ సమావేశమైన పదినిమిషాలకే మంగళవారానికి వాయిదా పడింది.

ఆరుషి హత్యకేసులో తల్వార్ దంపతులపై సుప్రీంలో పిటిషన్


న్యూఢిల్లీ: ఆరుషి హత్య కేసులో ఆమె తల్లిదండ్రులను నిర్దోషులుగా విడుదల చేయడానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఆరుషితో పాటు హత్యకు గురైన హేమరాజ్ భార్య ఖుమ్కాలా భాంజ్‌డే ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్ భానుమతిలతో కూడిన బెంచ్ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతించింది. ట్రయల్ కోర్టులోని కేసుకు సంబంధించిన రికార్డులను అందజేయాలని సమన్లు జారీ చేసింది. 2008 మేలో ఆరుషి (14) నోయిడాలోని తన ఇంటి గదిలో విగతజీవిగా కనిపించింది. రెండురోజుల తర్వాత వారి ఇంటి మేడపై పనిమనిషి హేమరాజ్ శవం లభించింది. 2013 లో సీబీఐ కోర్టు తల్వార్ దంపతులకు జీవితఖైదు విధించగా, అలహాబాద్ హైకోర్టు గత ఏడాది వీరిని నిర్దోషులుగా ప్రకటించింది.

రూ.10 కోట్లు డిపాజిట్ చేయండి

- నేషనల్ హెరాల్డ్ కేసులో వైఐకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ దుర్వినియోగం కేసులో యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ (వైఐ)ని ఆదాయం పన్ను (ఐటీ) కింద రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. వైఐలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, ఆయన తల్లి సోనియా ప్రధాన వాటాదారులు. రూ.249.15 కోట్లు ఆదాయం పన్ను చెల్లించాలని ఐటీ శాఖ జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఈ నెల 14న వైఐ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని జస్టిస్ ఎస్ రవీంద్ర భట్, జస్టిస్ ఏకే చావ్లాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈనెలాఖరులోగా రూ.5కోట్లు, ఏప్రిల్ 15 లోగా మరో రూ.5 కోట్లు డిపాజిట్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.


భారత్‌తో చైనా చర్చల ప్రతినిధిగా వాంగ్ యీ



బీజింగ్ : చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ (65)కి పదోన్నతి లభించింది. భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలపై సంప్రదింపుల కోసం 'స్టేట్ కౌన్సిలర్'గా ఆయన నియామకాన్ని చైనా పార్లమెంట్ సోమవారం ఆమోదించింది. దీంతోపాటు విదేశాంగశాఖ మంత్రిగానూ ఆయన వ్యవహరిస్తారు. జోడు పదవులు చేపట్టనున్న తొలి వ్యక్తి వాంగ్‌యీ. మరోవైపు జీవితకాల అధ్యక్షుడిగా జిన్‌పింగ్ నియమితులైన తర్వాత తన క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించిన ప్రధాని లీ కియాంగ్ నలుగురు ఉప ప్రధానులను నియమించారు. కాగా, చైనా అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన జీ జిన్‌పింగ్‌కు భారత ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

మావోయిస్టుల చేతుల్లో కాంట్రాక్టర్ దారుణ హత్య

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన



మావోయిస్టులు దహనం చేసిన యంత్రాలు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మావోయిస్టులు సోమవారం ఓ రోడ్డు కాంట్రాక్టర్‌ను హత్యచేశారు. తుమ్నార్, కోయిత్పాల్ గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డునిర్మాణ పనులను మావోయిస్టులు అడ్డుకొని అక్కడ రోడ్డుపనుల కోసం వినియోగిస్తున్న యంత్రాలకు నిప్పంటించారు. అనంతరం కాంట్రాక్టర్ విశాల్‌కుమార్(36)ను కిడ్నాప్ చేసి సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి గొడ్డలితో తలపై విచక్షణారహితంగా నరికి చంపారు. ఈ దాడిలో దాదాపు 100 మంది మావోయిస్టులు పాల్గొన్నట్టు డీఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

తెలంగాణలో స్టీల్‌ప్లాంట్‌పై సాధ్యత నివేదిక ఇవ్వనున్న మెకాన్

న్యూఢిల్లీ, మార్చి 19: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెకాన్ కన్సల్టెన్సీ సంస్థ సాధ్యాసాధ్యాల నివేదికను ఇస్తుందని ఉక్కు శాఖ మంత్రి విష్ణు దేవ్ సోమవారం లోక్‌సభకు చెప్పారు. ఆ రెండు రాష్ట్రాల్లో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయటం ఆర్థికంగా లాభదాయకం కాదని సెయిల్ 2014, డిసెంబర్‌లో సాధ్యత నివేదికనిచ్చిందని తెలిపారు. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఒక కార్యాచరణ ప్రణాళికను సూచించేందుకు కేంద్రం 2016, అక్టోబర్‌లో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ టాస్క్‌ఫోర్స్ సమాచారం ఆధారంగా మెకాన్ సంస్థ సాధ్యత నివేదికను రూపొందిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని 13వ షెడ్యూల్ ప్రకారం తెలంగాణలోని ఖమ్మం జిల్లా బయ్యారంలో, ఏపీలోని వైఎస్ఆర్ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ల స్థాపనకు గల అవకాశాలను సెయిల్ పరిశీలించాల్సి ఉందని తెలిపారు.

ప్రత్యేక హోదా డిమాండ్‌ను పక్కన పెట్టలేదు: నితీశ్

పాట్నా : బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని 13 ఏండ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నామని, కనీసం ఒక్క నిమిషం పాటు కూడా పక్కన పెట్టలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ స్పష్టంచేశారు. ప్రత్యేక హోదా డిమాండ్‌తో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు రావడాన్ని గుర్తుచేస్తూ తనను ఆర్జేడీ నాయకులు ప్రశ్నించడంపై నితీశ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. '2005లో బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ అప్పటి ప్రధానికి లేఖరాశాను. ఏడాది తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించా.. అప్పటినుంచి ప్రత్యేక హోదా డిమాండ్‌ను లేవనెత్తుతూనే ఉన్నా..' అని నితీశ్ తెలిపారు.

ముంబైలో ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్ల సమ్మె

ముంబై : ముంబై నగరవ్యాప్తంగా 45వేలకు పైగా ఓలా, ఉబర్ క్యాబ్ సేవలు నిలిచిపోయాయి. క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యల సాధనకు రాజ్ ఠాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ వాహతక్ సేన (ఎంఎన్‌వీఎస్) నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఈ రెండు క్యాబ్ కంపెనీల సేవలు నిలిపివేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు సంజయ్ నాయక్ తెలిపారు. సమ్మె కారణంగా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ముంబై పోలీసులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు.

శాంతి, ఐక్యత భారతీయ మూలతత్వాలు

- అజ్మీర్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రధాని మోదీ సందేశం
- ప్రధాని తరఫున చాదర్ అందజేసిన కేంద్ర మంత్రి నక్వీ



ప్రధాని తరపున చాదర్ అందజేస్తున్న కేంద్రమంత్రి

జైపూర్, మార్చి 19: శాంతి, ఐక్యత, సామరస్యం భారతీయ మూలతత్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. రాజస్థాన్ అజ్మీర్‌లోని హజ్రత్ ఖాజా మొయినుద్దీన్ చిష్తీ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రధాని మోదీ చాదర్‌ను పంపించారు. కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ సోమవారం దర్గాను సందర్శించి ప్రధాని మోదీ తరపున చాదర్ అందజేశారు. సూఫీ మతగురువు ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (గరీబ్ నవాజ్) 806వ ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ తత్వాల్లో సూఫీతత్వం కూడా ఒకటని, అందులో చిష్తీ గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయాలను నెలకొల్పారని చెప్పారు. ఈ ఉర్సు ఉత్సవాలు భారతీయ సంస్కృతిలోని శాంతియుత సహజీవనానికి నిదర్శనంగా నిలువాలని ఆకాంక్షించారు. చాదర్ అందజేసిన సందర్భంగా కేంద్రమంత్రి నక్వీ మాట్లాడుతూ మానవత్వానికి, ఇస్లాంకు ఉగ్రవాదం ఉమ్మడి శత్రువని పేర్కొన్నారు. ప్రపంచశాంతిపై దాడి చేస్తున్న దుష్టశక్తులు.. ఖాజా మొయినుద్దీన్ బోధనల ముందు ఓడిపోతాయని పేర్కొన్నారు.

దర్గా యాత్రికులకు వీసాలివ్వడం లేదని పాక్ అసంతృప్తి

ఇస్లామాబాద్: అజ్మీర్ దర్గాను దర్శించుకొనేందుకు దరఖాస్తు చేసుకున్న 503మంది తమ దేశస్థులకు భారత్ వీసాలు ఇవ్వకపోవడంపై పాకిస్థాన్ సోమవారం అసంతృప్తి వ్యక్తంచేసింది. పుణ్యక్షేత్రాలను దర్శించడం 1974 పాక్-ఇండియా దౌత్యమర్యాదల్లో భాగమని పాక్ విదేశాంగశాఖ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యాత్రికులకు వీసాలు ఇవ్వకపోవడం తమను తీవ్ర నిరాశ పరిచిందని పేర్కొన్నది.

ఆవిష్కరణలు పరిశ్రమలుగా మారాలి



- ఫైన్ ఉత్సవాల్లో రాష్ట్రపతి

న్యూఢిల్లీ: కేవలం ఆవిష్కరణలు జరిగితే సరిపోదని, అవి పరిశ్రమలుగా అభివృద్ధి చెందడానికి అనువైన పరిస్థితులను కల్పించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. నూతన, ఉత్తమ భారత్ నిర్మాణం జరుగాలంటే కొన్ని అభివృద్ధికరమైన మైలురాళ్లను అధిగమించాల్సి ఉంటుందని చెప్పారు. ఢిల్లీలో సోమవారం జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్)2018 ఉత్సవాన్ని రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణల్లో ప్రతి దశను పునరుత్తేజితం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను పాఠాలు బట్టీ పట్టించే పాఠశాలలు కాకుండా వారిలో ఆలోచనను పెంచేవి కావాలని రాష్ట్రపతి పేర్కొన్నారు.

టెక్సాస్‌లో మరోసారి పేలుళ్లు.. ఇద్దరికి గాయాలు

హ్యూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర రాజధాని ఆస్టిన్‌లో మరోసారి పేలుళ్లు సంభవించగా, ఇద్దరు యువకులు గాయపడ్డారు. నెలరోజుల్లో ఆస్టిన్‌లో నాలుగుసార్లు పేలుళ్లు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తాజా పేలుళ్లు ఆదివారం రాత్రి చోటుచేసుకున్నాయి. ఘటనకు గల కారణాలు ఇంకా నిర్ధారణ కానప్పటికీ.. ట్రిప్‌వైర్ వల్ల పేలుడు సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. పేలుళ్ల కారకుల గురించి వివరాలు అందజేస్తే 1,15,000 డాలర్ల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు.

నేడు 41 మందికి 'పద్మ' అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, హిందుత్వ సిద్ధాంతకర్త పీ పరమేశ్వరన్‌లతోపాటు మరో 41 మంది ప్రముఖులకు ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులను మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు.

అర్ధరాత్రి 11.58 టు 12.01

సైబర్ మోసగాళ్లకు లక్కీటైం


● అర్ధరాత్రి రెచ్చిపోతున్న నేరగాళ్లు
● రెండు రోజుల నగదు పరిమితి మేరకు విత్‌డ్రా
● ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి 3 నిమిషాల్లో రూ.80 వేలు టోకరా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అర్ధరాత్రి 11.58 గంటలు.. సాధారణంగా అందరికీ స్లీపింగ్ టైం.. కానీ సైబర్ నేరగాళ్లకుమాత్రం అదే లక్కీటైం.. 11.58 గంటల నుంచి 12.01 గంటల వరకు కేవలం మూడు నిమిషాలే వాళ్ల టార్గెట్. ఈ 180 సెకండ్ల సమయం వారికి సాంకేతికంగా డెబిట్ కార్డు నుంచి రెండు రోజుల్లో విత్‌డ్రా చేయగలిగే సదుపాయాన్ని కల్పిస్తున్నది. దీంతో మోసగాళ్లు ఏటీఎంల నుంచి డబ్బు డ్రా చేస్తూ ఖాతాదారులకు టోకరా వేస్తున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలతో ఆన్‌లైన్ షాపింగ్ చేసే మోసగాళ్లు సైతం అర్ధరాత్రి సమయాన్నే ఎంచుకుంటున్నారు. ఈ సమయంలో జరిగే లావాదేవీలపై ఖాతాదారుల మొబైల్‌కు మెసేజ్‌లు వచ్చినా.. వారు నిద్రలో ఉండటంతో వారికి చూసే అవకాశం తక్కువే. బాధితులు ఉదయం నిద్రలేచి ఫోన్లలో మెసేజ్‌లను పెద్దగా పట్టించుకోరు. ఆ తర్వాత చూసుకొని పోలీసులను ఆశ్రయిస్తున్నా అప్పటికే ఆలస్యం అవుతున్నది. డెబిట్, క్రెడిట్ కార్డులను క్లోనింగ్ చేయడం, ఫిషింగ్ కాల్స్ ద్వారా కార్డుల వివరాలు, పిన్ నంబర్లను సేకరించే సైబర్ మోసగాళ్లు అర్ధరాత్రి సమయంలో లావాదేవీలు జరుపుతూ దోచేస్తున్నారు. ఇదే తరహాలో తాజాగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఖాతా నుంచి డబ్బు కొల్లగొట్టినట్టు తేలింది.

రూ.40 వేలు చొప్పున రెండుసార్లు..

హైదరాబాద్ రామంతాపూర్ ప్రాంతానికి చెందిన సుధాకర్‌కు అర్ధరాత్రి 12.10 గంటలకు సిటీ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ ఫోన్ చేశారు. 'సార్ కొద్ది సేపటి కిందట మీరు ఆన్‌లైన్ షాపింగ్ చేశారా' అని అడుగగా... తాను నిద్రపోతున్నానని, ఎలాంటి షాపింగ్ చేయలేదని సుధాకర్ చెప్పారు. దీంతో ఆ ఎగ్జిక్యూటివ్ కొద్ది సేపటి కిందట మీ ఖాతా నుంచి రూ.80 వేలు డ్రా అయ్యాయని, వెంటనే మీ కార్డును బ్లాక్ చేసుకోవాలని సూచించారు. దీంతో షాక్‌కు గురైన సుధాకర్ వెంటనే ఆ కార్డును బ్లాక్ చేశారు. ఉదయం రాచకొండ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నగదు విత్‌డ్రా వివరాలను సేకరించగా.. రాత్రి 11.58 గంటలకు రూ.40 వేలు, 12.01 గంటలకు రూ.40 వేల లావాదేవీలు జరిపి మూడు నిమిషాల్లోనే రూ.80 వేలు కొల్లగొట్టినట్టు గుర్తించారు. దీనిపై బ్యాంక్ అధికారులను ఆరాతీయగా.. మూడు నిమిషాల వ్యవధిలో తేదీ మారడంతో రెండు రోజుల నగదు విత్‌డ్రా పరిమితి మేరకు షాపింగ్ చేసినట్టు చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల్లో షాపింగ్ చేసినట్టు తేలడంతో రాచకొండ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

జాగ్రత్తగా ఉండాలి



ఖాతాదారులు డెబిట్, క్రెడిట్ కార్డుల వాడకంలో జాగ్రత్తలు పాటించాలి. నగదు విత్‌డ్రా, షాపింగ్ సమయాల్లో కార్డును స్వైప్ చేసేటప్పుడు పిన్ నంబర్‌ను ఎదుటి వారికి కనిపించకుండా చూసుకోవాలి. గుర్తు తెలియని వారికి పిన్ నంబర్‌ను చెప్పొద్దు. ఏటీఎంలలో అనుమానాస్పదంగా కెమెరాలు లేదా డమ్మీ ప్యాడ్స్ ఉన్నాయో గమనించాలి. బ్యాంక్ నుంచి వచ్చే మెసేజ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఏదైనా మోసం జరిగితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

- హరినాథ్, ఏసీపీ రాచకొండ సైబర్ క్రైం

520 మంది ఉద్యోగులకు భరోసా!

తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న జీహెచ్‌ఎంసీ
విద్యుత్ నుంచి ఇతర విభాగాలకు తరలింపు
ఏటా రూ.8.73కోట్లు భరించేందుకు సిద్ధం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఏండ్లుగా విద్యుత్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఊరటనిస్తూ బల్దియా కీలక నిర్ణయం తీసుకున్నది. ఎల్‌ఈడీ లైట్లు, టైమర్ల ఏర్పాటుతో పనిలేకుండా పోయిన 520 మంది ఉద్యోగులను తొలగించకుండా వారిని ఇతర విభాగాల్లో ఉపయోగించుకోనున్నది. దీంతో ఖజానాపై ఏటా రూ.8.73 కోట్ల భారం కొనసాగనున్నది. ఉద్యోగాలు పోయినట్టేనని మూడు నెలలుగా మానసిక సంఘర్షణ అనుభవిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తాజా నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీలో వీధిలైట్ల నిర్వహణకు దాదాపు 750 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించి, రూ.14 వేల మూలవేతనం, అలవెన్సులు కలిపి అన్‌స్కిల్డ్ లేబర్‌కు రూ.15 వేలు, స్కిల్డ్‌కు రూ.17 వేల వరకు చెల్లిస్తున్నారు. ఇటీవలే నగరంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్) సంస్థ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ లైట్లు, అత్యాధునిక టైమర్లను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతను ఆ సంస్థకే అప్పగించారు. ఎల్‌ఈడీల నిర్వహణకు స్కిల్డ్ లేబర్ 230 మంది సరిపోతారని, అందరినీ భరించడం సాధ్యం కాదని ఈఈఎస్‌ఎల్ స్పష్టం చేసింది. దీంతో మిగతా 520 మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. వాస్తవానికి వీరి కాంట్రాక్టు గడువు గత ఏడాది డిసెంబర్‌లో పూర్తయింది. జీహెచ్‌ఎంసీ వారి కాంట్రాక్టును పొడిగించలేదు. గడువు పొడిగించకపోతే ఉద్యోగాలు రద్దయినట్టే. అయినా మానవతా దృక్పథంతో ఇన్నాళ్లు పొడిగించారు.

వేరే విభాగాల్లోకి సర్దుబాటు

విద్యుత్ ఆదాతోపాటు ఖర్చు తగ్గించేందుకే ఎల్‌ఈడీ లైట్ల ప్రాజెక్టు చేపట్టినందున 520 మంది ఉద్యోగుల తొలగింపు తప్పదని అధికారులు తేల్చారు. దీంతో కార్మికులు మేయర్ బొంతు రామ్మోహన్‌ను కలిసి తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని విన్నవించారు. ఈ మేరకు వారిని ఇతర విభాగాల్లోకి సర్దుబాటు చేయాలని మేయర్ సూచించారు. దీంతో చెరువులు, అర్బన్ బయోడైవర్సిటీ, పార్కులు, దోమల నివారణ తదితర విభాగాల్లో వీరిని నియమిస్తున్నారు. నెలకు రూ.14 వేల వేతనంతోపాటు అలవెన్సులు ఇవ్వనున్నారు. దీంతో 520 మంది ఉద్యోగులు, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

మానవీయ కోణంలో ఆలోచించాం: బొంతు రామ్మోహన్

520 కుటుంబాలు అర్ధాంతరంగా రోడ్డున పడకూడదనే ఉద్దేశంతోనే విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించాలని నిర్ణయించినట్టు మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. ఇంతకాలం బల్దియాను నమ్ముకొని పనిచేశారనే కారణంతో వారి సేవలను ఇతర విభాగాల్లో ఉపయోగించుకోనున్నట్టు చెప్పారు.

నకిలీ పాస్‌పోర్టుతో వచ్చిన వ్యక్తి అరెస్ట్

శంషాబాద్: నకిలీ పాస్‌పోర్టుతో దుబాయ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తిని సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆర్జీఐఏ పోలీసులు అరెస్ట్ చేశారు. అనిల్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన పాస్‌పోర్టుతో కేరళకు చెందిన ఫైయాద్ రఫీ(26) హైదరాబాద్‌కు వచ్చాడు. ఎయిర్‌పోర్టులో సీఐఎస్‌ఎఫ్ తనిఖీ చేయగా అతని పాస్‌పోర్టు చెల్లదని, నకిలీ పాస్‌పోర్టుతో వచ్చినట్టు గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు పాస్‌పోర్టును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను కారుతో ఢీకొట్టిన భార్య

పరిస్థితి విషమం.. కేసు నమోదు
హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఘటన

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ప్రేమించి పెండ్లి చేసుకున్న భర్తను కారుతో ఢీకొట్టి చంపేందుకు భార్య యత్నించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంకులో నివాసం ఉంటున్న మహ్మద్ మన్నన్‌ఖాన్(30) జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేండ్ల కిందట బతుల్‌ఖాన్(28) అనే యువతిని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. ఆమె సైతం జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నది. భర్తతో గొడవలు తలెత్తడంతో బతుల్‌ఖాన్ రెండేండ్ల కిందట చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్య కోసం పలు ప్రాంతాల్లో వెతుకుతున్న మన్నన్‌కు ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ దుకాణం వద్ద బతుల్‌ఖాన్ కనిపించింది. దీంతో ఆమె దగ్గరికి వెళ్లి మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా కారులో ఎక్కి వెళ్లిపోయేందుకు యత్నించింది. తనను వదిలి వెళ్లొద్దంటూ మన్నన్ కారుకు అడ్డుగా నిలబడగా, ఆమె లెక్కచేయకుండా వేగంగా కారుతో ఢీకొట్టింది. దీంతో మన్నన్ తలకు, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. అయినా బతుల్‌ఖాన్ కారు ఆపకుండా వెళ్లిపోయింది. స్థానికులు బాధితుడిని జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానలో చేర్పించారు. ప్రస్తుతం మన్నన్ పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి తండ్రి మాజిద్ ఖాన్ సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కొడుకును అడ్డు తొలిగించుకునేందుకు కావాలనే కారుతో ఢీకొట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా ఉద్దేశ పూర్వకంగానే కారు తో ఢీకొట్టినట్టు గుర్తించారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న మన్నన్‌ఖాన్

'ఆసిఫ్‌నగర్' దాడి బాధ్యులపై..

పీడీయాక్ట్ నమోదు చేయాలి

హైదరాబాద్‌లో రెవెన్యూ ఉద్యోగ సంఘాల డిమాండ్
విధులు బహిష్కరించి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన

బేగంబజార్: హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంపై దాడిచేసి అధికారులు, సిబ్బందిని గాయపరిచిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది విధులు బహిష్కరించి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం కోసం రెవెన్యూ సిబ్బంది, ఉద్యోగులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్, రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ కో చైర్మన్ గోల్కొండ సతీశ్, రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రెవెన్యూ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ మల్లేశ్‌కుమార్ పేర్కొన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆర్డీవో చంద్రకళను కోరారు. ఉద్యోగుల నిరసనకు టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అధ్యక్షుడు శివశంకర్, టీఎన్జీవో, టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్‌హుస్సేనీ, కృష్ణాయాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, తహసీల్దార్ల సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు సైదులు, నాయకులు పవన్‌కుమార్, ఈశ్వర్‌రావు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ లలిత, సుజాత పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు

హైదరాబాద్‌ది భిన్నమైన సంస్కృతి

● సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం
● హైదరాబాద్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణలో విద్యావేత్త చుక్కా రామయ్య




హైదరాబాద్ ఫెస్ట్-2018 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చుక్కా రామయ్య

ఖైరతాబాద్: దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోల్చితే హైదరాబాద్ సంస్కృతి ఎంతో భిన్నమైనదని, మిశ్రమ సంస్కృతి కనబడుతుందని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య పేర్కొన్నారు. స్ఫూర్తి ప్రోగ్రెసివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే 'హైదరాబాద్ ఫెస్ట్-2018' పోస్టర్‌ను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చుక్కా రామయ్యతోపాటు ఫెస్ట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, కార్యదర్శి కే చంద్రమోహన్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చుక్కా రామయ్య మాట్లాడుతూ సమాజంపై సంస్కృతి ప్రభావం ఉంటుందని, 18వ శతాబ్దంలో మతపరమైన భావాల్లో ప్రజలు జీవించే వార ని, పారిశ్రామిక విప్లవం అనంతరం ఆర్థిక రంగం తన ప్రభావాన్ని సమాజంపై చూపిందన్నారు. ప్రస్తుతం డిజిటల్ రంగం అభివృద్ధి చెందిన క్రమంలో ఒక రకమైన ఒత్తిడి పెరిగిందన్నారు. కేవలం ఆర్థిక రంగంపైనే కాకుండా సంస్కృతి పరిరక్షణ గురించి ఆలోచించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఒత్తిడి కారణంగా సమాజంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, సంస్కృతి గురించి ఆలోచించే వారే కరువయ్యారన్నారు. ఒత్తిడితో జీవితం గడుపుతున్న వారికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉపశమనాన్ని ఇస్తాయన్నారు. హైదరాబాద్ ఫెస్ట్‌లో విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకుంటాయన్నారు. ఫెస్ట్ అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఫెస్ట్‌లో 22 రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 13న ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు, ప్రముఖ నటులు ప్రకాశ్‌రాజ్, కమల్‌హాసన్‌ను ఆహ్వానిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఫెస్ట్ ఆర్గనైజింగ్ కమిటీ కోశాధికారి ఏ నాగేశ్వర్‌రావు, సభ్యులు కే వేణుగోపాల్, జీ జగదీశ్‌కుమార్, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

ఓయూ డిగ్రీ పరీక్ష ప్రశ్నపత్రం తారుమారు

● ఆందోళనలో విద్యార్థులు
● న్యాయం చేస్తామన్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో తప్పిదం జరిగింది. ఒక కోర్సు వారికి ఇవ్వాల్సిన ప్రశ్నపత్రం మరొకరికి, అదికూడా 20 నిమిషాలు ఆలస్యంగా ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఎగ్జామినేషన్ బ్రాంచి కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. న్యాయం చేస్తానని కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం కుమార్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. విద్యానగర్‌లోని మదర్స్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిగ్రీ పరీక్ష కేంద్రంలో బీకాం కంప్యూటర్స్ విద్యార్థులకు శనివారం బిజినెస్ లా పరీక్ష ఉండగా, బీకాం ఆనర్స్ కోర్సుకు చెందిన బిజినెస్ లా పరీక్ష ప్రశ్నపత్రం అందించారు. బీకాం ఆనర్స్ విద్యార్థులకు సబ్జెక్టు లోతుగా ఉండగా, బీకాం కంప్యూటర్స్ విద్యార్థులకు అంత కఠినంగా ఉండదు. బీకాం ఆనర్స్ విద్యార్థులకు మదర్స్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం కూడా కాకపోవడం గమనార్హం. ప్రశ్నపత్రం 20నిమిషాలు ఆలస్యంగా ఇవ్వడంతో విద్యార్థులు కంగారుతో అదే పరీక్ష పత్రానికి జవాబిచ్చారు. కఠినంగా ఉండటంతో ఇంటికి వచ్చిన తర్వాత చూసుకున్న విద్యార్థులు లబోదిబోమంటూ సోమవారం ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏబీవీపీ నాయకులు చేరుకొని విద్యార్థులకు న్యాయం చేయాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. న్యాయం చేస్తామని వారు చెప్పడంతో శాంతించారు.



అధికారులతో విద్యార్థుల వాగ్వాదం



పెండ్లిండ్ల పూజారి!

ఇప్పటివరకు పెండ్లి మగవారే (అయ్యగార్లు) చేయడం చూశాం. కానీ దాన్ని తిరుగరాస్తూ పశ్చిమ బెంగాల్‌లో నందినీ భూమిక్ పెండ్లి చేయిస్తున్నది.. అది కూడా కన్యాదానం లేకుండా!

జాద్వాపూర్ యూనివర్సిటీలో సంస్కృత లెక్చరర్ నందినీ భూమిక్. పెండ్లి చేయడం ఆమె ప్రవృత్తి. పది సంవత్సరాల్లో 40 పెండ్లిళ్లకు పైగా చేసింది. ఇందులో ఎక్కువగా కులాంతర, మతాంతర, ప్రేమ పెండ్లిండ్లే ఉన్నాయి. ఈ పెండ్లిళ్లకు వాళ్లిచ్చిన డబ్బులను కూడా ఆమె ఖర్చు చేయదు. వాటిని ఏదో ఒక అనాథ శరణాలయానికి దానం చేస్తుంటుంది. ఈమె ఈ మధ్య చేసిన ఓ పెండ్లి బాగా పాపులర్ అయింది. అందులో కన్యాదానం లేకుండా పెండ్లి తంతు ముగించింది. రుగ్వేదంలో కన్యాదానం లేకుండా వివాహం చేయొచ్చని ఉందట. అలాగే తానూ ఈ తంతు చేయించానంటున్నది నందినీ. 'వేదాల్లో ఎక్కడ ఆడవాళ్లు పండితులు, పూజారులుగా ఉండకూడదని లేదు. పితృస్వామ్య సామ్రాజ్యం వల్ల ఆడవాళ్లు ఈ రంగాన్ని ఎంచుకోలేకపోయారు. కానీ నేను మాత్రం దీన్ని ఎవరు ఏమన్నా కొనసాగిస్తూనే ఉంటా' అంటున్నది నందినీ.

మంగళమణి.. హిమ ప్రయాణం

ఈ సమస్త సృష్టిలో అద్భుతాలు చాలానే ఉన్నాయి. అవన్నీ సృష్టి ద్వారా వస్తే.. ఆ సృష్టినే సృష్టించిన మహిళలు మరెన్నో అద్భుతాలు చేస్తున్నారు. హిమ ప్రయాణంతో మరో అత్యాద్భుతం చేశారు మంగళ మణి.

గమ్యం కోసం ఆత్మవిశ్వాసంతో ప్రయాణం ప్రారంభిస్తే ఏ కష్టం మనల్ని ఆపదు. మంగళమణిని కూడా విధి అడ్డుకోలేదు. మంచుపై ఆమె చేసిన ప్రయాణయే ఈ హిమ ప్రయాణం. మంగళమణి ఇస్రో మొదటి మహిళా శాస్త్రవేత్త. ఆయె వయసు 56 యేండ్లు. 403 రోజుల పాటు అంటార్కిటికా మంచులో ఉన్న ఇండియన్ రీసెర్చ్ స్టేషనల్(భారతి)లో పనిచేసి వచ్చారు. 23 మంది ఉన్న ఆ బృందంలో మంగళమణి ఒక్కరే మహిళ. 2016 నవంబర్‌లో వెళ్లిన వీళ్ల బృందం విజయవంతంగా వెళ్లిన పనిని పూర్తి చేసుకొని వచ్చింది. చాలామంది చలికాలం చలికే వణకుతుంటారు. అలాంటిది ప్రపంచంలోనే అతి చల్లని వాతావరణానికి తట్టుకోగలిగారు. మంగళమణిది హైదరాబాద్ కావడం విశేషం. సైఫాబాద్‌లోని హోలీమేరీ హైస్కూల్, మాసబ్‌ట్యాంక్‌లోని పాలిటెక్నిక్ కాలేజ్‌లో డిప్లొమా చదివారు. ప్రస్తుతం షాద్‌నగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నారు.



నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
మంగళవారం 20 మార్చి 2018
WWW.NTNEWS.COM



పొద్దున్నే పక్షుల కిలకిలలు వింటే ఎంత హాయిగా ఉంటుంది.. గాల్లో ఎగురుతూ గమ్మత్తయిన విన్యాసాలు చేస్తుంటే ఎంత ముద్దొస్తుంటుంది.. పిచ్చుకలు రక్షణ కోసం గడ్డితో నిర్మించుకున్న అందమైన గూడును చూస్తే ఆశ్చర్యమేస్తుంది కదా? ఆనందానికి.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఆ పిచ్చుకలు ఎక్కడున్నాయిప్పుడు? పర్యావరణ కాలుష్యం పిచ్చుకల ప్రాణాలు తీస్తున్నది! వాతావరణ మార్పులు వాటి ఉనికికి ప్రమాదకరంగా మారుతున్నాయి! నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం. 'పిచ్చుకల్ని ప్రేమిద్దాం'.. ఈ రోజు నుంచే ప్రారంభిద్దాం!

'గూడు' కట్టుకున్న ప్రేమ!

ఉగాదికి ముందు కొత్త పూతల రుచి చూసిన కోయిల కూహూ.. కుహూ రాగాలు చేస్తుంది. కానీ ఇప్పుడు వినిపిస్తున్నాయా అవి? వాహనాల మోతలకు కావ్‌కావ్‌మనే కాకి అరుపుల ఊసే లేకుండా పోతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే పర్యావరణానికి ముప్పు తప్పదు. మనం ఏంచేయాలి? పరిస్థితి ఇలాగే కొనసాగితే పక్షిజాతి నశించిపోతుంది. అంతరిస్తున్న పక్షిజాతులను కాపాడుకోవడమే మన ముందున్న లక్ష్యం. మార్చి 20వ తేదీ ప్రపంచ పిచ్చుకల దినోత్సవం. ఈ సందర్భంగానైనా పిచ్చుకలను కాపాడుకోవాలని నిపుణులు మరోసారి చెప్తున్నారు.

పిచ్చుకలను ప్రేమించండి..

ఇదే ఈ ఏడాది ప్రపంచ పిచ్చుకల దినోత్సవం థీమ్. పర్యావరణం నుంచి పిచ్చుకలను కాపాడుకోవడం కోసం వాటిని ప్రేమించాలన్నది దీని ఉద్దేశం. మనం రోజుకు ఓ పది లీటర్ల నీళ్లు తాగుతుండొచ్చు. దాంట్లో ఎన్నో వృథాగా పోస్తుంటాం. పిచ్చుకకు కూడా దూపవుతుంది కదా. అందుకే దానికీ కొన్ని నీళ్లు పెట్టండని సూచిస్తున్నారు. కాబట్టి ఈ రోజు నుంచి పిచ్చుకలతో పాటు ఇతర పక్షి జాతుల్ని ప్రేమించడం నేర్చుకోవాలి. పర్యావరణ సమతుల్యానికి పునాదులు వేయాలి.

అవే నా ప్రాణం!

పిచ్చుకలే ప్రాణంగా వాటి సంరక్షణే బాధ్యతగా పనిచేస్తున్న ఓ వ్యక్తి గురించి ఈ సందర్భంగా తెలుసుకుందాం. వాటికోసం ఆయన ఎనిమిదేండ్లుగా కృషి చేస్తున్నాడు. చిన్ననాటి నుంచి పక్షులపై గుండెల్లో గూడుకట్టు ప్రేమంతా కలిపి వాటికి 'గూడు' చూపే ప్రయత్నం చేస్తున్నారు సత్తి రాంచంద్రారెడ్డి. 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' సందర్భంగా ఆయన చేస్తున్న కృషి గురించి ఆయన మాటల్లోనే – 'నా పేరు సత్తి రాంచంద్రారెడ్డి. చిన్ననాటి నుంచే పక్షులంటే ప్రేమ. దానికి ఒక రకంగా మా నాన్న వెంకట సత్యనారాయణరెడ్డి కారణమైతే.. అది నాతో పాటు పెరిగి పెద్దకావడానికి మా నానమ్మ సీతారత్నం కారణం.

ఆమె చిన్ననాటి నుంచి పక్షులకు, చీమలకు ఆహారం పెట్టాలంటూ చెప్పేది. అదే రానురాను నాలో ఒక అలవాటుగా మారింది. నానాటికీ పక్షులు, పిచ్చుకల సంఖ్య తగ్గిపోతున్నది. పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నది నా ఉద్దేశం. పక్షుల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. పక్షులు విత్తనాలు తీసుకెళ్లి వివిధ ప్రదేశాల్లో వేస్తుంటాయి. అలాంటి ప్రదేశాల్లో మొక్కలు వచ్చి అవి వృక్షాలుగా మారుతున్నాయి. 60శాతం అడవులు ఇదే తరహాలో ఏర్పడినవంటే ఆశ్చర్యం కల్గక మానదు. ఉరుకుల పరుగుల మన జీవితంలో అప్పుడప్పుడు పక్షుల కిలకిలారావాలు, వాటి శబ్దాలు వింటే మానసిక ఒత్తిడి తగ్గుతుంది. పక్షులు.. పురుగులు, కీటకాలు తినడం వల్ల పంటల ఉత్పత్తి పెరుగుతుంది. ఇట్లా ఎన్నో ఉపయోగాలున్న

తెలంగాణలో పెరిగిన పక్షి జాతుల సంఖ్య

దేశవ్యాప్తంగా పక్షిజాతులు అంతరించి పోతున్నవేళ.. తెలంగాణలో పక్షి జాతుల సంఖ్య గతంతో పోలిస్తే ఎక్కువ నమోదు కావడం ప్రకృతి ప్రేమికులందరికీ సంతోషాన్నిస్తున్నది. గతంలో తెలంగాణలో 250 పక్షి జాతులు ఉన్నట్టు అధికారిక సమాచారం. ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్ (జీబీబీసీ)– 2018లో దేశవ్యాప్తంగా పక్షి జాతుల సంఖ్య గణన చేపట్టారు. దీనిలో తెలంగాణలో ఈ ఏడాదిలో నూతనంగా 59 పక్షి జాతులను గుర్తించారు. దీంతో తెలంగాణలో పక్షి జాతుల సంఖ్య 309కి చేరింది. అత్యధిక పక్షులు కల్గిన ఆరో రాష్ట్రంగా తెలంగాణ నమోదైంది. రాష్ట్ర సర్కార్ చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ చేపట్టడం, గతేడాది సమృద్ధిగా వర్షాలు కురియడంతో జలాశయాలు, కుంటల్లో నీటి వనరులు పెరుగడం కూడా పక్షుల సంఖ్య పెరుగడానికి ఓ కారణమని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

పక్షులను కాపాడేందుకు ఏదో ఒకటి చేయాలనుకున్నా. అట్లా ఒకరి దగ్గర ఈ పక్షిగూడు చూశాను. పట్టణ ప్రాంతాల్లో పక్షులను కాపాడాలంటే వాటికి ఉండేందుకు గూడు కల్పించాలని అప్పుడే అనుకున్నా. అట్లా పక్షుల గూళ్లు తయారు చేయించి తెలిసిన వాళ్లకు, స్నేహితులకు పంచడం మొదలు పెట్టాను.

మూడువేల పక్షిగూళ్లు..

అందరిలో అవగాహన పెంచగల్గితే పక్షుల పరిరక్షణ సాధ్యమని నేను నమ్ముతాను. కేవలం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం అయిన మార్చి 20నే కాకుండా ఏడాది పొడవునా పిచ్చుకల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నది నా ఆలోచన. పక్షులను కాపాడుకోవాలన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగానే వాటర్ ప్రూఫ్‌తో పక్షి గూళ్లు తయారు చేయించి ఆరేండ్లుగా పంచుతున్నా. ఇప్పటి వరకు దాదాపు మూడువేల మందికి



చెక్కతో తయారు చేసిన పక్షిగూళ్లను ఉచితంగా పంచి ఇచ్చాను. ఈ విషయంపై మరింత చర్చ జరుగాలన్న ఉద్దేశంలో ప్రముఖులకు ఈ పక్షిగూళ్లను ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దీనివల్ల మిగిలిన వారికి సందేశాన్ని త్వరగా చేరవేయవచ్చన్నది లక్ష్యం. కొందరు రాజకీయ నాయకులు, కొందరు సీనియర్ అధికారులు, పలువురు పోలీస్ ఉన్నతాధికారులకు కూడా పక్షిగూళ్లను ఇచ్చాను. వారంతా ఎంతో సంతోషంగా ఫీల్ అయ్యారు. ఈ మధ్య కాలంలో పుట్టినరోజు వేడుకలకు కొందరు మొక్కలను బహుమతిగా ఇస్తుండడం చూస్తున్నాం. నేను మాత్రం ఎక్కడైనా దగ్గరవాళ్ల ఫంక్షన్‌కు గానీ, పుట్టిన రోజు వేడుకకు గానీ వెళ్లినప్పుడు ఒక పక్షిగూడును బహుమతిగా ఇస్తున్నాను. చాలా మంది గిఫ్ట్ కొత్తగా ఉండడంతో దాని గురించి వాకబు చేస్తున్నారు. ఈ రకంగా కూడా ప్రచారం పెంచితే పక్షులను కాపాడుకోవాలన్న సందేశం పంపవచ్చన్నదే నా ఉద్దేశం. అదేవిధంగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన తరగతులు ఇస్తున్నాం. చిన్నతనంలోనే వారికి పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యతను నేర్పితే వారు దాన్ని తప్పక పాటిస్తారు. దీనివల్ల రాబోయే తరాల్లోనూ పక్షుల ప్రాధాన్యం తెలిజెప్పవచ్చన్నది నా ప్రయత్నం. మైసిగండి దగ్గర ఉన్న నా ఫాంహౌస్‌లో టర్కీ కోళ్లు, ఆస్ట్రేలియా జాతికి చెందిన కోళ్లు, పలు రకాల పావురాలు పెంచుతున్నా. పక్షిగూళ్లు తయారీ సొంతంగా చేసుకోవాలనుకునే వాళ్లకు కూడా 91601 13322 నెంబర్‌లో సంప్రదిస్తే సమాచారం ఇస్తున్నాం.

నీళ్లతో పక్షులను కాపాడుకుందాం!

పట్టణ ప్రాంతాలన్నీ కాంక్రీట్ జంగల్‌లా మారిపోతున్నాయి. చెరువులు, కుంటలు పూడ్చి అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. కొన్నిచోట్ల చెరువులు, చిన్నిచిన్న కుంటలు ఉన్నా.. అవి కాలుష్యంతో నిండిపోతున్నాయి. దీంతో ఎండాకాలంలో పావురాలు, పక్షులు, చిన్నచిన్న పిచ్చుకులకు కనీసం నీళ్లు దొరకక అవి చనిపోతున్నాయి. ఇది చాలా బాధాకరం. అందుకే



గుక్కెడు నీళ్లు పెట్టి పక్షులను కాపాడుకుందాం.. అని ఒక ప్రచారం ప్రారంభించాం. మన ఇండ్లలో బాల్కనీలో, టెర్రస్ పైనా చిన్న బౌల్‌లో కొన్ని నీళ్లు పెడితే ఎన్నో పిట్టలను మనం కాపాడుకున్నవాళ్లం అవుతాం. దీనికి మనం ఖర్చు చేయాల్సింది కూడా ఏం లేదు. రెండు నిమిషాలు సమయం కేటాయిస్తే చాలు. ఒక జీవి దాహార్తి తీర్చామన్న సంతృప్తి మనకు దక్కుతుంది. ఈ మధ్యే రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి గారి చేతుల మీదుగా దీనికి సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశాం. ఈ పోస్టర్లను సోషల్ మీడియా ద్వారా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. మంచి స్పందన వస్తున్నది. నేను ఉంటున్న మల్కాజ్‌గిరి ప్రాంతంలోని చాలా అపార్ట్‌మెంట్లలో కాలనీల్లో ఇప్పటికే చాలామంది నీటి తొట్టిలు పెట్టి, రోజూ నీళ్లు పెడుతున్నారు. ఈ ప్రచారం సిటీలో అన్ని ప్రాంతాలకు, ఇతర అన్ని పట్టణాలు విస్తరిస్తున్నది. మా ఈ ప్రయత్నంతో చిన్నచిన్న పిచ్చుకలకు గుక్కెడు నీళ్లు దక్కితే చాలు.


నాగోజు సత్యనారాయణ



పింక్ పెదవుల కోసం..

- బాదం నూనెలో ఉండే గుణాలు చర్మంలో జీవాన్ని నింపుతాయి. కొంచెం బాదం నూనెను పెదవులకి రాసి రాత్రంతా అలా వదిలేయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే తొందరలోనే మృదువైన పెదవులు మీ సొంతమవుతాయి.
- చెంచా నిమ్మరసంలో, రెండు చుక్కల తేనె కలుపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి గంట తర్వాత తడిగుడ్డతో తుడిచేయండి. పెదవులపై ఉన్న మృతకణాలు తొలిగిపోతాయి.
- బీట్‌రూట్ కోసి రసం తీయాలి. దీంట్లో పుదీనా ఆకులు, బాదం నూనె కలిపి పెదవులకు రాస్తే మంచి ఫలితం ఉంటుంది.
- గ్లిజరిన్ చర్మంలో తేమను పట్టి ఉంచడంలో సాయపడుతుంది. కొంచెం గ్లిజరిన్‌ని దూది సాయంతో పెదవులకు అద్ది రాత్రంతా ఉంచుకొని మరునాడు ఉదయం కడిగేసుకోవాలి.
- బేకింగ్ సోడా మృతకణాలను తొలిగించే పదార్థం. అందుకే దీంట్లో కొన్ని నీళ్లు పోసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని పెదవులకు రాసి మసాజ్ చేయాలి. ఐదు నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా రోజు విడిచి రోజు చేయాల్సి ఉంటుంది.

ఎంత కాలం పనిచేస్తుంది?



మా ఆవిడ వయసు 45 సంవత్సరాలు. మూడు నెలల క్రితం హఠాత్తుగా కుప్పకూలిపోయింది. హాస్పిటల్‌లో చేర్పించాం. ఆమెకు కొన్ని సంవత్సరాలుగా షుగర్, హైబీపీ సమస్యలు ఉన్నాయి. ప్రస్తుత ఆమె అనారోగ్యానికి కారణం హార్ట్ ఫెయిల్యూర్ అని డాక్టర్లు తెలిపారు. ఇప్పడు పరిస్థితిని అదుపు చేసినప్పటికీ త్వరలోనే ఆమెకు గుండె మార్పిడి అవసరం అవుతుందని కూడా చెప్పారు. జీవన్‌దాన్‌లో పేరు కూడా నమోదు చేయించుకున్నాం. నిజంగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్‌తో తనను కాపాడడం వీలవుతుందా? మార్పిడి చేసిన గుండె ఎంత కాలం పనిచేస్తుంది? దయచేసి పూర్తి వివరాలు తెలియజేయగలరు.

సుదర్శన్, సిద్దిపేట



డాక్టర్ పి. వి. నరేష్‌కుమార్
సీనియర్ కార్డియో థొరాసిక్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్

హైబీపీ, షుగర్ వల్ల మీ భార్య గుండెకు చాలా నష్టం జరిగినట్టు ఉంది. అధిక బరువు ఉండడం కూడా మరో కారణం కావచ్చు. అలసిపోయినపుడు, పడుకున్నపుడు శ్వాస అందకపోవడం, మితిమీరిన అలసట, ఒంట్లో నీరు చేరడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గుండె ఇక పనిచేయని స్థితికి చేరుకున్న వారిలో గుండె మార్పిడి తప్ప మరో అవకాశం లేదు. అయితే ఇందుకు శరీరంలోని మిగిలిన ముఖ్యమైన అవయవాలైన కాలేయం, గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులకు సంబంధించిన తీవ్రమైన వ్యాధులేమీ లేకుండా ఉండాలి. బ్రెయిన్ డెడ్ స్థితిలో ఉన్న వారి నుంచి గుండెను సేకరించి దాన్ని గుండెమార్పిడి ప్రక్రియ ద్వారా హార్ట్‌ఫెయిల్యూర్ పేషెంట్‌కు అమరుస్తారు. కొత్త వ్యక్తి శరీరంలో ఈ కొత్త గుండె సర్దుకునేందుకు వీలుగా కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది. గుండె మార్పిడి తర్వాత 20–30 సంవత్సరాల వరకు ఆరోగ్యంగా జీవించే అవకాశాన్ని కల్పిస్తుంది. కొన్ని చిన్న పాటి జాగ్రత్తలతో హార్ట్ ఫెయిల్యూర్ పేషెంట్ల జీవితకాలాన్ని గణనీయంగా పెంచే అవకాశం హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ వల్ల కలుగుతుంది. మీరు ఎలాంటి అనుమానం లేకుండా మీ భార్యకు హార్ట్‌ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ చేయించవచ్చు.

నొప్పులు మాయం.. రోగాలు నయం



బెల్లాన్ని చీప్‌గా తీసిపారేయకండి. ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మహిళలను వేధించే నెలసరి నొప్పులను మాయం చేస్తుంది. ఆ సమయంలో వచ్చే విపరీతమైన కడుపు నొప్పికి చెక్ పెట్టాలంటే పాలల్లో బెల్లం ముక్క వేసుకొని రెండు పూటలా తాగితే మంచి ఫలితం ఉంటుంది. నెలసరి వచ్చే రెండు మూడు రోజుల ముందు నుంచి క్రమం తప్పకుండా బెల్లం కలిపిన పాలు తీసుకోవడం వల్ల ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు నిపుణులు. ఆహారం తీసుకున్న తర్వాత కొత్తిమీర, బెల్లంపొడి,సోంపు పొడిని సమపాళ్లలో నీళ్లలో కలుపుకొని తాగితే జీర్ణ సమస్య ఉండదు. గొంతు గరగరకు తులసీ రసంతో పాటు కాసింత బెల్లం కలిసి తీసుకుంటే తగ్గిపోతుంది. పిండివంటల్లో కూడా పంచదారకు ప్రత్యామ్నాయంగా చక్కెరకు బదులు బెల్లం వేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. బెల్లంలో ఉండే విటమిన్లు, ఖనిజాలు, పొటాషియం, ఇనుము, కాల్షియం ఆరోగ్యంగా ఉంచుతాయి.

ఇంట్లోనే దగ్గు మందు



సంత్రాపండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుందన్న విషయం మనకు తెలిసిందే. ఒక మోస్తరు పరిమాణంలో ఉన్న పండును రోజూ తీసుకుంటే దాని ద్వారా రోజుకు శరీరానికి కావల్సిన విటమిన్ సిలో దాదాపు 80 శాతం వరకు అందుతుంది. అయితే ఇందులో ఔషధ గుణాలు కూడా చాలా ఎక్కువన్న విషయం ఎక్కువ మందికి తెలియదు. సంత్రా పండుకు దగ్గు నుంచి వెంటనే ఉపశమనం కలిగించే లక్షణం ఉంది. అయితే ఇందుకు పండు తీసుకునే విధానాన్ని కాస్త మార్చాలి. ఎంతో రుచికరమైన దగ్గు మందు ఇలా చేసుకోవచ్చు.



సంత్రాపండును తీసుకొని ఒక సాసర్‌లో ఉంచాలి. పండు తొడిమె వైపు కత్తితో కోసి ముక్క చేయాలి. ఈ ముక్క పడెయ్యకుండా పక్కన పెట్టుకోవాలి.



ఇప్పుడు పండు మధ్యలో ఒక చెంచా ఉప్పు చల్లాలి.



తర్వాత కోసి పక్కన పెట్టిన పండు మూతను తిరిగి దాని మీద ఉంచి అది కదలకుండా ఉండేందుకు ఒక టూత్ పిక్‌ను గుచ్చి పెట్టాలి.



ఇప్పుడు ఈ సాసర్‌ను ఒక గిన్నెలో పెట్టి ఆ గిన్నెను నీటితో ఉన్న మరో గిన్నెలో పెట్టి దాన్ని స్టౌమీద పెట్టి వేడి చెయ్యాలి.



సంత్రా పండు వేడయ్యాక తీసి పక్కన పెట్టుకోవాలి.



దీన్ని చల్లారనిచ్చి తర్వాత టూత్ పిక్ సహాయంతో మూసేసిన మూత తీసి లోపలున్న సంత్రా పండు గుజ్జు తినేస్తే దగ్గు నిమిషాల్లో తగ్గిపోతుంది.

వేసవిలో కళ్లు జాగ్రత్త

ఎండా కాలం ఎండలో తిరిగే వారు చర్మానికి సంబంధించిన జాగ్రత్తలు ఎక్కువగా తీసుకుంటారు కానీ కళ్ల గురించి పెద్దగా జాగ్రత్తలు తీసుకోరు. కానీ ఎండల్లో కళ్ల గురించి జాగ్రత్త పడాలని నిపుణులు సూచిస్తున్నారు.



- ఎండా కాలంలో ధరించే సన్ గ్లాసెస్ ముదురు రంగులవి ఎంచుకోవాలి. అంతేకాదు యూవీ ప్రొటెక్షన్ కలిగినవైతే మరింత మంచిది. ఇది ఫ్యాషన్, అందంతో పాటు కంటికి రక్షణ కూడా ఇస్తాయి.
- కంటికి నేరుగా ఎండ తగలకుండా హ్యాట్ ధరించడం కూడా మంచిదే.
- నీళ్లు ఎక్కువగా తాగి శరీరాన్ని తగినంత హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి.
- ఎండాకాలంలో ఈత కొలనుల్లో ఎక్కువ సమయం గడపడానికి ఇష్టపడతారు చాలా మంది. అయితే స్విమ్మింగ్ పూల్‌లలోని నీటి శుద్ధికి క్లోరిన్ ఉపయోగిస్తారు. ఇది కళ్లకు ఇబ్బంది కలిగించవచ్చు. కాబట్టి స్విమ్మింగ్‌ను ఎంజాయ్ చేసే వారు తప్పనిసరిగా గాగుల్స్ ధరించాలి.
- ఎండాకాలం గాలి చాలా పొడిగా ఉంటుంది. అంతేకాదు పొడిగాలిలో ఎక్కువ అలర్జన్స్ ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. త్వరగా కళ్లకు సంబంధించిన అలర్జీకి గురయ్యే వారు జాగ్రత్తగా ఉండాలి. కళ్లు ఎండిపోయినట్టుగా అనిపించినా, ఎర్రగా మారినా, మరేరకమైన ఇబ్బందిగా అనిపించినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- విపరీతమైన వేడి వల్ల కళ్లు మంటలుగా అనిపించవచ్చు. ఇలాంటి ఇబ్బంది కలిగినపుడు చల్లని నీటితో కళ్లు కడుక్కోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. తీరిక సమయాల్లో చల్లని నీటిలో తడిపిన కాటన్ ప్యాడ్స్, కీరదోసకాయ ముక్కలు కంటి మీద ప్యాడ్స్‌గా ధరించడం ద్వారా కంటికి చల్లదనాన్ని అందించవచ్చు.
- నీళ్లు కంటికి తాకడానికి ముందే కాంటాక్ట్ లెన్స్ తీసేయ్యడం మరచిపోవద్దు.
- భోజనంలో క్యారెట్, బీట్‌రూట్, ఆకుకూరలను ఎక్కువగా తీసుకుంటే కంటి ఆరోగ్యం బావుంటుంది.
- రోజ్ వాటర్, పాలు వంటి ఏ పదార్థాలు కంటిలో వెయ్యకూడదు.

ఇలాంటి చిన్న జాగ్రత్తలతో ఎండాకాలం కూడా కళ్లను చల్లగా ఉంచుకోవచ్చు.

మాకు రాయండి

ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలతో పాటుగా వివిధ రకాల జబ్బుల గురించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నది మన జీవనరేఖ. అంతేగాకుండా వ్యాధుల నివారణోపాయాలు, ఆధునిక చికిత్సలు, కొత్త పరిశోధనల గురించిన సమాచారాన్ని అందిస్తూ మీకూ, మీ కుటుంబానికి ఉపయోగపడుతున్నదని భావిస్తున్నాం.

మీకు ఆరోగ్యాన్ని మరింత చేరువ చేసేందుకు, మీ కథల్ని మరింతమందిలో స్ఫూర్తి నింపేందుకు నడుం కట్టింది జీవనరేఖ. అందుకే మీకు వైద్య, ఆరోగ్య సంబంధమైన సందేహాలు, సమస్యలేవి ఉన్నా మాకు రాసి పంపండి. నిపుణుల చేత సూచనలిప్పిస్తాము. అంతేకాదు.. మీరేవైనా జబ్బుల్ని ధైర్యంగా ఎదుర్కున్నా మాకు చెప్పండి. మీ ధైర్యం పదిమందికి ఆశ కల్పించగలుగుతుంది.

డాక్టర్లు, హాస్పిటల్స్‌తో మీకు కలిగిన అనుభవాలు మంచివైనా, చెడ్డవైనా మాతో పంచుకోండి. పేషెంట్ డైరీలో భాగంగా ప్రచురిస్తాం.



మా చిరునామా
జీవనరేఖ
నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్
రోడ్ నెం. 10,
బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500 034
jeevanarekha@ntnews.com



ఇప్పుడు ఒకప్పటిలా కాదు. జనరేషన్ మారిపోయింది. ఆహారం విషయంలోనూ, ఆరోగ్యం విషయంలోనూ విపరీతమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాలు తాగే శిశువుల్లో, ఎదుగుతున్న చిన్నారుల్లో ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయాయి. కానీ ఆ ఇన్‌ఫెక్షన్ల తగ్గుదలే భవిష్యత్ అలర్జీలకు కారణమవుతున్నదనే విషయం చాలా మందికి తెలియదు. సరైన అవగాహన లేకపోవడం వల్ల ఆ అలర్జీనే సైనసైటిస్‌లాంటి తీవ్రమైన సమస్యకు దారి తీస్తున్నదనే విషయం అసలెవరికీ అర్థం కాదు. ఇంతకూ ఈ సైనస్ అంటే ఏమిటి? ఈ సమస్య ఎందుకు ఉత్పన్నమవుతుంది? దాని ప్రభావం ఎలా ఉంటుంది? దాన్ని గుర్తించే లక్షణాలేమిటి? నియంత్రించే మార్గాలేమిటి? వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకే మీ ముందుకొచ్చింది ఈ వారం జీవనరేఖ.


సైలెంట్ కిల్లర్.. సైనసైటిస్

ఇంట్లో పిల్లలకు ఇన్‌ఫెక్షన్స్ సోకకపోతే మంచిదే. కానీ అవి సోకకపోతే వారి శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగదు. అదే భవిష్యత్తులో అలర్జీల రూపంలో ఇబ్బంది పెడుతుంది. అలాంటి సమస్యే సైనసైటిస్. పిల్లలైనా, పెద్దవాళ్లయినా.. తుమ్ముతుంటారు, దగ్గుతుంటారు.. జలుబుతో ఆపసోపాలు పడుతుంటారు. అయినా అది మామూలు జలుబుగానే భావిస్తారు. చూడ్డానికి మామూలు తుమ్ముల్లాగే కనిపించినా, సాధారణ దగ్గు మాదిరిగానే అనిపించినా.. ఆదమరిస్తే ఆరోగ్యంపై పెను ప్రభావం చూపే వ్యాధి ఇది. అదే సైనసైటిస్.

సైనస్ అంటే?

కంటికి కిందిభాగంలో, ముక్కుకు పైభాగంలో ఉంటాయి ఈ సైనస్ రంధ్రాలు. కంటికి, మెదడుకి రక్షణ కవచాలుగా పనిచేస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే సైనస్‌ను కంటిని కాపాడే గొప్ప అవయవంగా అభివర్ణించవచ్చు.

సైనసైటిస్ ఎందుకొస్తుంది?



కాలుష్యం కారణంగా ధూళి, దుమ్ము చేరి సైనస్ రంధ్రాలు చిన్నగా మారిపోతాయి. ఒక్కోసారి పూర్తిగా మూసుకుపోయి వాటిలో చేరిన నీరు (ద్రవాలు) బయటకు వెళ్లే దారిలేక అందులోనే ఉండిపోవడంతో సైనస్‌లలో అలర్జీ వస్తుంది. ఇది తీవ్రరూపం దాల్చితే సైనటైటిస్‌గా మారుతుంది. చిన్న అలర్జీగా మొదలైన ఈ వ్యాధి, ఫంగల్ సైనటైటిస్‌గా మారి కంటి చూపును హరించే ప్రమాదం ఉంది. ఒక్కోసారి మెదడుపై ప్రభావం చూపి ప్రాణాంతకం కూడా కావొచ్చు.

వ్యాధి లక్షణాలు



తరచూ దగ్గు వస్తుండడం, జలుబు ఇబ్బంది పెడుతుండడం, తల నొప్పిగా ఉండడం, తల భారంగా అనిపించడం, శ్లేష్మాలు ముక్కు వెనుకభాగం ద్వారా గొంతులోకి చేరడం, మాట బొంగురు పోవడం, గొంతు నొప్పిగా ఉండడం, చెవినొప్పి రావడం వంటివి సైనసైటిస్ లక్షణాలుగా గుర్తించాలి. ఈ లక్షణాలు ప్రారంభదశలోనే గుర్తించి వైద్యం తీసుకొంటే పరిస్థితి చేయి దాటకుండా చూసుకోవచ్చు.

కంటికీ సమస్యే



కంటికీ, సైనస్‌కు మధ్య ట్యూమనా ప్రపరేషియా అనే పలుచని ఎముక ఉంటుంది. సైనసైటిస్ వల్ల ఆ ఎముక ధ్వంసమవుతుంది.



దీంతో ఇన్‌ఫెక్షన్ కంటికి సోకి.. చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అది సోకిన 24 గంటల్లోపు చికిత్స చేస్తేనే రోగి తిరిగి చూపు పొందే అవకాశం ఉంటుంది. లేదంటే రోగి శాశ్వతంగా చూపును కోల్పోవల్సి వస్తుంది.

ఇలా వ్యాపిస్తుంది..



ముఖ్యంగా సైనసైటిస్ పలు దశల్లో వ్యాప్తి చెందుతుంది. అలర్జీగా మొదలై వైరల్ ఇన్‌ఫెక్షన్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ ద్వారా వ్యాపిస్తుంది. అయితే అలర్జీ దశలో ఉన్నప్పుడే దీన్ని కనిపెట్టి సాధారణ చికిత్స ద్వారా నియంత్రించవచ్చు. ఆదమరిస్తే అది బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్‌కు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్‌కు దారితీయవచ్చు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అని నిర్ధారణ అయితే సర్జరీ అవసరమవుతుంది. మూడేళ్ల వయసు నుంచి 55 ఏళ్ల లోపు వారిలో ఈ సైనస్ సమస్యను గమనించవచ్చు. 55 ఏళ్లు పైబడిన వారిలో ఈ సమస్య అంతగా కనిపించదు. ఇది జన్యుపరంగా కూడా సక్రమించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



సైనసైటిస్ సాధారణ జలుబు (ఇన్‌ఫ్లుయెంజా) మాదిరిగానే ప్రారంభవుతుంది. సాధారణంగా జలుబు వచ్చినప్పుడు ఆట్రి నోజ్, న్యాసివియాన్, జైలో మెటాజోలిన్, ఆక్సి మెటాజోలిన్ చుక్కల మందును ముక్కులో వేసుకుంటే సైనసైటిస్‌కు దారి తీయకుండా నియంత్రించవచ్చు. అయితే ఈ మెడిసిన్‌ను ఏడు రోజులకు మించి వాడడం మంచిది కాదు. ప్రారంభంలోనే సైనస్ సమస్యను నియంత్రించడం వల్ల కంటిచూపుపైనా, మెదడుపైనా ప్రభావం పడకుండా చూడవచ్చు.



సైనస్ సమస్యను తేలిగ్గా తీసుకుంటే ఆస్తమాగా మారే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. తొంభై శాతం మందికి ఆస్తమా రావడానికి కారణం సైనసైటిసేనని పరీక్షల్లో తేలింది. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టిన ప్రధానమైన నినాదాల్లో సైనసైటిస్ నివారణ కూడా ఒకటిగా చేరింది.

సహజ చికిత్స.. జలనైతి

కాలుష్యాన్ని తగ్గించడం కష్టం కావొచ్చు. కానీ దాని ప్రభావం మన ఆరోగ్యంపై పడకుండా కాపాడుకోవడానికి ఇదొక సహజసిద్ధమైన చికిత్సావిధానం. ఒక పాత్రలో నీటిని బాగా మరిగించి చల్లార్చిన తర్వాత అందులో కొంత ఉప్పు కలిపి పీల్చుకోవడం ద్వారా.. కాలుష్య ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఈ ప్రక్రియనే జలనైతిగా పిలుస్తారు. దీనివల్ల సైనస్ సమస్యను ఆరంభదశలోనే నియంత్రించవచ్చు.



అందుబాటులో ఆధునిక చికిత్స

ఈ సైనటైటిస్‌కు శాశ్వత చికిత్స అందుబాటులో లేదనే అపోహలు ఉన్నాయి. అది ఎంతమాత్రం నిజం కాదు. ఇంతకు ముందు సైనటైటిస్‌కు టెక్నాలజీతో కూడిన వైద్యసదుపాయం అందుబాటులో లేకపోవడం నిజమే అయినా.. ఇప్పుడు శస్త్ర చికిత్స (సర్జరీ) ద్వారా పూర్తిస్థాయిలో వ్యాధిని నిర్మూలించే అవకాశం ఉంది. అపోహలు పక్కనబెట్టి ఆధునిక చికిత్స చేయించుకొనేందుకు ముందుకు వస్తే శాశ్వతంగా సైనస్ బాధ నుంచి బయటపడవచ్చు.

డాక్టర్ కె.ఆర్. మేఘనాథ్
చీఫ్ సర్జన్, మా ఇఎన్‌టి హాస్పిటల్స్
హైదరాబాద్



బెణుకుతో బెంగపడొద్దు



ఆటలాడుతున్నప్పుడో, తొందరలో పరుగెత్తుతున్నప్పుడో.. కాలి చీలమండలు బెణుకుతుంటాయి. ఆ సమయంలో నొప్పి భరించరానిదిగా ఉంటుంది. అలాంటి సమయంలో కొన్ని ప్రాథమిక చికిత్సా సూత్రాలు పాటిస్తే నొప్పి తగ్గుతుంది. సమస్య తీవ్రత ఎక్కువ కాకుండా ఉంటుంది. అవేమిటంటే..



విశ్రాంతినివ్వాలి

అనుకోకుండా చీలమండ బెణికి కాలు కింద పెట్టరానంత నొప్పిగా ఉంటే, వెంటనే చేస్తున్న పనిని ఆపేయాలి. కింద కూర్చుని కొద్దిసేపు కాలికి విశ్రాంతినివ్వాలి. ఆసరా తీసుకొని కాలిని కొంచెం పైకిలేపి కూర్చోవాలి.



ఐస్‌తో కూల్ చేయాలి

బెణికిన చీలమండను కొన్ని మంచుగడ్డల సాయంతో చల్లబర్చాలి. ఇలా చేయడం వల్ల ఆ ప్రాంతంలో బెణుకు రాదు, నొప్పి తగ్గుతుంది. ఒక బ్యాగులో ఐస్‌ను తీసుకొని దాన్ని దాదాపు అరగంటపాటు చీలమండపై పెట్టాలి. డైరెక్టుగా మంచు గడ్డలను చర్మంపై పెట్టకూడదు. అది ఇతర సమస్యలకు దారి తీస్తుంది.



ఒత్తిడి ప్రయోగించాలి

బెణికిన చోట చీలమండను సుతిమెత్తగా ఒత్తాలి. కాటన్‌తో చేసిన మెత్తటి ప్యాడ్‌ను చీలమండ చుట్టూ ప్రెస్ చేయడానికి ఉపయోగించాలి. దీనికోసం ఒక కంప్రెషన్ బ్యాండేజ్ వాడితే చీలమండ భాగం వాపు రాకుండా ఉంటుంది.



ఎత్తులో ఉంచాలి

చీలమండను బ్యాండేజ్ కట్టిన తర్వాత భూమి నుంచి కాస్త ఎత్తులో ఉండేలా చూడాలి. అందుకోసం కాలి కింద మెత్తను ఉంచితే సరిపోతుంది. అలా కొద్దిసేపు గాయపడిన భాగానికి రెస్ట్ ఇవ్వండి. అయితే నొప్పి ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తే డాక్టరు దగ్గరికెళ్లడం మంచిది.



రక్త ప్రసరణ చెక్ చేస్కోండి

కాలికి కట్టిన బ్యాండేజ్ మరీ టైట్‌గా ఉంటే రక్త ప్రసరణ మీద ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అది తెలుసుకోవాలంటే బ్రొటనవేలు గోరును, అది తెల్లగా మారేంత వరకు నొక్కాలి. అది వెంటనే కలర్ మారాలి. అలా జరుగలేదంటే బ్యాండేజ్ మరీ బిగుతుగా ఉన్నట్టు గుర్తించి వెంటనే తీసి, మళ్లీ కట్టాలి. ఇలా ప్రతీ పది నిమిషాలకోసారి చెక్ చేసుకోవాలి.



రెండు మూడు గంటలకోసారి..

బ్యాండేజ్ కట్టిన తర్వాత కూడా రెండు మూడు గంటలకోసారి చీలమండను ఐస్‌బ్యాగ్‌తో మెత్తగా ఒత్తాలి. రాత్రి పడుకొనే సమయంలో బ్యాండేజ్ తీసేయాలి. గాయంపై ఐస్ బ్యాగ్‌ను ఉంచి నిద్రపోకూడదు.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 20 మార్చి 2018



చనిపోయిన తరువాత చుట్టూ జరిగే విషయాలను ఆత్మ గమనిస్తుందనీ, మంచీ చెడూ అనుకుంటుందనీ... కోరికలు తీరకపోతే ఘోషిస్తుందనీ... ఇలా ఎన్నో రకాలుగా అంటుంటారు. అంటే మరణించిన తరువాత కూడా మనిషి మెదడులో ఆలోచనలు కొనసాగుతాయని దీని అర్థం. ఇలాంటి నమ్మకాలను ఇక తూచ్ అని కొట్టేయనక్కరలేదేమో! ఎందుకంటే మనిషి మరణం తరువాత కూడా మెదడులో చర్యలు కొనసాగుతాయని చెప్తున్నాయి కొత్త పరిశోధనలు.

చనిపోయాక.. మెదడు బతికి ఉంటుందా..!

మరణించిన తరువాత మనిషి మెదడు కూడా చనిపోతుందనుకుంటున్నాం. మెదడు పనిచేయకుండా స్తంభించి, బ్రెయిన్ డెత్ అయినవాళ్లను చనిపోయిన వాళ్ల కిందే అనుకుంటున్నాం. అలాంటి వాళ్లు తమ అవయవాలను దానం చేయడం ద్వారా వాటిని మరొకరికి అందివ్వొచ్చు. కాని మెదడు మాత్రం అలా ఉపయోగపడలేదు. మెదడు తప్ప దాదాపుగా అన్ని అవయవాలనూ తిరిగి ఉపయోగించుకోవచ్చు. కాని ఇటీవలి పరిశోధనలు మెదడును కూడా మరణం తర్వాత వినియోగించొచ్చంటున్నాయి. అవయవదానం ద్వారా మెదడును కూడా మరొకరికి ఇవ్వొచ్చేమో అంటున్నాయి. శరీరం చనిపోయిన తరువాత కూడా మెదడు మరో పది నిమిషాల వరకు పనిచేస్తుందంటున్నాయి ఇటీవలి పరిశోధనలు. ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్న వ్యక్తి క్లినికల్‌గా చనిపోయాడని ధ్రువీకరించిన తరువాత కూడా అతని మెదడు పనిచేస్తున్నట్టుగా గమనించారు కెనడా డాక్టర్లు. పల్స్ లేకపోవడం, కనుపాపలు కదలకపోవడం లాంటి అనేక రకాల సాధారణ అంశాల ఆధారంగా అతను చనిపోయాడని నిర్ధారణకు వచ్చారు. కాని మెదడు మాత్రం పనిచేస్తున్నట్టు కొన్ని పరీక్షల్లో తేలింది. గాఢమైన నిద్రలో ఉన్నప్పుడు మెదడులో ఏర్పడే ప్రతిస్పందనలే చనిపోయిన తరువాత కూడా కనిపించాయి. అంటే చనిపోయినప్పుడు ఓ పదినిమిషాల పాటు మెదడు గాఢనిద్రలో ఉన్నదన్నమాట.

ఇంకా రహస్యమే!

ఈ కొత్త పరిశోధన వైద్యశాస్త్ర రంగంలో నూతన మార్పులకు నాంది కానుంది. వెస్టర్న్ ఒంటరియో యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు కూడా ఇలాంటి అంశాలనే గమనించినట్టు బయటపెట్టారు. హృదయ స్పందన, ధమనిలో రక్తపోటు ఆగిపోగానే ఒక డెల్టా తరంగం విచ్ఛిన్నం అయినట్టుగా గమనించారు. మెదడులో ఇలాంటి క్రియ నలుగురు వ్యక్తుల్లో గమనించారు డాక్టర్లు. ఈ చర్యల వెనుక కారణమేంటో తెలియదు. అయితే గతంలో కూడా ఇలా జీవి చనిపోయిన తరువాత ఓ నిమిషంలోగా మెదడులో ఇలాంటి ఊహకందని చర్యలు జరుగడం గమనించారు గానీ ఎలుకల్లో మాత్రమే అధ్యయనం చేశారు. మరణం తరువాత శరీరానికి, మనసుకూ (మెదడు) ఏమవుతుందనే రహస్యాన్ని ఇంకా ఛేదించలేకపోతున్నాం. గత ఏడాది జరిగిన అధ్యయనాల్లో కూడా ఓ వింత విషయం బయటపడింది. చనిపోయిన వాళ్లలోని జన్యువులు ఇంకా పనిచేయడం కొనసాగిస్తాయనీ, మరింత చురుగ్గా వాటి పనితీరు ఉంటుందని కనుక్కున్నారు. చనిపోయిన కొద్ది రోజుల వరకు ఇలాంటిది గమనించారు. ఇప్పుడు మెదడు కూడా చనిపోయిన తరువాత పనిచేయడంలోని రహస్యం గురించి మాత్రం మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. ఇవి విజయవంతం అయితే మెదడు మార్పిడి కూడా సాధ్యమవుతుందేమో!





ఒక్క తిమింగలమూ జన్మించలేదట!

సముద్ర జీవాల్లో తిమింగలం ప్రత్యేకమైనది, ఆసక్తికరమైది. వీటన్నింటికీ మించి భయానకమైనది. అలాంటి జీవి అంతరించే దశకు చేరుకున్నదా? ఔననే అంటున్నారు పరిశోధకులు.

ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో తిమింగలాల పెంపకంపై దృష్టి పెట్టిన శాస్త్రవేత్తల బృందానికి.. ఇటీవల జరిగిన అనూహ్య పరిణామం షాక్‌కు గురిచేసింది. పిల్లలను కనడానికి అనువైన ఈ కాలంలోనూ తిమింగలాలు ఒక్క బిడ్డకూ జన్మనివ్వకపోవడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యం గొలుపుతున్నది. అందుకే అంతరించిపోతున్న ఈ సముద్రజీవి భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పరిశోధకులు. సాధారణంగా నవంబర్ నుంచి మార్చి కాలంలో తిమింగలాలు.. బిడ్డలకు జన్మనిచ్చే సమయం. ఆ టైమ్‌లో అవి సముద్రగర్భంలో ఉండే వెచ్చని నీటిలో ఉండేందుకు ఇష్టపడుతాయి. వాటి పిల్లలను కూడా కొన్ని రోజుల పాటు ఆ వెచ్చని నీటిలో ఉంచేందుకే ఆసక్తిచూపుతాయి. అయితే తాజాగా నేషనల్ ఓషియనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ సర్వే ప్రకారం.. ఈ సారి తిమింగలాలు ఒక్క బిడ్డకు జన్మనివ్వలేదని తేలింది. గణాంకాల ప్రకారం ఉత్తర అట్లాంటిక్‌లో 450 తిమింగలాలు ఉంటే, అందులో 94 ఆడవి. అయితే జన్మిస్తున్న వాటి కంటే మరణిస్తున్న వాటి సంఖ్యే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తున్నదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

సముద్రంపై సెయిలింగ్ బోట్ డ్రోన్స్



సముద్ర వాతావరణం ఎప్పటికప్పుడు కొత్తరూపును సంతరించుకుంటుంది. ఇప్పుడున్నట్టు మరు నిమిషం ఉండకపోవచ్చు. అలాంటి వాతావరణాన్ని అంచనా వేసేందుకు కొత్త టెక్నిక్ కనిపెట్టారు పరిశోధకులు.

సముద్రపు అలలపై రయ్యున దూసుకుపోయే సెయిలింగ్ బోట్స్‌పై ప్రయాణం క్రేజీగా ఉంటుంది. అంతులేని ఆనందాన్నివ్వడమే కాదు, ఆ సెయిలింగ్ బోట్లతోనే సముద్రవాతావరణాన్ని అంచనా వేయడానికి, అందుకు తగిన చర్యలు చేపట్టేందుకు నూతన టెక్నాలజీని అభివృద్ధి చేశారు కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు. దాని పేరే సెయిల్ డ్రోన్. ఇంతకు ముందయితే సముద్ర ఉపరితలానికి సంబంధించిన వాతావరణ సమాచారాన్ని బ్యుయోస్, శాటిలైట్స్ ద్వారా తెలుసుకొనేవారు. తాజా నేషనల్ ఓషియనిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ శాస్త్రవేత్తలు డ్రోన్స్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే వాటిని సెయిలింగ్ బోట్స్‌కు అమర్చడం ద్వారా సముద్ర వాతావరణాన్ని అంచనా వేయడంలో విజయం సాధించారు. మరో పదేళ్లలో వేల సంఖ్యలో ఈ సెయిల్ బోట్ డ్రోన్స్ ప్రపంచంలోని సముద్రాలన్నింటిని చుట్టేస్తాయని చెబుతున్నారు. ఈ సెయిల్ బోట్స్‌కు అమర్చిన డ్రోన్లు సముద్ర ఉపరితలంపై గాలుల వేగాన్ని, తద్వారా వాతావరణంలో కలిగే మార్పులను ఎప్పటికప్పుడు తెలియజేస్తాయట. అందుకోసం వీటిలో సెన్సార్స్‌ను అమర్చినట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సముద్ర ఉపరితం ఉష్ణోగ్రతలు, అలల కొలతలు, కార్బన్‌డయాక్సైడ్, ఆక్సిజన్‌ల వివరాలను ఇవి తెలియజేస్తాయంటున్నారు.

సలహా



ప్రొస్టేట్ క్యాన్సర్‌కు పరీక్షలివే..!

ఎవరికైనా 50 ఏళ్ల వయసు వచ్చే సరికి జీవన బాధ్యతలు మీదపడతాయి. కొంతమంది పురుషుల్లో సరిగ్గా అదే సమయంలో ప్రొస్టేట్ క్యాన్సర్ సమస్యలు మొదలవుతాయి. ఇతర బాధ్యతల్లో పడి ఆరోగ్యం పాడవుతోందన్న విషయాన్ని విస్మరిస్తే ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు ఏర్పడవచ్చు. అయితే క్యాన్సర్ లక్షణాలేవీ ముందుగా కనిపించవు. అందుకే చాలా సార్లు వ్యాధి బాగా ముదిరేదాకా ఏమీ తెలియదు. అయితే 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక్క పురుషుడు ఏటా ఒక్కసారైనా పీఎస్‌ఏ పరీక్ష చేయించుకోవడం ద్వారా ప్రొస్టేట్ క్యాన్సర్‌ను ఆదిలోనే అడ్డుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

యాభై ఏళ్లు దాటిన కొంత మంది పురుషులు ప్రొస్టేట్ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తుంది. తక్కువ వయసు వారిలో ఈ సమస్య రాదని కాదు కానీ, వయసు పైబడిన వారిలో మాత్రం మరీ ఎక్కువగా కనిపిస్తుంది. నిజానికి కేవలం పీఎస్‌ఏ అనే ఒక పరీక్ష ద్వారా ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని ముందే గుర్తించే వీలుంది. 50 ఏళ్లు దాటిన ప్రతి పురుషుడు ఏటా ఒకసారి ఈ పీఎస్‌ఏ పరీక్ష చేయించుకుంటే సమస్యనుంచి బయటపడే అవకాశాలు చాలా ఉంటాయి. ఇదొక సాధారణ రక్తపరీక్ష ద్వారా తేలిపోయే పరీక్ష. ఎప్పుడో తెలిసే నాటికి అది శరీరంలోని ఇతర భాగాలకు కూడా పాకిపోయి ఉంటుంది. ప్రొస్టేట్ క్యాన్సర్‌ను ముందు గుర్తిస్తే ఆ దశలో వైద్య చికిత్సలు అందించడం చాలా సులువు. ఆ దశలోనే సరైన చికిత్సలు అందితే క్యాన్సర్ పూర్తిగా నయమైపోతుంది.

లక్షణాలు

మూత్ర విసర్జనలో ఏదో అడ్డుపడుతున్నట్టు అనిపించడం, మంట అనిపించడం, మూత్రం కొద్ది క్షణాలైనా ఆపుకోలేకపోవడం, మూత్రం వచ్చినట్టే వచ్చి రాకపోవడం, లేదా రావడానికి ఎక్కువ సమయం పట్టడం వంటి లక్షణాలులు ఎక్కువ మందిలో కనిపిస్తాయి. అలాఏగ చాలా ఎక్కువ సార్లు మూత్రం రావడం, ప్రత్యేకించి రాత్రివేళ ఏ మూడు నాలుగు సార్లో నిద్రలేవాల్సి వస్తుంది. మూత్రం ధార సన్నబడటం, దూరంగా కాకుండా అక్కడే పడటం, మూత్రంలో రక్తం పడటం వంటి లక్షనాలు కూడా ఉంటాయి. మూత్ర విసర్జనలో పలురకాల అంతరాయాలు ఏర్పడి ఒక దశలో కిడ్నీలు పనిచేయలేని స్థితి కూడా ఏర్పడవచ్చు. ఇవన్నీ ప్రొస్టేట్ క్యాన్సర్ లక్షణాలు అయితే ఇవన్నీ క్యాన్సర్‌తో సంబంధం లేని బినైన్ ప్రొస్టేట్ హైపర్‌ట్రోఫీలో కూడా ఉంటాయి. ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన చాలా మంది పురుషుల్లో ఈ లక్షణాలు కనిపిస్తాయి. అయితే సాధారణ పీఎస్‌ఏ పరీక్ష ఈ రెండింటినీ వేరు చేస్తుంది.

మూడు రకాల వైద్యం

ఈ క్యాన్సర్లు ప్రొస్టేట్ గ్రంధికే పరిమితమైనది. ఎముకలకు కూడా పాకింది. ప్రొస్టేట్ మొత్తంగా వ్యాపించినా, ఎముకలకు పాకనిది అంటూ ప్రొస్టేల్ క్యాన్సర్లు మూడు రకాలుగా ఉంటాయి. ఒకవేళ క్యాన్సర్ ప్రొస్టేట్ గ్రంధికి మాత్రమే పరిమితమైతే రాడికల్ ప్రొస్టేటెక్టమీ, లేదా రాడికల్ రేడియోథెరపీ ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు. ఇవే కాకుండా నర్వ్స్ బేరింగ్ ప్రొస్టెక్టమీ అని కూడా ఉంటుంది. ముఖ్యంగా అంగస్తంభన సమస్యలు, వీర్యం వెనక్కి వెళ్లిపోవడం వంటి లైంగిక సమస్యలకు ఈ చికిత్స చేస్తారు. సమస్య ప్రారంభంలోనే గుర్తిస్తే వీటి నుంచి రోగి సంపూర్ణంగా బయటపడే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం ఈ నర్వ్ బేరింగ్ ప్రొస్టెటెక్టమీని లాపరోస్కోపిక్ విధానంలో చేస్తున్నారు. అలాగే రోబోల సహాయంతో కూడా చేస్తున్నారు. వీటి ద్వారా సర్జరీ మరింత సమర్థవంతంగా చేసే అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ క్యాన్సర్ కేవలం ప్రస్టేట్ గ్రంధికి పరిమితమై ఉన్నపుడు అనుసరించే విధానాలు. అయితే రాడికల్ రేడియో థెరపీతో కూడా అంతే సమానంగా ఫలితాలు వస్తున్నాయి. ఆధునికంగా వచ్చిన ఐఎమ్‌ఆర్‌టీ (ఇంటెన్సిటీ మాడ్యులేటెడ్ రేడియో థెరపీ) లేదా ఐజీఆర్‌పీ (ఇమేజ్ రేడియో థెరపీ) విధానాల్లో రేడియేషన్‌ను సరిగ్గా ప్రొస్టేట్ గ్రంథి మీద కేంద్రీకృతం చేస్తారు. అలా చేయడం వల్ల శస్త్ర చికిత్సతో సమానంగా ఫలితాలు వస్తున్నాయి. కాకపోతే రేడియేషన్ 30 రోజుల దాకా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధానాలతో ఒకటి రెండు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. అందేకే ఇటీవలి కాలంలో సైబర్ నైఫ్ అనే కొత్త రేడియోథెరపీ వచ్చింది. దీనితో కేవలం రెండు నుంచి ఐదు దఫాలకే రేడియేషన్ పూర్తవుతుంది. క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నపుడు ఈ విధానం బాగా తోడ్పడుతుంది. ప్రొస్టేట్ గ్రంధికే పరిమితమైన క్యాన్సర్ ఒక తీవ్రస్థాయికి చేరినపుడు రేడియేషన్‌తో పాటు హార్మోన్ చికిత్సలు కూడా చేయాల్సి ఉంటుంది. ప్రొస్టేట్ క్యాన్సర్ కణాలు టెస్టోస్టిరాన్ హార్మోన్ మీదే ఎక్కువగా ఆధారపడి ఉండటం వల్లే ఈ హార్మోన్ నియంత్రణా చికిత్సలు ఇందులో భాగమయ్యాయి. నిజానికి, శరీరంలో టెస్టోస్టిరాన్ హార్మోన్ ఉత్పత్తిని ఆపగలిగితే అది ప్రొస్టేట్ క్యాన్సర్ కణాలు నియంత్రించడమే అవుతుంది.

కొత్త దారులు వెతికినా

ఒకవేళ క్యాన్సర్ అప్పటికే ఎముకలకు కూడా పాకీ ఉంటే టెస్టోస్టిరాన్ హార్మోన్ శరీరంలోంచి పూర్తిగా తీసివేయాలి. ఈ హార్మోన్ వృషణాల్లోనే కాకుండా, ఎడ్రినల్ గ్రంధిలో కూడా ఉత్పన్నమవుతుంది. శరీరంలోని కొవ్వులోంచి కూడా కొంత మేరకు ఈ టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తూ ఉంటుంది. వృషణాల్లోని టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను ఉత్పత్తి పదార్థాన్ని తీసివేయడాన్ని బైలేటరల్ సబ్ క్యాప్సూలా ఆర్కిడెక్టమీ అంటారు. కొందరికి వృషణాలను గానీ, చివరికి వాటిలోని టెస్టోస్టిరాన్ హార్మోన్లను ఉత్పత్తి చేసే పదార్థాన్ని గానీన తీసివేయడం ఇష్టం ఉండదు. అలాంటి వారికి ఎల్‌హెచ్‌ఆర్‌మెచ్ అనలాగ్స్ ఇంజక్షన్లు ఇవ్వడం ద్వారా శస్త్రచికిత్స లేకుండానే వృషణాల పనితనాన్ని పూర్తిగా నిలువరించే అవకాశాలు ఉంటాయి. ఆ తర్వాత శరీరంలోని ఇతర భాగాల్లో టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే వాటిని యాంటి ఆండ్రోజన్ల సహాయంతో నియంత్రిస్తాం. దీన్నే టోలట్ ఆండ్రోజన్ సహాయంతో నియంత్రిస్తాం. దీన్నే టోటల్ ఆండ్రోజన్ బ్లాకేజ్ అంటారు. ఇలా చేయడం వల్ల పీఎస్‌ఏ తగ్గిపోతుంది. అయితే కొంత కాలం తర్వాత కొందరిలో పీఎస్‌ఏ మళ్లీ పెరగడం మొదలవుతుంది. దానికి క్యాన్సర్ కణాలు కొత్త విధానాల్లో పెరగడం ప్రారంభించడమే కారణం. హార్మోన్ నియంత్రణ తర్వాత మళ్లీ పిఎస్ఏ పెరగడాన్ని, హార్మోన్ రిఫ్రాక్టరీ ప్రొస్టేట్ క్యాన్సర్ అంటారు. ఈ పరిణామం కొందరిలో ఆరునెలలకే మొదలు కావచ్చు. మరికొందరిలో రెండేళ్ల వరకు సమయం పట్టవచ్చు. ఈ స్థితిలో పీఎస్ఏ మళ్లీ పెరుగుతుంది. అప్పుడిక కీమోథెరప ఇవ్వాల్సి ఉంటుంది. దీనితో అంత ఫలితం కనిపించకపోతే అంతకన్నా శక్తివంతమైన కొన్ని ఆధనికమైన మందులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ థెరపీతో అంత ఫలితం కనిపించపోతే, అంతకన్నా శక్తివంతమైన కొన్ని ఆధునికమైన మందులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రొస్టేట్ క్యాన్సర్ ఎముకలకు పాకితే సహజంగానే, అవి బాగా బలహీనమవుతాయి. అప్పుడు ఎముకలను శక్తివంతం చేసే కొన్ని ఇంజక్షన్లు నెలకు ఒక్కటి చొప్పున ఇస్తాం. ఇంజక్షన్ల స్థానంలో ఇటీవల కొన్ని మాత్రలు కూడా వచ్చాయి. వీటితోపాటు నొప్పి తగ్గడానికి కొందరికి రేడియేషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఏమైనా ఆధునిక వైద్య విధానాలలో ప్రస్టేట్ క్యాన్సర్‌చికిత్సా కాలం నేడు బాగా తగ్గిపోయి, జీవిత కాలం గణనీయంగా పెరుగుతోంది.

డా. సి.హెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్
హైదరాబాద్
9848011421





కాలుష్యానికి ఇవీ కారణమే!

పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యానికి అనేక కారణాలు. వాటిలో పొగలు కక్కే వాహనాలు ప్రధానంగా చెబుతుంటారు. అందరూ అనుకుంటున్నట్టు కాలుష్యానికి ఈ వాహనాలే ప్రధాన కారణం కాదట. యూఎస్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఇదే మాట చెబుతున్నారు.

ఇన్నాళ్లూ నగరాల్లో పెరిగిపోతున్న కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడుతున్న పొగే ప్రధానకారణంగా చెప్పుకుంటున్నాం. కానీ తాజా అధ్యయనం మరో ప్రధానమైన కారణాన్ని కనిపెట్టింది. ఇంటి గోడలకు వేసే పెయింట్స్, రైతులు వాడుతున్న రసాయనిక ఎరువుల మందులతో పాటు ఇతర సంసంజనాలు కూడా పర్యావరణానికి పెను సవాలుగా మారుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. ఇక పరిశ్రమల నుంచి వెలువడే వాయు, ద్రవ రూప వ్యర్థాలు మరింత చేటు చేస్తున్నాయని నిర్ధారించారు. న్యూయార్క్‌లో వోలటైల్ ఆర్గానిక్ కంపౌండ్స్‌ను పరీక్షించిన శాస్త్రవేత్తలు, అవి గాలితో జరిపే చర్యల ద్వారా ఓజోన్‌ను సృష్టించడమే కాకుండా, ప్రత్యేకంగా ఒక నలుసులాంటి పదార్థాన్ని ఉత్పత్తి చేయడం ద్వారా పొగమంచు ఏర్పడడానికి సహకరిస్తాయి. ఈ రెండు ప్రక్రియలూ ఆరోగ్యానికి ప్రమాదకారులుగా మారి, శ్వాససంబంధిత ఇబ్బందులను సృష్టిస్తాయి. అయితే యూఎస్‌లోని కాలిఫోర్నియాలో చాలామంది ఈ వీఓసీలను ఇంటి గోడలకు వేసే డిజైనింగ్ రంగుల్లో వాడుతున్నట్టు గుర్తించారు పరిశోధకులు. అంతే కాదు సువాసనాభరితమైన పర్‌ఫ్యూమ్స్‌లోనూ వీటిని వినియోగిస్తున్నట్టు పరిశోధనలో తేలింది. పరిసర వాయువుతో పోల్చితే, ఇళ్లలో ఉండే గాలి ఏడు రెట్లు ఎక్కువ కలుషితమై ఉండడాన్ని గుర్తించారు శాస్త్రవేత్తలు. దీని ఆధారంగా కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే పొగ మాత్రమే ప్రధానకారణం కాదని తేల్చారు. ప్రజలు ఎక్కువ సమయం నివసించే నివాసాల్లోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతుండడం పట్ల పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిశోధన కేవలం కాలిఫోర్నియాకే కాదు, ప్రపంచంలోని ఇతర నగరాలకూ వర్తించేదిగా ఉంటుందన్నది పరిశోధకుల మాట.

సుడోకు

దైలీ సుడోకు 155 సమాధానం

1	8	4	2	5	9	3	7	6
9	3	6	8	1	7	4	2	5
5	7	2	4	6	3	8	9	1
6	9	3	1	2	4	5	8	7
8	1	7	3	9	5	6	4	2
2	4	5	6	7	8	9	1	3
4	5	8	7	3	2	1	6	9
7	6	9	5	4	1	2	3	8
3	2	1	9	8	6	7	5	4

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 156

2			6	1		3	7	8
			9			1		
		1		3	7			5
		5	1	4		2		3
9		2		8		4		
8	4			7				
					4	7	5	
	5			9		8	1	

ట్వీట్



ఒక తల్లికి తెలుసు.. పిల్లలకు ఏమివ్వాలో.. వారినెలా రక్షించుకోవాలో. పిల్లలకు క్రమశిక్షణ నేర్పించడంలో ఆమెను మించిన గురువు లేరు. అలాంటప్పుడు ఆమెకు సపోర్ట్‌గా నిలుద్దాం. అంతేతప్ప ఆమెను కించపరుచొద్దు. ఆల్ అవుట్ చేసే #StandByToughMomsకి నేను మద్దతు పలుకుతున్నా.

అక్షయ్‌కుమార్
@akshaykumar



అక్షయ్ కుమార్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
25,608,823

కామన్‌మ్యాన్ వాయిస్

నా ప్రేమకు షరతులు లేవు, కానీ.. ఇతరుల పట్ల నా నమ్మికకూ, గౌరవానికీ షరతులు వర్తిస్తాయి.
– Indravelli Ramesh

అన్నా.. అన్నా.. అవిశ్వ.. అన్నా..
తమ్మీ నువ్వేం చెప్పాలి అనుకున్నావో నాకర్థమైంది. తెలుగు చానెల్ చూస్తున్నావు.
అరగంటలో కేంద్రంలో ప్రభుత్వం పడిపోతుందేమో అనే కదా నీ భయం?
ఒకటి.. ప్రభుత్వం 2019 వరకు ఉంటుంది.. భయపడకు.
రెండు.. ఆ చానెల్ నువ్వూ.. నేనూ చూస్తాం కానీ మోడీ చూడరు. ఆయనకు తెలుగు రాదు కాబట్టి భయపడరు. కాబట్టి నీ పని నువ్వు చేసుకో..
– Murali Buddha

వైరల్ వీడియో



చిట్టిబాబు చెవులోకి మాట వెళ్లడం కష్టం కానీ.. ఒకసారి వెళ్లిందంటే ఆ మాట అక్కడే ఉండిపోతుందయ్యా అంటూ సాగే ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో అదురగొడుతున్నది.

Rangasthalam Theatrical Trailer | Ram Charan | Samantha | Aadhi | DSP | #RangasthalamTrailer

Total views : 3,309,822+

Published on Mar 18, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 20 మార్చి 2018

ఏ భాషా చిత్రసీమలోనైనా పారితోషికాల ప్రస్తావనంతా కథానాయకుల చుట్టే తిరుగుతుంది. అగ్ర హీరోలతో పోల్చితే కథానాయికలు అందుకునే పారితోషికం చాలా తక్కువగానే ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ ధోరణిలో గణనీయమైన మార్పు కనిపిస్తున్నది. ముఖ్యంగా బాలీవుడ్‌లో అగ్ర కథానాయికలు అక్కడి స్టార్ హీరోలతో సమానమైన రెమ్యునరేషన్‌ను అందుకుంటూ వార్తల్లో నిలుస్తున్నారు. గత కొన్నేళ్లుగా బాలీవుడ్‌లో కథానాయికా ప్రాధాన్యత వున్న చిత్రాల రూపకల్పన ఎక్కువైంది. నాయికల పాత్రల్ని శక్తివంతంగా ఆవిష్కరించే ట్రెండ్ ఊపందుకుంది. దీంతో అగ్ర నాయికలపై భారీ వ్యయం చేయడానికి నిర్మాతలు ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో వారి పారితోషికాలు ఆకాశాన్నంటుతున్నాయి.

నాయికా ప్రియం


ప్రియాంకచోప్రా

దీపికాపదుకునే -15కోట్లు

ప్రస్తుతం ఒక్కో సినిమాకు ఈ బెంగళూరు సుందరి తీసుకునే పారితోషికం అక్షరాల 15కోట్లు. 2007లో 'ఓం శాంతి ఓం' చిత్రంతో బాలీవుడ్‌లో తెరంగేట్రం చేసిన ఈ దక్షిణాది సొగసరి దశాబ్దకాలంలోనే తారాపథంలో అగ్రస్థానానికి చేరుకుంది. 'లవ్ ఆజ్ కల్' 'కాక్‌టెయిల్' 'యే జవానీ హై దీవానీ' 'చెన్నై ఎక్స్‌ప్రెస్' 'రామ్ లీలా' 'పికూ''బాజీరావు మస్తాని'...తాజాగా 'పద్మావత్' చిత్రాలు దీపికాపదుకునే ప్రస్థానానికి బాటలు వేశాయి. ఇప్పటివరకు 23 చిత్రాల్లో నటించి వాటిలో అత్యధిక విజయాల్ని దక్కించుకుంది. ఆమె టైటిల్ పాత్రలో నటించిన 'పద్మావత్' దాదాపు 500కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. అసమాన త్యాగశీలి అయిన మహారాణి పద్మావతి పాత్రలో ఆమె అభినయానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ఫిదా అయ్యారు. 'పద్మావత్' అఖండ విజయంతో దీపికాపదుకునే తన పారితోషికాన్ని అనూహ్యంగా పెంచిందని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలంటున్నాయి. ప్రస్తుతం ఆమె ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో 'జీరో' అనే చిత్రంలో నటిస్తున్నది.

కంగనారనౌత్ -14కోట్లు

కెరీర్ ఆరంభంలో ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొంది ఈ హిమాచల్ సుందరి. గ్యాంగ్‌స్టర్ (2006) చిత్రంతో పరిశ్రమకు పరిచయమైంది కంగనారనౌత్. 'ఓ లమ్హే' 'లైఫ్ ఇన్ మెట్రో' 'ఫ్యాషన్' 'రాజ్' 'వన్స్ అప్ ఆన్ఎ టైమ్ ఇన్ ముంబయి''క్రిష్-3' 'తను వెడ్స్ మను' 'క్వీన్' 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రాలు ఆమెకు స్టార్‌డమ్‌ను తీసుకొచ్చాయి. ఫ్యాషన్, క్వీన్, తను వెడ్స్ మను చిత్రాలకుగాను మూడు సార్లు జాతీయ అవార్డుల్ని అందుకుని సంచలనం సృష్టించింది. గత రెండేళ్లుగా సరైన విజయాలు అందుకోలేకపోయినా నటిగా ఆమె ప్రతిభాసామర్థ్యాలపై వున్న భరోసాతో దర్శకనిర్మాతలు భారీ పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నారు. ముఖ్యంగా లేడీ ఓరియెంటెడ్ సినిమాల కోసం ఆమె బెస్ట్ ఛాయిస్ అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం కంగనారనౌత్ 'మణికర్ణిక' చిత్రంలో నటిస్తున్నది. ఝాన్సీలక్ష్మీబాయి జీవిత కథ ఆధారంగా చారిత్రక కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు.


దీపికాపదుకునే

ప్రియాంక చోప్రా-12కోట్లు

దాదాపు పదహారేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో విజయంతమైన చిత్రాల్ని ఖాతాలో వేసుకుంది ప్రియాంకచోప్రా. ప్రస్తుతం ఆమెను 'గ్లోబల్‌స్టార్'గా అభివర్ణిస్తున్నారు. అమెరికా టీవీ సీరిస్ క్వాంటికోతో ప్రపంపవ్యాప్తంగా గుర్తింపును సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు హాలీవుడ్ సినిమాలకే పరిమితమైపోయింది. అక్కడ 'ఇజ్ ఇన్ట్ ఇట్ రొమాంటిక్' 'ఏ కిడ్ లైక్ జేక్' చిత్రాల్లో నటిస్తున్నది. దాదాపు రెండేళ్లుగా బాలీవుడ్‌కు దూరంగా వుంటున్నా ఆమెకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. పాత్రల పరంగా ఎలాంటి సవాళ్లకు వెనుకాడని నైజం కావడంతో ప్రియాంకకు చక్కటి డిమాండ్ వుందంటున్నారు. హాలీవుడ్‌లో నటిస్తూనే మరో వైపు నిర్మాణరంగంలోకి అడుగుపెట్టింది. మరాఠీ, సిక్కిం, పంజాబీ భాషల్లో చిత్ర నిర్మాణాల్ని చేపడుతున్నది. హాలీవుడ్ చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడంతో బాలీవుడ్‌లో ఆమె ఇమేజ్ చెక్కుచెదరలేదని ట్రేడ్ వర్గాలు అంచనావేస్తున్నాయి. త్వరలో సంజయ్‌లీలాభన్సాలీ దర్శకత్వంలో ప్రియాంకచోప్రా ఓ భారీ బడ్జెట్ చిత్రంలో నటించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.


అనుష్కశర్మ

కరీనాకపూర్ -10కోట్లు

బాలీవుడ్‌లో కరీనాకపూర్‌ది 18ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం. కమర్షియల్ చిత్రాలతో పాటు ఎన్నో ప్రయోగాత్మక పాత్రలతో విలక్షణ నాయికగా పేరు తెచ్చుకుంది. తల్లి అయిన తర్వాత సెలెక్టివ్‌గా సినిమాల్ని చేస్తున్నది. గత రెండేళ్లలో భజరంగీ భాయిజాన్, ఉడ్తాపంజాబ్ చిత్రాల్లో సత్తా చాటింది. ప్రస్తుతం 'వీర్ ది వెడ్డింగ్' అనే చిత్రంలో నటిస్తున్నది. కథానాయిక పాత్రలకు దూరంగా వుంటున్నప్పటికీ.. సీనియర్ నాయిక కావడం, గతంలో పలు విజయవంతమైన హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటించిన అనుభవం వుండటంతో కరీనాకపూర్ డిమాండ్ కొనసాగుతుందంటున్నారు.


కంగనారనౌత్

అనుష్కశర్మ-8కోట్లు

సమకాలీన బాలీవుడ్ పరిశ్రమలో చక్కటి ప్రతిభావంతురాలై నటిగా అనుష్కశర్మకు పేరుంది. 'రబ్‌నే బనాదీ జోడీ' (2008) చిత్రంతో బాలీవుడ్ అరంగేట్రం చేసిన ఈ సుందరి అనతికాలంలోనే అగ్ర నాయికగా ఎదిగింది. 'బ్యాండ్ బాజా బారత్' 'జబ్ తక్ హై జాన్' 'పీకే' 'ఎన్.హెచ్.10' 'సుల్తాన్' 'ఏ దిల్‌హై ముష్కిల్' 'జబ్ హ్యారీ మెట్ సెజల్' 'పరి' చిత్రాల్లో అద్భుతాభినయంతో ఆకట్టుకుంది. నిర్మాతగా మారి ప్రయోగాత్మక ఇతివృత్తాల్ని తెరకెక్కిస్తూ అభిరుచిని చాటుకుంటున్నది. ఏ పాత్రనైనా ఇట్టే ఆకళింపు చేసుకొని దానికి పరిపూర్ణంగా న్యాయం చేయడం అనుష్కశర్మ బలమని చెబుతారు. ప్రస్తుతం ఆమె 'సంజు' 'సుయి ధాగా' 'జీరో' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.

అలియాభట్, కత్రినాకైఫ్-7కోట్లు

25ఏళ్లు నిండకుండానే అలియాభట్ బాలీవుడ్‌లో తిరుగులేని పాపులారిటీని సంపాదించుకుంది. రొమాంటిక్ పాత్రలు మొదలుకొని, రియలిస్టిక్ పాత్రల్ని సైతం తన అభినయంతో రక్తికట్టించడం అలియాభట్ శైలి. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' 'హైవే' 'ఉడ్తా పంజాబ్' 'డియర్ జిందగీ' చిత్రాలు ఆమె ప్రతిభకు అద్దం పట్టాయి. యువతలో ఈ సుందరి మంచి ఫాలోయింగ్ వుంది. ప్రస్తుతం ఆమె సినిమాకు 7కోట్లు వసూలు చేస్తున్నది.

ఇక కత్రినాకైఫ్, శ్రద్ధాకపూర్, సోనాక్షిసిన్హాలు సినిమాకు దాదాపు 5కోట్లు వసూలు చేస్తున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ అగ్ర నాయికలు వసూలు చేస్తున్న పారితోషికాలు కొందరు దక్షిణాది అగ్ర హీరోల రెమ్యునరేషన్‌ను మించి వుండటం విశేషం. ప్రపంచ సినిమాలను ఆకళింపు చేసుకుంటూ బాలీవుడ్‌లో కథానాయిక ప్రాధాన్యత వున్న చిత్రాల నిర్మాణం ఎక్కువవుతున్నది. ముఖ్యంగా ప్రధాన స్రవంతి చిత్రాల్లో కూడా కథానాయిక పాత్రను బలంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ మార్పు వల్ల బాలీవుడ్‌లో హీరోలతో సమానంగా కథానాయికలు స్టార్‌డమ్‌ను సొంతం చేసుకుంటున్నారు. తమ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సదరు నాయికలు భారీ పారితోషికాల్ని డిమాండ్ చేస్తున్నారు.


నితిన్, మేఘా ఆకాష్

మూడు రుతువుల ప్రణయం

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. శ్రేష్ఠ్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకాలపై ఎన్. సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకుడు. ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానున్నది. ఈ చిత్ర గీతాల పూర్తి ఆల్బమ్‌ను ఇటీవలే చిత్రబృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో కూడిన వినోదభరిత చిత్రమిది. వర్షాకాలంలో కలుసుకొని, శీతాకాలంలో ప్రేమించుకొని వేసవి కాలంలో విడిపోయిన ఓ జంట కథ ఇది. రుతువులకు, ఆ జంట ప్రేమకథకు ఉన్న సంబంధమేమిటన్నది ఆకట్టుకుంటుంది. తమన్ అద్భుతమైన బాణీలనిచ్చారు. ప్రతి పాట చక్కటి సాహిత్యపు విలువలతో వీనులవిందుగా ఉంటుంది. ఇటీవల విడుదలైన మూడు పాటలకు చక్కటి స్పందన లభిస్తున్నది. ఇందులో నితిన్ పాత్ర చిత్రణ కొత్త పంథాలో వుంటుంది. చక్కటి వినోదాన్ని మేళవించి దర్శకుడు కృష్ణచైతన్య ఈ చిత్రాన్ని ఓ అందమైన దృశ్యకావ్యంగా మలిచాడు. ఈ సినిమాకు మావనీయ విలువలతో త్రివిక్రమ్ గొప్ప కథను అందించాడు. అమెరికా, ఊటీ, హైదరాబాద్‌లోని అందమైన ప్రదేశాల్లో సినిమాను చిత్రీకరించాం' అని తెలిపారు. నరేష్, లిజి, రోహిణి, రావురమేష్, సంజయ్‌స్వరూప్, ప్రభాస్ శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, కెమెరా: నటరాజ సుబ్రమణియన్, సమర్పణ: నిఖితారెడ్డి.

రంగమ్మత్త సోయగం


'రంగస్థలం' చిత్రంలో అనసూయ

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. సమంత కథానాయిక. ఎనభై దశకం నాటి నేపథ్యంలో పూర్తి గ్రామీణ ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో సినిమాలోని పాత్రల్ని పరిచయం చేస్తూ ప్రదర్శించిన వీడియో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమాలో అనసూయ భరద్వాజ్ రంగమ్మత్తగా కీలక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. కథానుగుణంగా రంగమ్మత్త పాత్రకు చాలా ప్రాధాన్యత వుంటుందని దర్శకుడు సుకుమార్ తెలిపారు. తాజాగా పల్లెటూరి యువతి రంగమ్మత్తగా తన లుక్‌ను అనసూయ ట్విట్టర్ ద్వారా విడుదల చేసింది. 'రంగమ్మత్తను పరిచయం చేస్తున్నాను' అంటూ ఫొటోను పోస్ట్ చేసింది. అచ్చమైన పల్లెటూరు కట్టుబొట్టుతో అమాయకత్వం మూర్తీభవించిన గ్రామీణ మహిళగా అనసూయ లుక్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పల్లెటూరి యువతి పాత్రకు అనసూయ చక్కగా కుదిరిందని అందరూ ప్రశంసిస్తున్నారు.

ఎడిటర్ అనిల్ మల్నాడ్ కన్నుమూత

ప్రముఖ సినీ ఎడిటర్ అనిల్ మల్నాడ్(60) సోమవారం చెన్నైలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఉదయం తుదిశ్వాసవిడిచారు. తెలుగుతో పాటు తొమ్మిది భాషల్లో కలిపి 200పైగా సినిమాలకు ఎడిటర్‌గా పనిచేశారు. 1984లో వంశీ దర్శకత్వంలో వచ్చిన 'సితార' సినిమాకు గాను ఉత్తమ ఎడిటర్‌గా జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. మనవూరి పాండవులు, వంశవృక్షం, రాధకళ్యాణం, మంచు పల్లకి, ఆలాపన, అన్వేషణ, ప్రేమించు పెళ్లాడు, లాయర్ సుహాసిని, సంకీర్తన, మహర్షి, చెట్టుకింద ప్లీడరు, కోకిల, ఆర్తనాదం, ప్రేమశిఖరం, రిక్షారుద్రయ్య, షోతో పాటు తెలుగులో రూపొందిన పలు సినిమాలు ఆయనకు మంచి పేరును తెచ్చిపెట్టాయి. మంగళవారం ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆందోళనకు స్పందించని కేంద్రం

- రిజర్వేషన్లపై పోరాటం ఆగదు
- పార్లమెంట్ ద్వారం వద్ద టీఆర్ఎస్ ఎంపీల నిరసన



సోమవారం ఢిల్లీలో పార్లమెంట్ ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్ ఎంపీలు వినోద్, నగేశ్, సీతారాంనాయక్, బూర నర్సయ్య, జితేందర్‌రెడ్డి, బీబీ పాటిల్, విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విభజన హామీలు, రిజర్వేషన్ల అంశంపై ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం స్పందించడం లేదని టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్ రెడ్డి, వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేంద్రఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లు కోరడం లేదని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించుకునే హక్కును కోరుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే తప్పు అన్నట్లుగా రాజీనామా చేసిన మంత్రులు మాట్లాడటం సరికాదన్నారు. సోమవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన చేశారు. అక్కడకు వచ్చిన కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్‌తో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై స్పందించడం లేదని, దీనిపై స్పష్టత ఇచ్చేవరకు ఆందోళన కొనసాగుతుందని చెప్పారు.

ఎన్నారై నిధుల ఖర్చుపై త్వరలో విధివిధానాలు

- అసెంబ్లీ జీరో అవర్‌లో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రవాస తెలంగాణ వాసుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో పెట్టిన రూ. 100 కోట్ల నిధుల ఖర్చు కు సంబంధించిన విధి విధానాలను త్వరలోనే రూపొందించనున్నట్టు పరిశ్రమలు, ఎన్నారై వ్యవహారాలశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. సోమవారం అసెంబ్లీ జీరోఅవర్‌లో ఈ అంశాన్ని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ లేవనెత్తారు. బడ్జెట్‌లో ఎన్నారైలకు కేటాయింపులపై స్పష్టతనివ్వాలని కోరారు. ఇందుకు మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. ఎన్నారైలు, ముఖ్యంగా గల్ఫ్‌లో ఉండే తెలంగాణ వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఇందుకోసం సీఎం కేసీఆర్ చొరవతోనే బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. జీరో అవర్‌లో మరికొందరు సభ్యులు పలు అంశాలను సభ దృష్టికి తెచ్చారు. ఈ నెల 17న నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మం డలం, పెండ్లిపాకల గుడితండాలో చెరువులో మునిగి చనిపోయిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రవీందర్‌కుమార్ కోరారు. బ్రాహ్మణ పరిషత్‌కు కేటాయించిన నిధులనుంచి అర్హులకు తక్షణం డబ్బు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల నిరంతర కరంట్‌తో బోర్లు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని, కేవలం 12గంటలు మాత్రమే కరంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కందులు, శెనగల కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ విజ్ఞప్తిచేశారు. వైరాలో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే మదన్‌లాల్ కోరారు. ఖైరతాబాద్ పరిధిలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. అన్ని అంశాలను సంబంధిత శాఖల మంత్రులు నోట్ చేసుకుని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



అసెంబ్లీ ఆవాజ్



1.42 కోట్ల ఎకరాలకు సాగునీరు



సోమవారం శాసనమండలిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

రైతుల కోసం అనేక పథకాలు ■ వేగంగా సాగుతున్న ఎత్తిపోతల పనులు
మండలిలో బడ్జెట్‌పై చర్చలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతుల కండ్లలో ఆనందం వెల్లివిరిసేలా చేసేందుకు ప్రభుత్వం తపన పడుతున్నదని, ఆ మేరకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలిలో ప్రతిపక్ష బీజేపీ సభ్యుడు రాంచంద్రరావు బడ్జెట్ కేటాయింపులపై అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలో కోటి 42 లక్షల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని, 72 లక్షల మంది రైతులు రెండు పంటలు వేసుకొనే వెసులుబాటున్నవారుగా ప్రభుత్వ యంత్రాంగం గుర్తించిందని, వారికి పెట్టుబడి సమస్యను తీర్చేందుకు ముఖ్యమంత్రి సొంత ఆలోచనతో రెండు పంటలకు కలిపి రూ. 8 వేలు అందిస్తున్నారని తెలిపారు. వానకాలం, యాసంగి పంటలు పండించుకొనే వారందరికీ ఇందులో అవకాశం కల్పించారని అన్నారు. ఇందుకు గానూ సుమారుగా రూ.12 వేల కోట్లు అవసరమని అంచనా వేశారని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత నాణ్యమైన కరంటు అందిస్తున్న ఘనత కేసీఆర్‌దేనని అన్నారు.

ప్రాజెక్టుల పనులు వేగవంతం

రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులు మూడు షిఫ్టుల్లో జరుగుతున్నాయని, రోజుకు 2 లక్షల బస్తాల సిమెంట్ వినియోగమవుతున్నదని ఆయన వివరించారు. ఉగాది రోజు నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మొదటి గేట్‌ను దగ్గరుండి ఏర్పాటుచేశారని తెలిపారు. వచ్చే జూలై, ఆగస్టు నెలలో గోదావరి నీటిని లిఫ్టు ద్వారా ఎల్లంపల్లి, అక్కడి నుంచి ఎల్‌ఎండీ ఇలా ప్రతీ రిజర్వాయర్‌ను నీటితో నింపే పనులు చేపడుతామని చెప్పారు. దేవాదుల ద్వారా పాత వరంగల్ జిల్లాలోని చెర్వులను ఈ ఎండాకాలంలో నింపుతున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది ఆరున్నర లక్షల ఎకరాలు సాగవటం రికార్డని పేర్కొన్నారు.

ఏప్రిల్ 20 నుంచి పంట చెక్కుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి...

పంపిణీ క్రమంలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని కోణాలలో ఆలోచించామని మంత్రి తెలిపారు.

పట్టాదారులకే చెక్కుల పంపిణీ

1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించి పట్టాదారులకు మాత్రమే చెక్కుల రూపంలో పెట్టుబడి సాయం చెల్లిస్తామని, కౌలుదారుల పేరిట చెక్కుల పంపిణీ ఉండబోదని మంత్రి పోచారం వివరణ ఇచ్చారు. హార్టికల్చర్ కోసం కూడా ఎకరానికి రూ.4,000 పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. ఏ పంటలు వేయాలనే నిర్ణయాలు ఇకనుంచి స్థానికంగా ఏఈవోల ఆధ్వర్యంలో రైతులే తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పుడు రైతులకు పంటలపై స్పష్టత వస్తున్నదని అన్నారు. విత్తనాలు, ఎరువులను కూడా రైతులకు అందించే కార్యక్రమానికి ప్రభుత్వమే శ్రీకారం చుడుతుందని చెప్పారు. రైతు పెట్టుబడి సాయంతోపాటు వ్యవసాయ పనిముట్లను కూడా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, మండలి సభ్యులు టీ భానుప్రసాదరావు, వీ భూపాల్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

దేవెగౌడ, రాజ్‌నాథ్ ప్రశంసించారు

వ్యవసాయరంగానికి ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నూతనంగా ప్రవేశపెడుతున్న పంట పెట్టుబడి పథకంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు సోమవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అన్నారు. రైతును రాజును చేయాలని సీఎం కేసీఆర్ ప్రతినబూనారని చెప్పారు. మాజీ ప్రధాని దేవెగౌడ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు పంట పెట్టుబడి పథకాన్ని ప్రశంసించారని తెలిపారు. అలాగే వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఇప్పటికే దీనిపై అధ్యయనం చేసేందుకు మన రాష్ట్రానికి క్యూ కడుతున్నారని గుర్తుచేశారు.

సుస్థిరంగా అడుగులు – లక్ష్య సాధనపై భరోసా

ప్రజారంజక పాలన దిశగా సుస్థిరంగా అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్సీ భానుప్రసాదరావు అన్నారు. బీజేపీ సభ్యుడు రామచంద్రరావు బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లేవనెత్తిన పలు అంశాలకు భానుప్రసాద్ స్పందించారు. ఎక్కువ లక్ష్యం విధించుకుని తక్కువ సాధించడం కన్నా తక్కువ లక్ష్యంతో ఎక్కువ సాధించడం మంచిదన్నారు. రాష్ట్రప్రభుత్వం అనుకున్న లక్ష్యంకంటే ఎక్కువ మార్కులు సంపాదించుకున్నదని చెప్పారు.

పనిచేసే సీఎం కేసీఆర్

- ఎమ్మెల్సీ రాములు నాయక్

సీఎం కేసీఆర్ మాటలు చెప్పి తప్పించుకునే వ్యక్తి కాదని, పనిచేసి చూపి ప్రజలందరి మన్ననలను పొందుతున్నారని ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రైతన్న బాగుండాలని సీఎం తీసుకుంటున్న చర్యలు వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నాయని చెప్పారు. ఆత్మహత్యలనేవి తగ్గిపోవాలని సీఎం ఆకాంక్షిస్తున్నారన్నారు. 'గతంలో కరంటు కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేశాం. ఇపుడు వాటిని అధిగమించి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందుతున్నది' అన్నారు.

కాళేశ్వరం పనులు భేష్

- బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు

రాష్ట్రంలో చేపడుతున్న ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులు చాలా బాగున్నాయని, ప్రధానంగా కాళేశ్వరం పనులు జరుగుతున్న తీరు అద్భుతంగా ఉన్నదని బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు కొనియాడారు. మండలిలో బడ్జెట్‌పై చర్చలో పాల్గొంటూ, ఇరిగేషన్‌రంగంలో ప్రభుత్వం చొరవతీసుకుని ముందుకు సాగడం అభినందనీయమన్నారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించామని చెప్పారు. అలాగే అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు కూడా అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు.

28లోగా రైతుఖాతాల వివరాలు పంపాలి

- అధికారులకు సీఎస్ ఎస్కే జోషి ఆదేశం



రైతులకు వ్యవసాయ పెట్టుబడి సహాయంపై సచివాలయంలో రెవెన్యూ, ఆర్థిక, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ పెట్టుబడి పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు లాంఛనంగా ప్రారంభిస్తారని, దీనికి అనుగుణంగా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉన్నతాధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పెట్టుబడి సహాయం అందాలన్నారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ, ఆర్థిక, వ్యవసాయ, ఎన్ఐసీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 15నాటికే మండలాలు, గ్రామాలవారీగా చెక్కులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ చెక్కులను రూపొందించడానికి ఆధునీకరించిన భూముల వివరాలను రైతుల ఖాతాలవారీగా ఈనెల 28వ తేదీలోగా వ్యవసాయశాఖకు అందజేయాలని రెవెన్యూఅధికారులను ఆదేశించారు. గ్రామాలకు సంబంధించిన మొత్తం విస్తీర్ణం, సర్వే నంబరు, ఖాతాల వివరాలు, రైతుల వివరాలు తహసీల్దార్లతో సర్టిఫై చేయించి సమర్పించాలన్నారు. రెవెన్యూశాఖ నుంచి భూముల వివరాలు అందగానే వ్యవసాయ శాఖచెక్కుల ముద్రణకు ఏర్పాట్లపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బ్యాంకులద్వారా గ్రామాలవారీగా చెక్కుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ మేరకు ఎస్‌ఎల్‌బీసీ సమావేశం నిర్వహించి బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సంబంధిత వీఆర్వోలను బాధ్యులుగా ఉంచాలని చెప్పారు. భూ రికార్డుల వివరాలను కలెక్టర్లు ర్యాండమ్‌గా తనిఖీ చేయాలని సీఎస్ సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాట్లు

చెక్కుల పంపిణీ సమయంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సీఎస్ నొక్కిచెప్పారు. వ్యవసాయ పెట్టుబడి చెక్కుల భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలవారీగా భూవివరాలకు సంబంధించి వీఆర్వోలకు 'ఈ సైన్ ఫెసిలిటీ' ఓటీపీ విధానం ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. అన్ని మండలాలకు బ్యాంకులవారీగా చెక్కుల ముద్రణపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించుకోవాలని చెప్పారు. డాటా ట్యాంపరింగ్ కాకుండా, చెక్కులపంపిణీ సందర్భంగా గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజువారీగా చెక్కుల పంపిణీ వివరాలను వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి తెలియజేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, సీసీఎల్‌ఏ డైరెక్టర్ వాకాటి కరుణ, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

కేటాయించిన మంత్రులందరూ సభలో ఉండాలి: స్వామి గౌడ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మండలికి కేటాయించిన మంత్రులంతా కార్యకలాపాలు ముగిసేవరకు సభలోనే ఉండాలని చైర్మన్ స్వామిగౌడ్ ఆదేశించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వెళ్లకుండా సభ ముగిసేవరకు మంత్రులు ఉండాలని పేర్కొన్నారు. అలాగే సభలో సభ్యులు అధికసంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 'సభ పేలవంగా ఉండకూడదు. నిండుగా ఉండాలి. ఈ విషయంలో మండలి చీఫ్ విప్, విప్‌లు జాగ్రత్తలు తీసుకొని సభ్యులంతా హాజరయ్యే విధంగా చూడాలన్నారు.

సింగరేణి, ఆర్టీసీ దవాఖానల్లో కేసీఆర్ కిట్లు అమలుచేయాలి

- ఎమ్మెల్యే జలగం వెంకటరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణి, ఆర్టీసీ దవాఖానల్లోనూ కేసీఆర్ కిట్లు పథకం అమలు చేయాలని ఎమ్మెల్యే జలగం వెంకటరావు కోరారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కిట్ పథకం వల్ల ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయని, ఇదొక అద్భుత పథకమని పేర్కొన్నారు. సింగరేణి, ఆర్టీసీ సంస్థల ఉద్యోగులు, కార్మికులు కూడా తెలంగాణ బిడ్డలే కాబట్టి ఆ సంస్థల దవాఖానల్లో ఈ పథకం అమలు చేయాలని సూచించారు.

స్వశక్తితో రాష్ట్రం పురోభివృద్ధి

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రం స్వయంశక్తితో నాలుగేండ్లలో ఎంతో అభివృద్ధిని సాధించిందని చెప్పారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొంటూ, బడ్జెట్‌లో అన్నివర్గాలకు ప్రాధాన్యమిచ్చారని సంతోషం వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేస్తున్నారని, ఆసరా పింఛన్లు, వితంతు పింఛన్లు ఇస్తున్నారని సర్కారుపై ప్రశంసలు కురిపించారు. ఆడబిడ్డల పెండ్లిళ్ల కోసం ఇచ్చేసాయాన్ని రూ.1,00,116కు పెంచుతున్నట్టు సభలో అంతకుముందే ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు అక్బరుద్దీన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కేంద్రం ఇచ్చింది ఏమిటి?

కేంద్రం అనుసరిస్తున్న వైఖరి వల్లే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం అప్పులుచేయాల్సి వస్తున్నదని అక్బరుద్దీన్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఇవ్వాల్సిన గ్రాంట్లు, పన్నులు సక్రమంగా ఇవ్వకుండా తెలంగాణపై మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 2016–17లో రాష్ట్రానికి రూ.14,557 కోట్లకుగాను కేవలం రూ.9.752 కోట్లు మాత్రమే వచ్చాయని, 2017–18లో రూ.26,867 కోట్లకుగాను జనవరి 2018 నాటికి కేవలం రూ.6,860 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చూపెట్టినదానికి, ఇచ్చేదానికి పొంతన ఉండటం లేదని దుయ్యబట్టారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి రూ. 48,251 కోట్లు పన్నులు, గ్రాంట్ల రూపంలో ఇస్తామని కేంద్ర బడ్జెట్‌లో సూచించారని, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ రాష్ట్ర బడ్జెట్‌లో ఆ విషయమే వెల్లడించారని చెప్పారు. కానీ నిజంగా కేంద్రం ఎంత ఇస్తున్నదో చెప్పలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

జాతీయ ప్రాజెక్టుగా గుర్తించరేం?

కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరితే ఇప్పటివరకు ఏమీ తేల్చలేదని అక్బరుద్దీన్ అన్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుకు రూ.19 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫారసు చేస్తే కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఇస్తామన్నారని, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేస్తే ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదని తప్పుబట్టారు. రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపించిందని విమర్శించారు. స్వయంగా సీఎం కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి సహకారం అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని, ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీని కలిసి విన్నవిస్తే అది చెవిటివాడి ముందుకు శంఖం ఊదినట్టే అయిందన్నారు. కనీసం సానుకూల స్పందన రాలేదని తెలిపారు. కేంద్రం నుంచి సహకారం లేకున్నా, ఎన్ని వ్యతిరేక అంశాలున్నా రాష్ట్రం స్వయంశక్తితో నాలుగేండ్లలో ఎంతో అభివృద్ధిని సాధించిందని, నోట్ల రద్దు, జీఎస్టీ లేకపోతే అభివృద్ధి ఇంకా గొప్పగా ఉండేదని చెప్పారు. ప్రజలపై ఎలాంటి పన్నుల భారం వేయకుండా రెవెన్యూ మిగులుతో ఇంతపెద్ద బడ్జెట్ పెట్టడం ఖచ్చితంగా అభినందించదగిన విషయమేనని అన్నారు. మూలధన వ్యయాన్ని 19 శాతం పెట్టి జీఎస్టీని తీసుకువచ్చి, నోట్లరద్దు చేసిన తరువాత కూడా రెండంకెల అభివృద్ధి సాధించడం తెలంగాణకే సాధ్యమైందని ప్రశంసించారు. నూతన రాష్ట్రమైన తెలంగాణ అత్యధిక వృద్ధిని నమోదు చేసిందని చెప్పారు.

బ్రాహ్మణ పరిషత్‌కు రూ.వంద కోట్లపై హర్షం

బ్రాహ్మణ పరిషత్‌కు రూ.100 కోట్లు ఇవ్వడం సంతోషకరమని అక్బరుద్దీన్ అన్నారు. చాలామంది బ్రాహ్మణులకు ఈ విషయాలు తెలియవని, అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. మైనార్టీలకు నిధులు బాగా కేటాయిస్తున్నారని, కేటాయించే నిధులన్నీ ఖర్చుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తరువాత అతి పెద్ద బడ్జెట్ మనదేనన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అభివృద్ధిలో సమానంగా ప్రాధాన్యమివ్వాలని అన్నారు. ఆరోగ్యశ్రీ దవాఖానలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా వైద్యసేవలు అందించాలని కోరారు.

దేశానికి ఆదర్శం.. దిక్సూచి: వేముల వీరేశం

వ్యవసాయానికి వివిధరూపాలలో 50 శాతానికిపైగా బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు దేశానికి ఆదర్శంగా, దిక్సూచిగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో బడ్జెట్‌ను సామాన్యుల కోణం నుంచి ప్రవేశ పెట్టారని, పాలనకూడా సామాన్యుల కోసమే సాగుతున్నదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చెప్పిన ప్రతి విషయాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో పరిపాలన అవినీతిరహితంగా జరుగుతున్నదని చెప్పారు. వందల మంది అమరుల సుందర స్వప్నం తెలంగాణ రాష్ట్రమని, బడ్జెట్ రూపశిల్పి సీఎం కేసీఆర్, సభలో ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ కఠోరదీక్ష ఫలితమే రూ.1.74లక్షల కోట్ల బడ్జెట్ అని వీరేశం అన్నారు. రైతుల కోసం, బడుగుల కోసం, పేదల కోసం భారీస్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అని, ఇప్పటివరకు తెలంగాణకు ఏమి చేయలేకపోయిన విషయాన్ని నిలదీస్తారని కాంగ్రెస్ నేతలు సభనుంచి పారిపోయారని తెలిపారు. ఇప్పటివరకున్న ఇజాలన్నీ పోయి తెలంగాణలో రైతుయిజం వచ్చిందని పేర్కొన్నారు.

ప్రశ్నోత్తరాల సమయం

అవసరం మేరకు కొత్త మండలాల్లో గోదాంలు

- మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మండలాల్లో అవసరాన్ని బట్టి గోదాంలను నిర్మిస్తామని మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, చల్లా ధర్మారెడ్డి, బానోత్ మదన్‌లాల్ అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్‌రావు సమాధానమిచ్చారు. కొత్త, పాత మండలాలు కలుపుకుని మొత్తం 164 మండలాల్లో గోదాంలు లేవని గుర్తించినట్టు తెలిపారు. నూతన గోదాంల నిర్మాణానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని నాబార్డును కోరామని, నివేదిక వచ్చిన తర్వాత గోదాంలు నిర్మిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 18.30 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న 364 గోదాంలను నిర్మించినట్టు తెలిపారు. గోదాంల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడంతో ప్రభుత్వానికి రూ.150కోట్లు మిగులు ఆదాయం లభించినట్టు తెలిపారు.

ప్రభుత్వ దవాఖానల్లో 50 శాతానికి చేరిన ప్రసవాలు

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి



కేసీఆర్ కిట్ అమలు, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంతోప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు 31 శాతం నుంచి 50 శాతానికి చేరుకున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా కేసీర్ కిట్ పథకంపై ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, అజ్మీరా రేఖ, బొడిగె శోభ, జలగం వెంకట్రావు, కిషన్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. గర్భిణికి ప్రసవం వరకు వివిధ దశల్లో కేసీఆర్ కిట్ పథకంకింద వైద్యసహాయం అందుతున్నదని చెప్పారు. శిశుమరణాల రేటు కూడా గణనీయంగా తగ్గిందన్నారు. ప్రతి గ్రామంలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాల ఏర్పాటుపై ఎమ్మెల్యేలు అజ్మీరా రేఖ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నుంచి నాలుగు నెలలపాటు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. చార్మినార్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాలలో, యునాని డిస్పెన్సరీల్లో ఉద్యోగుల ఖాళీలపై దృష్టి పెట్టామని ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ అడిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నీరా పరిశ్రమ ఏర్పాటుకు చర్య

- ఆబ్కారీశాఖ మంత్రి పద్మారావు



ఇతర రాష్ట్రాలతోపాటు మహారాష్ట్రలో నీరా పరిశ్రమ తీరుతెన్నులను పరిశీలించేందుకు వేసిన కమిటీ నివేదికలు అందిన తరువాత మన రాష్ట్రంలో ఆ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆబ్కారీశాఖ మంత్రి పద్మారావు తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో నీరా పరిశ్రమపై ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. తాటిచెట్టుపై నుంచి పడి మరణించిన గీత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నట్టు బీజేపీ ఎమ్మెల్యే లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా రూ.9 కోట్లు ఎక్స్‌గ్రేషియా కింద పంపిణీ చేసినట్టు తెలిపారు.

భాషాపండితులకు న్యాయం చేస్తాం

- త్వరలోనే సర్వీసు రూల్స్ రూపొందిస్తాం.. ఆ దిశగా సర్కారు కృషి
- సర్వీస్‌రూల్స్ కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఏజీతో సమావేశం
- శాసనమండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషాపండితులు, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పేర్కొన్నారు. వీటిలో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరలో పరిష్కరించి భాషా పండితులకు, పీఈటీలకు న్యాయం చేస్తామన్నారు. సోమవారం శాసనమండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ లేవనెత్తిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం కడియం సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 2,487 మంది భాషా పండితులకు, 1,047 మంది పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా హోదా పెంచడంపై ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. కోర్టుల్లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు త్వరలోనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను సాధించడంపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సుపాసులు

దివ్యాంగులకు బస్సుపాసులను ఉచితంగా అందజేస్తున్నామని రవాణాశాఖ మంత్రి పీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్డినరీ బస్సులతో పాటు జిల్లా సర్వీసులు, ఎక్స్‌ప్రెస్‌లలో కూడా దివ్యాంగులకు ఉచిత పాసులను అందించే అంశాన్ని పరిశీలిస్తామని సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపు

పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచేందుకు కృషిచేస్తామన్నారు. ఇప్పటికే శాశ్వత ఉద్యోగులకు పీఆర్సీ ప్రకారం జీతాలను చెల్లిస్తున్నామన్నారు. పార్ట్ టైం ఉద్యోగులకు రూ.4వేలు, ఫుల్ టైం ఉద్యోగులకు రూ.5వేల చొప్పున జీతాలు పెంచామన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన మాట వాస్తవమేనన్నారు. 2014–15లో రూ.1,245 కోట్లు, 2015–16లో రూ.697 కోట్లు, 2016–17లో రూ.935 కోట్లు, 2017–18లో రూ.940 కోట్లు విడుదలయ్యాయన్నారు. 14వ ఆర్థిక కమిషన్‌లో గ్రామ పంచాయతీలకు 100 శాతం నిధులను కేటాయించారన్నారు. వాటిని గ్రామజ్యోతి ద్వారా అవసరమైన మేరకు నిధులను మంజూరు చేస్తారన్నారు. శాసనమండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, కసిరెడ్డి నారాయణరెడ్డి పలు పశ్నలు అడిగారు.

కడియం శ్రీహరిని కలిసిన ఉపాధ్యాయసంఘాలు

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సీ జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సింహులు, కోశాధికారి రమణాచార్యులు సోమవారం సచివాలయంలో మంత్రి కడియం శ్రీహరిని కలిసి భాషాపండితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని కడియం శ్రీహరి వారికి హామీ ఇచ్చారు.




సోమవారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగసంఘాల నాయకులు

మీడియా పాయింట్

ఉదయంపూట మరిన్ని బస్సులు నడుపాలి

- ఆర్టీసీ బస్‌లో అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యే వివేకానంద



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలో ఉదయం పూట సరిపడినన్ని ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల సౌకర్యార్థం మరిన్ని బస్సులను పెంచాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద కోరారు. సోమవారం ఉదయం ఆయన తన నియోజకవర్గం నుంచి ఆర్టీసీ బస్‌లో అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రయాణికులు, విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు కుత్బుల్లాపూర్ నుంచి బస్సులో అసెంబ్లీ వరకు వచ్చినట్టు తెలిపారు. రవాణా వ్యవస్థలో ఉన్న సమస్యల గురించి ప్రయాణికులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నానన్నారు. ఉదయంపూట తగినన్ని బస్సులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు విద్యార్థులు చెప్పారని పేర్కొన్నారు. సమస్యను మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తామని చెప్పారు.

నేడు యథావిధిగా పదో తరగతి పరీక్షలు

- ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మాల్‌ప్రాక్టీస్ కేసులు
- బాధ్యులపై చర్యలు, విధుల నుంచి సస్పెండ్ చేసిన డీఈవోలు
- ముగ్గురు అధికారులు, ఒక ఇన్విజిలేటర్‌పై సస్పెన్షన్ వేటు
- ప్రైవేటు స్కూల్‌పై చట్టపరంగా చర్యలు
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని.. టైంటేబుల్ ప్రకారం మంగళవారం యథావిధిగా పరీక్షలు కొనసాగుతాయని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహడపనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రశ్నాపత్రం లీక్ అయినట్టు వార్తలు రావడంతో విచారణ జరిపినట్టు తెలిపారు. ఇంగ్లిష్ పేపర్ 1 ప్రశ్నాపత్రం లీక్ కాలేదని.. అక్కడ మాల్‌ప్రాక్టీస్ చేయడంలో ఇన్విజిలేటర్ భాగస్వామం ఉందని పోలీసు విచారణలో తేలిందన్నారు. పరీక్ష కేంద్రానికి సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్, అడిషనల్ డిపార్టుమెంటల్ ఆఫీసర్, ఇన్విజిలెటర్ మొత్తం నలుగురిని విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ ప్రైవేటు స్కూల్‌కు చెందిన పదో తరగతి పరీక్ష కేంద్రంలో కొంతమంది బయట నుంచి వచ్చి ప్రశ్నాపత్రాన్ని తీసుకెళ్లినట్టు పోలీసులు విచారణలో వెల్లడైందని తెలిపారు. అందుకు సంబంధించి ఆ కేంద్రంలోని అధికారులను సస్పెండ్ చేశామన్నారు. ఈ మేరకు ప్రైవేటు స్కూల్‌పై ప్రభుత్వ పరీక్షల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని నూతన్‌కల్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి రిలీవ్‌చేశారు. మిగిలిన పరీక్షల నిర్వహణలో డీఈవోలు అన్ని భద్రతాచర్యలు పాటించాలని సూచించారు. ఈ రెండు జిల్లాలో మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడి విచారణకు ఆదేశించామన్నారు. వారి నివేదిక ప్రకారం స్థానికంగా చర్యలు కొనసాగుతాయ తెలిపారు.

దేశ రాజకీయాల్లో సీఎం విజయం సాధిస్తారు

- హరిహర అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరంగం గోపాలకృష్ణమాచార్యులు



సోమవారం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారికి పూలమాల వేసి అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘాల నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించారని హరిహర అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరంగం గోపాలకృష్ణమాచార్యులు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారిని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం, శ్రీ వైష్ణవ సేవా సమితి, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య వేదిక, ఇతర బ్రాహ్మణ సంఘాలు నేతలు కలిసి అభినందించారు. బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి రూ. 100 కోట్లు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విజయం సాధించాలని ఆశీస్సులందించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని చెప్పారు.



ఉద్యానశాఖ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యానశాఖ అధికారుల సంఘం 2018 డైరీని వ్యవసాయ, సహకారశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి సైదులు, కోశాధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు సర్కారు భరోసా

దాదాపు మూడు లక్షల మందికి లబ్ధి.. ఇప్పటివరకు రూ.1642 కోట్లు చెల్లింపు.. కల్యాణలక్ష్మి ఆర్థికసాయం పెంపుపై సర్వత్రా హర్షం

2014లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ప్రారంభమైన నాటినుంచి 2018 మార్చి 13 వరకు.. ఆయా వర్గాల వారీగా లబ్ధిదారుల సంఖ్య

క్యాటగిరీ	లబ్ధిదారుల సంఖ్య
బీసీ	81182
ఈబీసీ	4264
మైనార్టీ	78326
ఎస్సీ	80449
ఎస్టీ	48224
మొత్తం	**2,92,445**

జిల్లాల వారీగా లబ్ధిదారులకు చెల్లించిన మొత్తం

జిల్లా	చెల్లించిన మొత్తం (రూ. కోట్లలో)
ఆదిలాబాద్	104.84
భద్రాద్రి కొత్తగూడెం	29.32
హైదరాబాద్	177.73
జగిత్యాల	28.20
జనగామ	16.78
జయశంకర్ భూపాలపల్లి	21.89
జోగుళాంబ గద్వాల	16.81
కామారెడ్డి	32.11
కరీంనగర్	82.30
ఖమ్మం	101.67
కుమ్రంభీం ఆసిఫాబాద్	19.96
మహబూబాబాద్	34.80
మహబూబ్‌నగర్	105
మంచిర్యాల	26.30
మెదక్	75.38
మేడ్చల్	41.19
నాగర్‌కర్నూల్	21.47
నల్లగొండ	109.23
నిర్మల్	29.74
నిజామాబాద్	104.34
పెద్దపల్లి	21.52
రాజన్న సిరిసిల్ల	18.41
రంగారెడ్డి	119.32
సంగారెడ్డి	53.50
సిద్దిపేట	37.20
సూర్యాపేట	15.56
వికారాబాద్	17.06
వనపర్తి	17.06
వరంగల్ రూరల్	23.81
వరంగల్ అర్బన్	84.94
యాదాద్రి భువనగిరి	23.27

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పేద కుటుంబాలకు ఆడపిల్ల పెండ్లి భారంగా మారుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం తెలంగాణ ఆడబిడ్డలకు భరోసా ఇస్తున్నది. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా పెరిగిన ధరలు, కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద అందించే ఆర్థికసాయాన్ని రూ.75,116 నుంచి రూ.లక్షా నూట పదహార్లకు పెంచింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం అసెంబ్లీలో ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఈ బృహత్తరపథకంవల్ల రాష్ట్రంలో చాలామంది ఆడపిల్లలు చిన్న వయసులో పెండ్లి చేసుకొని అవస్థలు పడే పరిస్థితుల నుంచి బయటపడుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సామాజిక రుగ్మతలతో కొట్టుమిట్టాడిన తెలంగాణ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక వినూత్న మార్పులను సంతరించుకొంటున్నది. ముఖ్యంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ప్రారంభించిన నాటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వం రూ.1642.02 కోట్లు వెచ్చించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు మొత్తం 2,92,445 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరింది.

కేసీఆర్ దేశచరిత్రలో నిలిచిపోతారు

తెలంగాణలో సీఎం కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో మానవీయపాలన సాగుతున్నది. ఆడపిల్లలకు వరంగా మారిన కల్యాణలక్ష్మి పథకం కింద అందించే ఆర్థిక సాయాన్ని పెంచడం హర్షణీయం. సీఎం కేసీఆర్ దేశచరిత్రలో నిలిచిపోతారు.

- గిరిజన సంక్షేమశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్

ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆనందం

పేదింటి ఆడబిడ్డలకు భరోసా ఇస్తున్న కల్యాణలక్ష్మి పథకం ఆర్థికసాయాన్ని పెంచడంతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

- రాసమల్ల బాల్‌కిషన్, రాష్ట్ర అధ్యక్షుడు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం

నిరుపేదల జీవితాల్లో వెలుగులు

సీఎం కేసీఆర్ పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రజలు అడుగకముందే వారి అవసరాలను గుర్తించి ఉగాది కానుకగా తెలంగాణ ఆడబిడ్డలకోసం ఆర్థికసాయాన్ని పెంచడం కేసీఆర్‌కే దక్కింది.

- ఆలంపల్లి లత, అధ్యక్షురాలు, బీసీ మహిళా ఐక్యవేదిక

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రభుత్వం పేదల అవసరాలను ముందుగానే గుర్తించి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నది. కల్యాణలక్ష్మి పథకం కింద ఆర్థికసాయాన్ని పెంచడం హర్షణీయం. దీనివల్ల ఆడపిల్లలతల్లిదండ్రులకు భరోసా లభిస్తుంది.

- గడ్డం సాయికిరణ్, కన్వీనర్, రాష్ట్ర ఎంబీసీ సంక్షేమసంఘం

పేదింటి ఆడపిల్లలకు సీఎం కేసీఆర్ దేవుడు

మండలి మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఆర్థికసాయాన్ని పెంచినందుకు సీఎం కేసీఆర్ పేదింటి ఆడపిల్లలకు దేవుడయ్యాడని పలువురు ఎమ్మెల్సీలు అన్నారు. సోమవారం మండలి మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు.

ప్రపంచమంతా మెచ్చుకుంటున్నది

ఏరాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారు. ముందుగా రూ. 50,116, ఆ తర్వాత 75,116 అందించారు. ఈ పథకం కింద అందించే ఆర్థికసాయాన్ని ఇప్పుడు రూ. 1,0116కు పెంచుతూ అసెంబ్లీలో సీఎం కేసీఆర్, మండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ప్రకటించడం హర్షణీయం. ప్రపంచం మొత్తం ఈపథకాన్ని మెచ్చుకొంటున్నది. దేశంలో పలు రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుచేయాలని భావిస్తున్నాయి. నోబెల్ బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి కూడా ఈ పథకానికి కితాబిచ్చారు. సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు.

- పాతూరి సుధాకర్‌రెడ్డి, చీఫ్ విప్

చారిత్రాత్మక నిర్ణయం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద అందించే సాయాన్ని లక్షకు పెంచడం చారిత్రాత్మక నిర్ణయం. పేదింటి ఆడపిల్లలకు సీఎం కేసీఆర్ పెద్దన్నగా.. మేనమామగా బాధ్యతలు మోస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో, బడ్జెట్‌లో లేకున్నప్పటికీ.. ఈ పథకం కింద ఆర్థిక సాయం పెంచడం సాహసోపేత నిర్ణయం. ఆడపిల్లల తల్లి పేరిట చెక్కులు ఇవ్వడం గొప్ప విషయం. సీఎం కేసీఆర్‌ను తరతరాలు గుర్తు పెట్టుకుంటాయి.

- బోడకుంటి వెంకటేశ్వర్లు, విప్

సీఎం కేసీఆర్ కలకాలం గుర్తుంటారు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఆర్థికసాయాన్ని పెంచడం హర్షణీయం. ఈ పథకం పకడ్బందీగా పేదలకు అందుతుంది. కాంగ్రెస్ హయాంలో సామూహిక వివాహాలకు రూ. 10 వేల ఆర్థికసాయం చేసినా అది దుర్వినియోగమయ్యేది. అర్హులకు అందేది కాదు. ఆడపిల్లల తల్లిదండ్రులు సీఎం కేసీఆర్‌ను ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారు.

- ఫారూక్ హుస్సేన్

జాతీయస్థాయిలో చర్చనీయాంశం

గత పాలకులు చేయనివి సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థికసాయాన్ని పెంచినందుకు సీఎం కేసీఆర్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. మిగతా రాష్ట్రాలకు ఈ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు జాతీయస్థాయిలో చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. ఇలాంటి పథకాలు అమలుచేయడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యం.

- పురాణం సతీష్



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ఆర్థికసాయాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, విప్ సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, రేఖానాయక్, బొడిగె శోభ. చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ సాయం పెంపు

మొదటిపేజీ తరువాయి...

ఇంటి మహాలక్ష్మిగా గౌరవించే ఆడపిల్లను గుండెమీద కుంపటిగా భావించే మానసికస్థితిలోకి పడిపోతున్నారు. ఆడపిల్ల కడుపులో ఉండగానే, ఆ పిల్ల పెండ్లికోసం చేయాల్సిన ఖర్చును ఊహించి కొంతమంది భ్రూణహత్యలకు పాల్పడుతున్న అమానుష సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు పేదల ఇండ్లల్లో ఆడపిల్లలు పెండ్లి కాకుండానే మిగిలిపోతున్నారు. ఆడపిల్ల పెండ్లి చేయడంకోసం కుటుంబాలు అప్పులపాలవుతున్నాయి. ఆర్థికంగా చితికిపోతున్నాయి. పరిపాలనలో మానవీయ విలువలు అడుగడుగునా ప్రతిబింబించాలని భావించే తెలంగాణ ప్రభుత్వం ఆడపిల్లలు ఎదుర్కొంటున్న కష్టాన్ని, వారి తల్లిదండ్రులు అనుభవిస్తున్న ఆవేదనని తీర్చాలని భావించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీ కాకున్నా, పేదరికం ప్రభావాలను అధ్యయనంచేసే క్రమంలో పరిస్థితిలోని తీవ్రత మమ్మల్ని కదిలించింది. అందుకే పేద ఆడపిల్లల పెండ్లికి ప్రభుత్వం ఆర్థికంగా అండదండగా నిలువాలని నిర్ణయించాం. కల్యాణలక్ష్మి అనే శుభప్రదమైన పేరుతో 2014 అక్టోబర్ 2న ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాం.

నా హృదయానికి ఎంతో దగ్గరైన పథకం

ఆడపిల్లల కన్నీరు తుడిచి వారి తలపై కల్యాణాక్షతలు చల్లిన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచింది. కల్యాణలక్ష్మి వ్యక్తిగతంగా నా హృదయానికి ఎంతో దగ్గరైన పథకం. అంతకంటే ఎక్కువగా ఈ రాష్ట్ర ప్రజలు మెచ్చిన పథకం. ఆడపిల్లల కండ్లల్లో ఆనందం నింపిన పథకం. మొదట ఈ పథకాన్ని 'కల్యాణలక్ష్మి' పేరుతో ఎస్సీ,ఎస్టీలకు, షాదీముబారక్ పేరుతో మైనార్టీ వర్గాల ఆడపిల్లల పెండ్లికి రూ.51,000 అందించే పథకంగా ప్రారంభించాం. ఆ తర్వాత ప్రజలనుంచి వచ్చిన అభ్యర్థన మేరకు సామాజికవర్గంతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలోని నిరుపేదలందరికీ వర్తింపచేశాం.

ఆడపిల్లల తల్లులు దీవిస్తున్నారు

సార్థకమైన ఈ పథకం ప్రయోజనం మరింత పెంచాలన్న ఉద్దేశంతో.. పథకం ద్వారా అందించే మొత్తాన్ని గతేడాది రూ.75,116కు పెంచాం. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 3.60 లక్షల మందికి లబ్ధి చేకూరింది. కల్యాణలక్ష్మి చెక్కులు తీసుకుంటున్న సమయంలో తమకందిన సహాయానికి సంతోషిస్తూ, ఆడపిల్లల తల్లులు ఆనందబాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఇతర సామాజిక ప్రయోజనాలను సాధించింది. ఈ పథకం ద్వారా లబ్ధిపొందడానికి కనీస వయో పరిమితి 18 సంవత్సరాలుగా నిర్ణయించాం.దీంతో పథకం ప్రయోజనాలు పొందడంకోసం బాల్య వివాహాలు చేయకుండా 18 సంవత్సరాలు నిండేవరకు తల్లిదండ్రులు వేచి ఉంటున్నారు. ఈ విధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం బాల్య వివాహాలను నిరోధించడానికి కూడా ఉపయోగపడుతున్నది. కల్యాణలక్ష్మి సహాయం అందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతోపాటు చట్టబద్ధత లభిస్తున్నది. ఇది ఈ పథకం సాధించిన మరో ప్రయోజనం. అత్యంత మంగళకరమైన ఈ పథకానికి సంబంధించి మరో శుభవార్తను ఈ రోజు ఈ సభ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాను. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద ఆడపిల్ల పెండ్లికోసం అందించే మొత్తాన్ని రూ.75,116 నుంచి రూ. లక్షా నూట పదహార్లకు పెంచుతున్నామని ఎంతో సంతోషంతో ప్రకటిస్తున్నాను. ప్రభుత్వం తీసుకున్న ఈ మంచి నిర్ణయానికి ఆడపిల్లలు, వారి తల్లిదండ్రుల నుంచే కాకుండా, సమాజహితం కోరే వారందరినుంచి హర్షామోదాలు లభిస్తాయని విశ్వసిస్తున్నాను. వారి ఆశీర్వాదమే కొండంత అండగా సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని సవినయంగా తెలియజేస్తున్నాను' అని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

మండలిలో ప్రకటన చేసిన కడియం శ్రీహరి..

షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలకు ఇచ్చే మొత్తం పెంపునిర్ణయాన్ని శాసనమండలిలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రకటించారు. మండలి సభ్యులు హర్షధ్వానాలతో ఆమోదం తెలిపారు.

కల్తీ విత్తనాల నివారణకు పటిష్ఠచర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కల్తీ విత్తనాల బెడద లేకుండా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠచర్యలు తీసుకుంటున్నది. ఇందులోభాగంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ సమావేశ మందిరంలో సీడ్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులకు, విత్తనోత్పత్తిదారులకు నకిలీ విత్తనాలు నిరోధించడం కోసం రూపొందించిన విధానాలపై వ్యవసాయ, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలతోపాటు హెచ్‌టీ పత్తిని, చట్ట వ్యతిరేక వ్యాపారాలను నిరోధించాలని ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉన్నదని ఆయన చెప్పారు. గత శనివారం 49 ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ బృందాల్లో పోలీసు, వ్యవసాయశాఖల నుంచే కాక తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ, విత్తనాభివృద్ధి సంస్థ నుంచి అనుభవం గల అధికారులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్, తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు డాక్టర్ కే కేశవులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉద్యోగుల నిరసన ప్రదర్శన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఆంధ్రా ఉద్యోగుల చేరికను నిరసిస్తూ మంగళవారం విద్యుత్‌సౌధలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎన్ శివాజీ, కన్వీనర్ పీ అంజయ్య తెలిపారు. విద్యుత్ సంస్థల విభజన సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం చొరవ చూపడం లేదని, ఏపీ ఉద్యోగులను స్థానికత ఆధారంగా రిలీవ్‌కాకుండా అక్రమమార్గంలో తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ప్రవేశపెడుతున్నదని మండిపడ్డారు.

పర్యావరణ పరిరక్షణలో కాలుష్య నియంత్రణ మండలి కీలకపాత్ర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణ పరిరక్షణలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ల పాత్ర కీలకమని కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లకు సోమవారం శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ నెల 27 వరకు జరిగే శిక్షణ తరగతుల్లో వివిధరంగాల నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొని శిక్షణ ఇస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న టీఎస్ ఐపాస్ కింద నిర్ణీత గడువులోగా అనుమతులు ఇవ్వడంపై దృష్టిసారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఈ విశ్వనాథం, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



టీఎస్‌ఆర్టీసీ సమస్యలపై అసెంబ్లీ కమిటీ హాల్‌లో టీఎంయూ నేతలతో సమావేశమైన మంత్రులు హరీశ్‌రావు, పీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రి హరీశ్‌రావు సమావేశం


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) కార్మికుల సమస్యలపై ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్‌యూనియన్(టీఎంయూ) గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి టీ హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో చర్చించారు. రవాణాశాఖ మంత్రి పీ మహేందర్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి టీ పద్మారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్, టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణరావు, టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి, యూనియన్ల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. కార్మికులకు రావాల్సిన జీతభత్యాల బకాయిలు, సంస్థ స్థితిగతులపై చర్చించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తిరిగి ఈ నెల 20వ తేదీ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు మరోసారి సమావేశం కావాలని భేటీలో నిర్ణయించారు. టీఎంయూ రాష్ట్ర నాయకులు బీవీ రెడ్డి, ఎల్ మంగయ్య, జీఎల్ గౌడ్, వీఎస్ రెడ్డి, వీకే రెడ్డి, వీ యాదయ్య సమావేశంలో పాల్గొన్నారు.

చైనా వ్యవసాయ ప్రదర్శనలో హైదరాబాద్ స్టార్టప్ విజయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సులభంగా నీటిలో కరిగే ఎరువులతోపాటు సేంద్రియ, నానో సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎరువులను తయారుచేసిన హైదరాబాద్‌కు చెందిన జియోలైఫ్ అగ్రిటెక్ ఇండియా స్టార్టప్ చైనాలో అతిపెద్ద వ్యవసాయ ప్రదర్శన సీఏసీ-18లో ప్రథమ బహుమతి గెలుచుకుంది. సోమవారం షాంఘైలో నిర్వహించిన పోటీలో పర్యావరణానికి హానిచేయకుండా అత్యధిక దిగుబడులను సాధిస్తున్న జియోలైఫ్ ఉత్పత్తులను న్యాయనిర్ణేతలు ప్రశంసించారు. పర్యావరణహిత వ్యవసాయ ఆవిష్కరణ విభాగంలో నానో టెక్నాలజీ ఆధారంగా తీర్చిదిద్దిన ఎరువుల ఉత్పత్తిని రూపొందించిన సంస్థగా తమను ఎంపికచేయడం సంతోషకరమని జియోలైఫ్ ఎండీ వినోద్ లహోటీ వెల్లడించారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బలోపేతం

- హోం, న్యాయశాఖల మంత్రులు నాయిని, అల్లోల వెల్లడి
- కోర్టుల్లో ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి చర్యలు
- సిబ్బంది నియామకం, వసతుల కల్పనపై ప్రతిపాదనలకు ఆదేశం



సోమవారం సచివాలయంలో అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌ను సమూలంగా బలోపేతం చేయనున్నట్టు హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అభివృద్ధిపై సోమవారం సచివాలయంలోని హోంమంత్రి కార్యాలయంలో అధికారులతో ఉన్నస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ పోస్టులు, మినిస్టీరియల్ సిబ్బంది భర్తీకి, ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఫోన్, ఇతర సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సమావేశంలో నిర్ణయించారు. టెన్యూర్ ప్రాసిక్యూటర్ల నియామకం కోసం మరింత పటిష్ఠ విధానం అవలంబించాలని నిర్ణయించారు. సమావేశంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్‌త్రివేది, లా సెక్రటరీ నిరంజన్‌రావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఐడీ అడిషనల్ డీజీపీ గోవింద్‌సింగ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గడ్డం సాయికిరణ్ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జోగురామన్న. చిత్రంలో ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ఉన్నారు

ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు రావొద్దు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రతి ఆవాసానికి త్వరలో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, ఎండాకాలంలో ఎక్కడా తాగునీటి కొరత రావొద్దని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇవ్వాలని సూచించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ పనుల పురోగతిపై సమీక్షించారు. తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో 7 వేల ఆవాసాలతోపాటు 18 యూఎల్‌బీలకు భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నామని వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కృపాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, ఓఎస్డీ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

- టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి వినతి

రెడ్డికాలనీ (వరంగల్): దేశ రాజకీయాల్లోకి వెళ్తున్న సీఎం కేసీఆర్ సీపీఎస్ జీవోను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలువాలని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించనున్న సకల ఉద్యోగుల మహాసభ సన్నాహక సమావేశంలో సోమవారం హన్మకొండలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన ఉద్యోగులకు సీఎం కేసీఆర్ 43 శాతం ఫిట్‌మెంట్, 24 గంటల్లోనే ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేశారని గుర్తుచేశారు. కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం (సీపీఎస్) వల్ల ఏడున్నర లక్షల మంది ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. తెలంగాణ ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో 12 లక్షల ఉద్యోగుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో ఉద్యోగుల జాక్ చైర్మన్ పరిటాల సుబ్బారావు, టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, రాష్ట్రమహిళా అధ్యక్షురాలు రేచల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయం, బయోఫర్టిలైజర్స్ తయారీలో నైపుణ్యాభివృద్ధి అందించడంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ హైదరాబాద్, సైదాబాద్‌లోని వర్ష బయోసైన్సెస్ సంస్థతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాజేంద్రనగర్‌లోని వర్సిటీ పరిపాలనా భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి వీ ప్రవీణ్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్, వర్ష బయోసైన్సెస్ చైర్మన్ డాక్టర్ ఏ జాన్‌పీటర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు కూడా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వాలని వీసీ ప్రవీణ్‌రావు అన్నారు.

గాంధీకి కొనసాగుతున్న చికిత్స

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి మల్లంపాటి గాంధీకి సోమవారం కూడా గాంధీ దవాఖానలో చికిత్స అందించారు. ఆయనను ఏఎంసీ వార్డులో అడ్మిట్ చేసుకున్న వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నారు. కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనను వైద్యులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జైలు అధికారులకు వివరాలు అందజేస్తున్నారు. వైద్యులు ఇచ్చిన నివేదికను మంగళవారం కోర్టుకు సమర్పించనున్నట్టు జైలు అధికారులు తెలిపారు.

వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ
32,923	10,094
↘ 253	↘ 101

ముడి చమురు (బ్రెంట్) ↘ 65.73 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,340
22 క్యారెట్లు	30,190
వెండి (కిలో)	37,940

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.16	68.60
బహ్రెయిన్ దినార్	160.22	183.61
కువైట్ దినార్	179.27	223.16
సౌదీ రియాల్	15.73	18.64
యూఏఈ దిర్హామ్	16.10	18.82

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	66.00
రిటైల్ లైవ్	88.00
డ్రెస్డ్	128.00
స్కిన్‌లెస్	145.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	330-00
రంగారెడ్డి	330-00
మెదక్	330-00
కరీంనగర్	332-00
వరంగల్	332-00
రిటైల్ ప్రైస్	3-90

మనీలాండరింగ్ కేసును సవాలు చేస్తున్న నీరవ్

ఆస్తుల స్వాధీనాన్ని ఆపాలని విజ్ఞప్తి.. దర్యాప్తును అడ్డుకునేందుకేనన్న ఈడీ



న్యూఢిల్లీ, మార్చి 19: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో భారీ కుంభకోణానికి పాల్పడి దాదాపు రూ.13,600 కోట్లు స్వాహా చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఇప్పుడు ఏకంగా మనీ లాండరింగ్ కేసునే సవాలు చేస్తున్నాడని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం ఢిల్లీ హైకోర్టుకు వివరించింది. పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి రావడానికి కొన్ని రోజుల ముందే కుటుంబ సభ్యులతో కలసి దేశం నుంచి జారుకున్న నీరవ్ మోదీ తన ఆధీనంలోని ఫైర్ స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పిటీషన్ దాఖలు చేయించి న్యాయ ప్రక్రియను నిందించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ సందీప్ సేథీ జస్టిస్ ఎస్ మురళీధర్, జస్టిస్ ఐఎస్ మెహతాలతో కూడిన హైకోర్టు ధర్మాసనానికి తెలియజేశారు. మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫైర్ స్టార్ డైమండ్ సంస్థ ఈ వ్యవహారంలో ఈడీ జరుపుతున్న దర్యాప్తుతో పాటు ఆస్తుల స్వాధీనాన్ని, అలాగే స్వాధీనం చేసుకున్న చరాస్తులను పీఎన్‌బీలో జమ చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని కోరింది. అయితే ఈ విషయమై ఆ సంస్థ చేసిన విజ్ఞప్తి అపరిపక్వమైనది గానూ, తప్పుగానూ ఉన్నదని, కనుక ఆ పిటీషన్ విచారణకు అర్హమైనది కాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ అఫిడవిట్‌లో పేర్కొన్నది. అంతే కాకుండా ఫైర్‌స్టార్ పిటీషన్‌ను న్యాయస్థానం అనుమతించినట్లయితే పీఎన్‌బీ కుంభకోణంపై తాము జరుపుతున్న దర్యాప్తునకు తీవ్రమైన విఘాతం కలిగే అవకాశం ఉన్నదని ఈడీ ఆందోళన వ్యక్తం చేసింది. 'పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ ఈ పిటీషన్ దాఖలు చేసిన ఫైర్ స్టార్ డైమండ్ సంస్థకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. మాతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కూడా పదేపదే సమన్లు జారీ చేసినప్పటికీ ఆయన విచారణకు సహకరించడం లేదు. అసలు విచారణలో పాలుపంచుకోవాలన్న ఉద్దేశ్యమే నీరవ్‌కు లేదని ఆయన రాసిన లేఖలను బట్టి స్పష్టమవుతున్నది. కరడు గట్టిన ఆర్థిక నేరగాడైన నీరవ్ న్యాయస్థానం ముందుకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దర్యాప్తు సంస్థలకు సహకరించేందుకు నిరాకరిస్తున్నాడు. కనుక ఫైర్‌స్టార్ పిటీషన్‌ను డిస్మిస్ చేసేందుకు ఇంతకు మించిన కారణాలు అవసరం లేదు' అని ఈడీ తన అఫిడవిట్‌లో పేర్కొంది.

నీరవ్ సోలార్ ప్లాంట్ స్వాధీనం

ఇదిలావుంటే, పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదివారం అహ్మద్‌నగర్‌లో నీరవ్ మోదీకి చెందిన సోలార్ పవర్ ప్లాంట్‌తో పాటు 134 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నది. ఈ కేసులో ఇంతకుముందు ఈడీ అధికారులు నీరవ్‌తో పాటు ఆయన ఆధీనంలోని సంస్థలకు చెందిన రూ.524 కోట్ల విలువచేసే 21 స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

కుంభకోణాలపై జేపీసీ దర్యాప్తు: యూఎఫ్‌బీయూ

పీఎన్‌బీతో పాటు మరికొన్ని ఇతర బ్యాంకుల్లో ఇటీవల జరిగిన కుంభకోణాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు జరిపించాలని యూఎఫ్‌బీయూ (యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 'దేశం నుంచి పారిపోయిన ఇద్దరు వజ్రాల వ్యాపారులు (నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ) పీఎన్‌బీలో భారీ కుంభకోణానికి పాల్పడి దాదాపు రూ.13 వేల కోట్లు స్వాహా చేసిన ఉదంతంపై జేపీసీతో సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. 1992లో హర్షద్ మెహతా కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పీఎన్‌బీ కుంభకోణంపై కూడా జేపీసీతో దర్యాప్తు జరిపించాలి' అని యూఎఫ్‌బీయూ పశ్చిమ బెంగాల్ కన్వీనర్ సిద్ధార్థ్ ఖాన్ అన్నారు. బ్యాంకులను సరైన రీతిలో పర్యవేక్షించడంలో రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) విఫలమైందని, అందుకే ఇటువంటి కుంభకోణాలు తరచుగా జరుగుతున్నాయని, ఈ కుంభకోణాలకు బ్యాంకుల్లోని కింది స్థాయి ఉద్యోగులను బలిపశువులను చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కుంభకోణాలతో పాటు బ్యాంకింగ్ రంగాన్ని పట్టిపీడిస్తున్న నిరర్థక ఆస్తులు, ఇతర సమస్యలపై యూఎఫ్‌బీయూలోని మొత్తం తొమ్మిది కార్మిక సంఘాలు ఈ నెల 21వ తేదీన న్యూఢిల్లీలో పార్లమెంట్ భవనం ఎదుట ర్యాలీ నిర్వహించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎఫ్ఆర్‌డీఐ బిల్లు-2017ను కూడా యూఎఫ్‌బీయూ వ్యతిరేకిస్తున్నది. 'బెయిల్ ఇన్' క్లాజుతో కూడిన ఈ బిల్లు వలన బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ముకు ముప్పు వాటిల్లడం ఖాయమని యూఎఫ్‌బీయూ ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

'బంధన్' ఐపీవో సక్సెస్

కోల్‌కతా, మార్చి 19: బంధన్ బ్యాంక్ ఐపీవోకి అపూర్వ స్పందన లభించింది. కంపెనీ జారీ చేసిన షేర్ల కంటే 14.56 రెట్లు అధికంగా బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐపీ, హెచ్ఎన్ఐల నుంచి మంచి స్పందన లభించిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. క్యూఐపీలకోసం జారీ చేసిన షేర్ల కంటే 38.67 రెట్లు అధికంగాను, హెచ్ఎన్ఐ ఇన్వెస్టర్లు 13.89 రెట్లు అధికంగా బిడ్లు దాఖలు చేసినట్లు ఎండీ, సీఈవో చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు. ప్రైస్ బాండ్ ధరను రూ.370 నుంచి రూ.375 మధ్యలో నిర్ణయించింది. పది రూపాయల ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయడం ద్వారా బ్యాంక్ రూ.4,500 కోట్ల నిధులను సమీకరించుకోగలిగింది. భవిష్యత్తు వ్యాపార అవసరాల నిమిత్తం ఈ నిధులను వినియోగించనున్నట్లు ఘోష్ ప్రకటించారు.

అమెజాన్ విస్తరణ బాట

హైదరాబాద్, మార్చి 19: ఆన్‌లైన్ ద్వారా వస్తువులను సరఫరా చేసే అమెజాన్ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే దేశంలో 62 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను నిర్వహిస్తున్న సంస్థ..తాజాగా మరో ఆరింటిని ఏర్పాటు చేయాలనుకుంటున్నది. పుణె, లక్నో, ముంబై, గురుగ్రామ్, కోయంబత్తూర్‌లలో వీటిని నెలకొల్పాలనుకుంటున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్, అఖిల్ సక్సేనా తెలిపారు. వీటితోపాటు హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, అహ్మదాబాద్‌లలో ఉన్న ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల సామర్థ్యాన్ని మరింత పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నూతన సెంటర్ల ద్వారా వినియోగదారులు బుకింగ్ చేసుకున్న ఉత్పత్తులను మరుసటి రోజే అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సెంటర్ల ద్వారా 5 వేల ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వీటిలో అధికభాగం ఎలక్ట్రానిక్ ఉత్పత్తులని ఆయన పేర్కొన్నారు.



ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్ 'రీకనెక్ట్' కొత్త ఇన్వర్టర్ ఏసీలను మార్కెట్లో ప్రవేశపెట్టింది. నూటికి నూరు శాతం కాపర్ కండెన్సర్, ఎవాపరేటర్, కనెక్టింగ్ పైపులతో లభ్యమయ్యే ఈ ఏసీల ధరలు రూ.18,990 నుంచి ప్రారంభమవుతాయి.



33 వేల దిగువకు

253 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్.. నిఫ్టీది అదేబాట

ముంబై, మార్చి 19: స్టాక్ మార్కెట్లు మరింత పతనమయ్యాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం కావడం, అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచనున్నదన్న భయాలు దేశీయ మదుపరుల్లో స్పష్టంగా కనిపించింది. మెటల్, టెలికం, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 33 వేల దిగువకు పడిపోయింది. ఉదయం లాభాల్లో ప్రాంభమైన సూచీలకు చివరకు నష్టాలే మిగిల్చాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ 252.88 పాయింట్లు(0.76 శాతం) తగ్గి 32,923.12 వద్ద ముగిసింది. డిసెంబర్ 6న ముగిసిన స్థాయికి జారుకున్నట్లు అయింది. గడిచిన నాలుగు సెషన్లలో సూచీ 741.94 పాయింట్లు కోల్పోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 10,100కిందికి పడిపోయింది. గతవారం ముగింపుతో పోలిస్తే 100.10 పాయింట్లు తగ్గి 10,094.25 వద్ద స్థిరపడింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీలో కరెంట్ ఖాతాలోటు 2 శాతానికి చేరుకున్నదని గత వారంలో ఆర్బీఐ విడుదల చేసిన గణాంకాలు సూచీలపై స్పష్టంగా ప్రభావం చూపాయి. మార్కెట్లతో పాటు దేశీయ కరెన్సీ కూడా భారీగా పతనం చెందింది. టాటా స్టీల్ అత్యధికంగా 4.24 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ కూడా 4.16 శాతం మార్కెట్ వాటాను కోల్పోయింది. వీటితోపాటు విప్రో, యెస్ బ్యాంక్, కోల్ ఇండియా, ఇన్ఫోసిస్, బజాజ్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, కొటక్ బ్యాంక్, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో, డాక్టర్ రెడ్డీస్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఆర్ఐఎల్, ఐటీసీ లిమిటెడ్, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రాలు 2.60 శాతం వరకు నష్టపోయాయి. కానీ పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఎల్ అండ్ టీ, మారుతి, హెచ్‌యూఎల్, టీసీఎస్‌లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో లోహాల ధరలు భారీగా పడిపోవడం ఈ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. ముఖ్యంగా మెటల్ రంగానికి చెందిన షేర్లైన ఎన్ఎండీసీ, సెయిల్, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జిందాల్ స్టీల్, హిందుస్థాన్ జింక్, వేదాంతల షేర్లు ఆరు శాతానికి పైగా పడిపోయాయి. అలాగే ఐవోసీ, బీపీసీఎల్, గెయిల్, హెచ్‌పీసీఎల్ షేర్ల కూడా నాలుగు శాతం తగ్గాయి. రంగాల వారీగా చూస్తే టెలికం నిరాశాజనక పనితీరు కనబరిచింది.


అల్ట్రాటెక్ చేతికి బినానీ సిమెంట్

ఒప్పందం విలువ రూ.7,266 కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 19: బినానీ సిమెంట్ లిమిటెడ్(బీసీఎస్) వేలంలో మరో కీలక మలుపు చోటు చేసుకున్నది. అనూహ్య పరిణామాల మధ్య అప్పుల్లో కొట్టుమిట్టాడుతున్న బీసీఎల్ కు చెందిన ఆస్తులను రూ.7,266 కోట్లకు కొనుగోలు చేయడానికి ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ ముందుకొచ్చింది. దాల్మియా సిమెంట్ ఇచ్చిన రూ.6,350 కోట్ల ఆఫర్ కంటే అల్ట్రాటెక్ అధికంగా ఇవ్వడం విశేషం. దీంతో బినానీలో 98 శాతం వాటా కొనుగోలుకు సంబంధించిన ఇరు సంస్థల మధ్య సోమవారం అంగీకార ఒప్పందం కుదిరింది. దీంతో కంపెనీ దివాలా పిటిషన్‌కు చరమగీతం పాడినట్లు అయింది. ఈ విషయాన్ని సంస్థ సోమవారం స్టాక్ మార్కెట్లకు సమాచారం అందించింది. ఇందుకు సంబంధించి బోర్డు డైరెక్టర్లు సమావేశమై బీఐఎల్‌కు రూ.7,266 కోట్ల మేర చెల్లింపులు జరుపడానికి ఉద్దేశించిన లేఖను అందించినట్లు అల్ట్రాటెక్ వర్గాలు వెల్లడించాయి.

సీఎం కేసీఆర్ పాలన సూపర్

- కేసీఆర్‌కు 6.. చంద్రబాబుకు 2.5 మార్కులు
- సీఎన్ఎన్ న్యూస్ 18 ఇంటర్వ్యూలో పవన్‌కల్యాణ్
- ఏపీ సర్కార్ అవినీతిపై కేంద్రం విచారణ జరుపాలని డిమాండ్
- మోదీ, చంద్రబాబు మధ్య పాతకక్షలున్నాయని వ్యాఖ్య



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పోలిస్తే ఏపీలో చంద్రబాబు పాలన దారుణంగా ఉన్నదని సినీ నటుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన సూపర్‌గా ఉందని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో పాలనాతీరుపై పది మార్కులకుగాను తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ఆరు మార్కులు, చంద్రబాబుకు 2.5 మార్కులు వేశారు. సోమవారం సీఎన్ఎన్ న్యూస్ 18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవన్ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశానని, థర్డ్‌ఫ్రంట్ గురించి చర్చించానని ఆయన తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ వివిధ రాష్ట్రాల్లోని స్థానిక సమస్యలను అర్థం చేసుకోలేకపోతున్నాయని, అందుకే థర్డ్ ఫ్రంట్ పురుడు పోసుకునే దిశగా అడుగులు పడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం సొంత దారిలో వెళ్తున్నామని, ఎన్నికల సమయంలో కూటమి అవసరమా, లేక సొంతంగా పోటీచేయాలా అనేది నిర్ణయిస్తామని పవన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వస్తున్న అవినీతి అరోపణలపై కేంద్రం విచారణ జరుపాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్ సహా దాదాపు 40 మంది టీడీపీ ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వీటిపై విచారణ జరుపాలని కేంద్రాన్ని కోరారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు మధ్య పాతకక్షలేవో ఉన్నట్లు అనిపిస్తున్నదని, వీరిద్దరి మధ్య విభేదాల వల్ల ప్రజలు బాధపడుతున్నారని పవన్ ఆవేదన వ్యక్తంచేశారు.

బీజేపీ అణగదొక్కాలని చూస్తున్నది


- కమలం పార్టీ, వైసీపీ దోస్తీ బట్టబయలైంది
- కేంద్రంపై ఏపీ సీఎం చంద్రబాబు ధ్వజం

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: భారతీయ జనతా పార్టీ తనను అణగదొక్కాలని చూస్తున్నదని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆరోపించారు. సీఎం నివాసంలోని ప్రజాదర్బార్ హాల్‌లో సోమవారం ముస్లిం మైనార్టీలు చంద్రబాబును కలిసి బీజేపీకి స్వస్తి పలికినందుకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం ఏపీకి న్యాయం చేస్తుందనుకుంటే తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. వైసీపీ నేతలు పీఎంవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, కేంద్రం కూడా అవినీతిపరులకే అండగా నిలుస్తున్నదని చంద్రబాబు ఫైరయ్యారు. తనపై యుద్ధం చేస్తామని బీజేపీ నేతలు అంటున్నారని, ప్రశ్నిస్తే యుద్ధం చేస్తారా అని నిలదీశారు. నిధులు ఇవ్వాలని అడిగితే తనను నిందిస్తారా అని దుయ్యబట్టారు. బీజేపీతో వైసీపీ కుమ్మక్కైందని ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయిందని అన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వంగివంగి నమస్కారాలు చేసినప్పుడు వారి లాలూచీ అర్థమైందని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్‌పార్టీ ప్లీనరీలో చెప్పిందని, అలాంటప్పుడు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి అని ప్రశ్నించారు.

నేడు, రేపు గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ బంద్

ఎల్బీనగర్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ గడ్డిఅన్నారం రెండురోజులపాటు బంద్ కానున్నది. పండ్ల మార్కెట్‌లోని కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్లు జీవో 58 రద్దుచేయాలని, కోర్టు అర్డర్ ఉన్న షాపులకు వచ్చే వాహనాలకు గేట్ ఎంట్రీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు మార్కెట్ యార్డులో మార్చి 20, 21వ తేదీల్లో క్రయవిక్రయాలు చేయరాదని వారు నిర్ణయించారు. బంద్ నేపథ్యంలో మార్కెట్ యార్డుకు సరుకును తీసుకుని రావొద్దని పాలకవర్గం, అధికారులు రైతులను కోరారు. మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్ల సమస్యలను మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ కమీషన్ ఏజెంట్లు బంద్‌కు పిలుపునిచ్చారని పాలకవర్గం చైర్మన్ పుటం పురుషోత్తంరావు, ఎస్జీఎస్ వెంకటేశం తెలిపారు.

సభానిర్ణయం మేరకే ఆ ఇద్దరిపై వేటు



- కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ తొలిగింపును స్పీకర్‌కు అంటగట్టడం సరికాదు
- ఇప్పటివరకు వారిలో పశ్చాత్తాపం లేదు
- హైకోర్టులో అడ్వకేట్ జనరల్ వాదనలు
- రెండు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై ఆరువారాల స్టే
- వీడియో ఫుటేజీలు సమర్పించాలని ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సభావ్యవహారాలకు అప్రతిష్ఠ కల్గించేలా వ్యవహరించిన విషయంలో సభానిర్ణయం మేరకు నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లపై బహిష్కరణ వేటు వేసినట్టు ఉమ్మడి హైకోర్టుకు సోమవారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ (ఏజీ) దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి స్పీకర్‌కు సంబంధం లేనప్పటికీ తమపై స్పీకర్ ఏకపక్షంగా బహిష్కరణ వేటు వేశారంటూ కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని ఆయన హైకోర్టుకు తెలియజేశారు. సభ నుంచి బహిష్కరణను, తమ శాసనసభ స్థానాలు ఖాళీ అయినట్టు అసెంబ్లీ కార్యదర్శి వెలువరించిన నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సమర్పించిన వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ బీ శివశంకర్ రావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. గత శుక్రవారం పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు పూర్తిచేయగా.. సోమవారం ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. సభాప్రతిష్ఠను దిగజార్చేవిధంగా ప్రవర్తించిన ఆ ఇద్దరిపై చర్యల కోసం తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత, సభానిర్ణయం మేరకు చర్యతీసుకున్నారు తప్పితే అది స్పీకర్ నిర్ణయం కాదని ప్రకాశ్‌రెడ్డి వివరించారు. తీర్మానం ప్రతి వెబ్‌సైట్‌లో ఇప్పటికే అప్‌లోడ్ అయిందని, ఒకవేళ వారిరువురు తమకు తీర్మానం ప్రతులు అందలేదని చెప్తే వ్యక్తిగతంగా అందచేయడానికి సిద్ధమని కోర్టుకు తెలిపారు. సభలో జరిగిన విషయంపై వీడియో ఫుటేజీలు బయటపెట్టాలంటూ పిటిషనర్లు అడుగడాన్ని ఆయన ప్రశ్నించారు. సభకు విఘాతం కల్పించేలా వ్యవహరించలేదని వారు అనడం లేదని గుర్తుచేశారు. తాము ఇయర్‌ఫోన్ విసరలేదని ఇంతవరకు వారు ప్రకటనే చేయలేదని ఏజీ ప్రకాశ్‌రెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇయర్‌ఫోన్ తగులడం వల్ల శాసనమండలి చైర్మన్‌కు గాయం కాలేదని పిటిషనర్లు అంటున్నారని, సభలో తాము అనైతిక కార్యకలాపాలకు పాల్పడలేదని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వారిద్దరు పేర్కొనలేదని ఏజీ ప్రత్యేకంగా ఎత్తిచూపారు. తాము తప్పు చేశామనే పశ్చాత్తాపం వారిలో లేదని అన్నారు. రాష్ట్ర ప్రథమపౌరుడు, రాజ్యాంగ పరిరక్షకుడి హోదా కలిగిన గవర్నర్ సమక్షంలో చట్టాలు చేసే సభలో అనుచితంగా ప్రవర్తించిన సభ్యులపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సభలో జరిగిన వ్యవహారాల్లో మాత్రమే కాదు.. సభ్యులు సభ వెలుపల చేసే కార్యక్రమాలపైకూడా చర్యలు చేపట్టే అధికారం స్పీకర్‌కు ఉంటుందని వివరించారు. స్పీకర్ నిర్ణయాలపై జోక్యం చేసుకునే అధికారం న్యాయస్థానాలకు ఉండదని తెలియజేశారు. అందుకు సంబంధించిన ఇదివరకటి కేసులను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే బహిష్కరణ తీర్మానాన్ని వారిద్దరూ తమ పిటిషన్‌లో సవాల్ చేయలేదని వివరించారు. కేవలం చైర్మన్‌ను గాయపర్చారనే కారణంగానే కాకుండా.. గవర్నర్ ప్రసంగం సమయంలో అనుచితంగా ప్రవర్తించారనే కారణంతో తీర్మానం ప్రవేశపెట్టి తదుపరి చర్యలకు ఉపక్రమించినట్టు ఏజీ నివేదించారు. ఫుటేజీలను కోర్టుకు సమర్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిపే నిర్ణయంతో తమకు సంబంధం లేదని స్పష్టంచేశారు. సభా తీర్మానం మేరకు బహిష్కరణ వేటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం లేదంటూ నోటిఫై చేసేవరకే అసెంబ్లీ కార్యదర్శి పాత్ర ముగుస్తుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘానిదే పూర్తి అధికారమని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది అవినాష్ దేశాయ్‌ని ఉమ్మడి హైకోర్టు ఆరా తీసింది. వాదోపవాదాలు విన్న తర్వాత తదుపరి ఆదేశాలు జారీచేసేవరకు ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధిస్తున్నట్టు పేర్కొన్నది. దీనిపై దేశాయ్ స్పందిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దాంతో న్యాయస్థానం.. ఆరువారాలపాటు నోటిఫికేషన్‌పై స్టే విధిస్తున్నట్టు తెలిపింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ప్రతివాదులైన అసెంబ్లీ కార్యదర్శి, న్యాయ, శాసనసభా వ్యవహారాల కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శులకు ఆదేశాలు జారీచేసింది. అదేవిధంగా గవర్నర్ ప్రసంగం నాటి మొత్తం వీడియో ఫుటేజీని 22వ తేదీలోగా తమకు అందజేయాలని అసెంబ్లీ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదావేసింది.

విశ్వకర్మలను ఆర్థికంగా ఆదుకుంటాం

స్పీకర్ మధుసూదనాచారి హామీ



సోమవారం అసెంబ్లీలో స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి మహేందర్‌రెడ్డిలకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విశ్వకర్మలకు ఆర్థికంగా చేయూతనిచ్చే ప్రణాళికలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సిద్ధం చేశారని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కులాలతోపాటు విశ్వకర్మలకు ప్రత్యేక నిధులను కేటాయించనున్నారని చెప్పారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన విశ్వకర్మలు సోమవారం అసెంబ్లీలో స్పీకర్ మధుసూదనాచారిని ఆయన చాంబర్‌లో కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వకర్మల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకు విశ్వకర్మల భవన్ నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. విశ్వకర్మల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళుతామని చెప్పారు.

తాండూరులో విశ్వకర్మల భవన్

తాండూరులో విశ్వకర్మలకు ఆధునిక వసతులతో కూడిన భవన నిర్మాణం చేపడుతామని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక విశ్వకర్మలు సూచించిన విధంగా స్థల సేకరణను వారంరోజుల్లో పూర్తిచేస్తామన్నారు. సమావేశంలో శ్రీనివాసచారి, బాలుదారి, రవీందర్‌చారి, వెంకటాచారి, వినోద్‌చారి, తారకచారి, యాదగిరిచారి, నర్సింగచారి పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహించండి

పర్యావరణాన్ని కాపాడండి: స్పీకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కులవృత్తులను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉన్నదని స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. మట్టితో తయారుచేసిన ఫ్లాస్క్‌ను రాష్ట్ర మంత్రి జోగు రామన్న, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ సోమవారం స్పీకర్‌కు ఆయన చాంబర్‌లో అందజేశారు. ఎండాకాలం దృష్ట్యా ఈ ఫ్లాస్క్‌ను రూపొందించామని తాడూరి శ్రీనివాస్ తెలిపారు. త్వరలో ఎమ్మెల్యేలకు ఈ ఫ్లాస్క్‌లను అందజేస్తామని పేర్కొన్నారు.

'మన ఇల్లు- మన కూరగాయలు' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టణ ప్రాంత ఆవాసాల్లో కూరగాయలు పెంచే 'మన ఇల్లు- మన కూరగాయలు' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాంపల్లిలోని ఉద్యానశాఖ శిక్షణ కేంద్రంలో కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో 30 లక్షల ఇండ్లు ఉండగా.. 5 వేల ఇండ్లలో మిద్దెలపైన కూరగాయలు పండిస్తున్నారన్నారు. 'మన ఇల్లు- మన కూరగాయలు' పథకం ద్వారా ప్రతి మనిషికి పోషకపదార్థాలు సక్రమంగా అందుతాయన్నారు. సగటున మనిషి రోజుకు 280 గ్రాముల కూరగాయలను తప్పనిసరిగా ఆహారంలో తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కూరగాయల ఖర్చు, పోషకలోపం, పట్టణాలల్లో స్థలాభావం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇంటి ఆవాసాల్లో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను పండించుకొనేందుకు ఉద్యానశాఖ చర్యలు చేపట్టిందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ వీ విజయదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే కోచ్‌లు పరిశుభ్రంగా ఉండాలి

దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైళ్లలో, రైల్వేస్టేషన్లలో పరిశుభ్రతను పాటించాలని దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రైల్‌నిలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రయాణికులకు సంతృప్తి కలిగేలా కోచ్‌లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. తరచుగా తనిఖీలు చేపట్టి పరిశుభ్రత ప్రమాణాలు పెంచాలని సూచించారు. కాపలా లేని లెవల్ క్రాసింగ్‌ల తొలిగింపు, ప్రమాదరహితంగా రైలుమార్గాల ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు. ప్రధానంగా రైళ్ల సమయపాలన స్థాయిని పెంచాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సికింద్రాబాద్, హైదరాబాద్, గుంతకల్, గుంటూరు, విజయవాడ, నాందెడ్ డివిజన్ రైల్వే మేనేజర్లు పాల్గొన్నారు.

అఖిలభారత సర్వీసు అధికారులకు భాషాపరీక్షలు

- 31 వరకు దరఖాస్తుల స్వీకరణ: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న అఖిల భారత సర్వీసు అధికారులకు వచ్చేనెలలో అర్ధ వార్షిక భాష పండిత పరీక్షలను నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఏప్రిల్ 9 నుంచి 12వ తేదీల మధ్య ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నది. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేయాలని అధికారులను కోరింది. వివరాల కోసం తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

తెలంగాణ మైనారిటీ సంక్షేమ బడ్జెట్ భేష్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో మైనారిటీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జమియతే ఉలేమా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు ప్రశంసించారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ సోమవారం గుంటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు అక్బర్‌హుస్సేన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం షాదీముబారక్ పథకానికి ఆర్థిక సాయం పెంచడం గొప్ప విషయమన్నారు. షాదీముబారక్‌ను చూసి ఆంధ్రాలో చంద్రబాబునాయుడు దుల్హన్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. సమావేశంలో మౌలానా మహబూబ్‌ఖాన్, హాఫీజ్ అబ్బాస్ , హాఫీజ్ అబ్దుర్ రహ్మాన్, హాఫెజ్ ఉస్మాన్ తదితరులు ఉన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్ వద్ద చేనేత కార్మికుల ప్రదర్శన

బతుకమ్మ చీరల ఆర్డర్లపై
సంబురాలు
సిరిసిల్లలో నేతన్నల కృతజ్ఞతా ర్యాలీ

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సిరిసిల్ల నేతన్నలకే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చిన సందర్భంగా ప్రభుత్వానికి చేనేత కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం చేనేత జౌళిశాఖ కార్యాలయం నుంచి నేతన్న చౌక్ వరకు భారీ ర్యాలీ తీసి, నేతన్న విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గతేడాది 40లక్షల చీరల ఆర్డర్లు ఇచ్చారని, ఈ సారి రూ.250 కోట్ల విలువైన కోటి చీరలు ఆర్డర్ ఇవ్వడంతో తమకు ఆరు నెలలపాటు నిరంతర ఉపాధి, నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేలకుపైగా కూలి గిట్టుబాటు అవుతుందని సంబురపడుతున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి ఆదుకుంటున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సల్లంగా ఉండాలని మనసారా ఆకాంక్షించారు.

పాత విధానానికీ సిద్ధమే..
శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి



సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లపై షెడ్యూల్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఒకవేళ న్యాయపర చిక్కులు వస్తాయనే అనుమానముంటే పాత విధానంలోనే చేపట్టేందుకు సిద్ధమని శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లపై షెడ్యూల్ విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఇందుకు విద్యాశాఖ మంత్రి కడియం అంగీకరించారన్నారు. భాషా పండిట్‌లు, పీఈటీల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ఓ నిర్ణయానికి వస్తుందన్నారు. జూన్ 30తో పదో పీఆర్సీ గడువు ముగియనుండగా, ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, త్వరలోనే కమిషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందన్నారు. గురుకులాల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతాయని ఉపాధ్యాయుల్లో కొంత ఆందోళన ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ప్రస్తుతం గురుకులాల్లో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చిన వారే ఉన్నందున ఢోకా లేదన్నారు.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో విద్యార్థినులకు స్వీట్లు పంచుతున్న టీఆర్‌ఎస్వీ నాయకులు



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్ మహిళా నేతలు

కల్యాణకాంతులు

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం పెంపుపై సర్వత్రా హర్షం
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో భాగంగా పేదలకు అందించే సాయాన్ని రూ. 1,00,116కు పెంచుతూ సీఎం కేసీఆర్ సోమవారం అసెంబ్లీ వేదికగా ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. సీఎం నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి నాయకులు, ప్రజలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయగా, పలుచోట్ల స్వీట్లు పంచారు. రాజన్న సిరిసిల్లలో జెడ్పీటీసీ పుర్మాణి మంజుల, ఎంపీపీ శ్రీలత ఆధ్వర్యంలో, తంగళ్లపల్లిలో టీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో, ఆదిలాబాద్‌లో టీఆర్‌ఎస్ మహిళా నేతలు, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, చొప్పదండిలో మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులు, మంచిర్యాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ఆర్గనైజర్ అత్తి సరోజ ఆధ్వర్యంలో, బెల్లంపల్లి కాంటా వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా నవీపేట, సిరికొండలో టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి నాయకులు, స్థానికుల ఆధ్వర్యంలో, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, లింగాలఘనపురం, గుండాల మండల కేంద్రాల్లో టీఆర్‌ఎస్, మహిళా విభాగాల ఆధ్వర్యంలో, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్, ఉప్పునుంతల మండలాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చిత్రపటాలకు టీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పెద్దపల్లిలో టీఆర్‌ఎస్వీ జిల్లా కన్వీనర్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో, రామగుండంలోని మేయర్ క్యాంపు కార్యాలయంలో టీఆర్‌ఎస్ నాయకులు బాలరాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, మైనార్టీ గురుకుల పాఠశాలలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నాయకులు, విద్యార్థులు క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచారు. సూర్యాపేట జిల్లాలో పలుచోట్ల టీఆర్‌ఎస్, అనుబంధ శ్రేణులు, వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లో టీఆర్‌ఎస్ అనుబంధ మహిళా కమిటీల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ రూరల్ జిల్లాలోని రెండు మండలాల్లో సోమవారం సీఎం కేసీఆర్, స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిత్రపటాలకు టీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. సీఎం కేసీఆర్ పేదింటికి పెద్దన్నలా మారారని పలువురు మహిళలు కొనియాడారు. వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ పద్మ తమ క్యాంపు కార్యాలయంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్, టీఆర్‌ఎస్వీ నాయకులు



మంచిర్యాలలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు వసుంధర, ఐసీడీఎస్ ఆర్గనైజర్ అత్తి సరోజ



వరంగల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ అధ్యక్షురాలు పద్మ తదితరులు



నల్లగొండలో పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్
ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాల ఏర్పాటుతో ప్రయోజనం
విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

శివాజీనగర్: నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెండ్లికి ఆర్థిక సాయం అందిస్తూ సీఎం కేసీఆర్ వారికి మేనమామలా అండగా నిలిచారని విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ప్రస్తుతం రూ.75,116లను అందిస్తుండగా సీఎం కేసీఆర్ తాజాగా రూ.లక్షా 116కు పెంచినట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీసులో సోమవారం రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. దీంతోపాటు పెండ్లి రోజే చెక్కులను అందించడం చాలా గొప్పవిషయమన్నారు. పోస్టాఫీసు పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటు ద్వారా ప్రజల ఇబ్బందులు తొలగుతాయన్నారు. వీటి ద్వారా దరఖాస్తు చేసుకున్న వారంలోపే పాస్‌పోర్టు అందిస్తారన్నారు. తెలంగాణకు మొత్తం ఐదు పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎస్పీ రంగనాథ్, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సర్కార్ దేశానికే దిక్సూచి



ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచిందని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధి కోసమే ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించిందన్నారు. రూ.12 వేల కోట్లను రైతులకు పెట్టుబడి సాయం కోసం, రూ.500 కోట్లను పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు కేటాయించినట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచిస్తూ 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్, రైతు వేదికల నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర, విత్తనాలు, ఎరువుల వంటి వాటి సరఫరాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నదని గుత్తా ప్రశంసించారు. ప్రతి నియోజకవర్గంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం ద్వారా.. రైతులకు మద్దతు ధర దక్కేలా రైతు సమన్వయ సమితి కృషి చేస్తుందని చెప్పారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,250 కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆయన వెంట రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నార్మాక్ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, ఎంపీపీ పాశం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రూరల్ జిల్లా మాధన్నపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులకు కండువాలు కప్పుతున్న సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి



రంగారెడ్డి జిల్లా కడ్తాలలో ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కొండ్రిగాని బోడ్ తండా వాసులు


టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. సోమవారం వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం మాధన్నపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు మారపాక నర్సయ్య (గడ్డం నర్సయ్య)తోపాటు మరో 30మంది రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దమున్గల్‌చేడ్ గ్రామంలో 110 మంది కాంగ్రెస్, టీడీపీ నాయకులు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం కొండ్రిగాని బోడ్ తండాకు చెందిన దాదాపు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

సింగరేణి కారుణ్య నియామకాల సర్క్యులర్ జారీ

గోదావరిఖని, నమస్తే తెలంగాణ: సింగరేణి కార్మికులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సీఎం కేసీఆర్, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు, ఎంపీ కవిత చొరవతో ఇటీవలే కారుణ్య నియామకాలకు ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం, తాజాగా మెడికల్ బోర్డులో మరో 10 జబ్బులను అదనంగా చేర్చుతున్నట్టు సోమవారం సర్క్యులర్ జారీ చేసింది. ఇప్పటివరకు ఉన్న జబ్బులకు అదనంగా మరో 10 వ్యాధులను చేర్చడంతో వాటి సంఖ్య 16కు చేరింది. పక్షవాతం, గుండె, కిడ్నీ, కాలేయ, క్యాన్సర్, మెదడుకు సంబంధించి వ్యాధులు, పార్కిన్సన్, అవయవాలు కోల్పోవడం, టీబీ, హెచ్ఐవీ, కుష్ఠు, కీళ్ల నొప్పులు, కంటిచూపు లోపం, మానసిక వ్యాధులు, ఊపిరితిత్తులు బలహీన పరిచే దీర్ఘకాలిక వ్యాధులు, ప్రమాదాలతో గాయపడి ఉద్యోగం చేయలేని స్థితిలో ఉన్న వారు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

కూతురిని చంపి తండ్రి ఆత్మహత్య



లోకయ్య(ఫైల్)



కీర్తన (ఫైల్)

నాగిరెడ్డిపేట: కన్నకూతురిని చెరువులోకి తోసేసి, తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లిలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ఎరుకల లోకయ్య (32), లక్ష్మి దంపతులకు కీర్తన (10), శ్రీవాణి, కొడుకు నరేశ్(ఏడాదిన్నర) సంతానం. మానసిక, శారీరక వికలాంగురాలైన కీర్తన ఐదోతరగతి చదువుతున్నది. మేనమామ, భార్య ఒత్తిడి మేరకు లక్ష్మి రెండో సోదరి గంగామణిని ఈనెల 7న లోకయ్య రెండో పెండ్లి చేసుకున్నాడు. అప్పటినుంచి లోకయ్య మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం ఉగాది జాతరకు వెళ్తున్నానని చెప్పి కూతురు కీర్తనను తీసుకెళ్లాడు. గ్రామ సమీపంలోని చెరువులో కూతురిని తోసి, తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్యచేతిలో భర్త దారుణహత్య



మల్లయ్య (ఫైల్)

జగిత్యాల క్రైం: జగిత్యాలలో భర్తను ఓ భార్య దారుణంగా హతమార్చింది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాలలోని బుడగజంగాల కాలనీకి చెందిన సిరిగిరి మల్లయ్య(60), ఎల్లమ్మ(55) దంపతులకు ఐదుగురు కొడుకులు. అందరి పెండిండ్లు అయ్యి వేర్వేరుగా ఉంటున్నారు. మల్లయ్య, ఎల్లమ్మ ఉగాది సందర్భంగా ఆదివారం మూడో కొడుకు ఇంటికి వెళ్లారు. అక్కడ మద్యం తాగి, రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చారు. కొద్దిసేపటి తర్వాత గొడువపడగా, మనుమరాలు కనుకలక్ష్మి వారించింది. ఎల్లమ్మ అర్ధరాత్రి దాటిన తర్వాత 2గంటలకు పెద్ద కొడుకు సమ్మయ్య ఇంటికెళ్లి, మల్లయ్య రక్తపు మడుగులో పడి ఉన్నాడని చెప్పగా, వెళ్లి చూశాడు. తలకు తీవ్రగాయాలై రక్తపుమడుగులో మల్లయ్య పడి ఉన్నాడు. లోదుస్తులు, వృషణాలు కాలిపోయి ఉన్న విషయాన్ని గుర్తించి తల్లి ఎల్లమ్మనే తండ్రిని హత్య చేసిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వామ్మో.. చిరుతలు

మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చిరుతల దాడులకు మూగజీవాలు బలి
భయాందోళనలో అటవీ ప్రాంత శివారు గ్రామాల వాసులు

మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/జడ్చర్ల, నమస్తేతెలంగాణ: చిరుతపులులు మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల వాసులను వణికిస్తున్నాయి. రోజూ రాత్రిపూట ఎక్కడో చోట గొర్రెలు, పశువుల మందలపై దాడులు చేస్తూ హతమారుస్తున్నాయి. ఫలితంగా అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోతున్నది. నెలరోజుల వ్యవధిలో మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల, లక్ష్మాపూర్, జాన్సిలింగాపూర్, అక్కన్నపేట, తొనిగండ్ల, సుతారిపల్లె తదితర గ్రామాల రైతులకు చెందిన 20 దూడలు, 12 గొర్రెలు, మేకలపై చిరుత దాడి చేసి చంపేసింది. చిరుత ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తుందో తెలియక సదరు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం సాయంత్రం చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లికి చెందిన ధర్మల పెంటయ్యకు చెందిన రెండు మేకలపై దాడి చేసింది. సోమవారం తెల్లవారుజామున రామాయంపేట మండలం కాట్రియాల గ్రామవాసి నారాయణకు చెందిన రెండు గొర్రెలు, కోర మల్లయ్య, బీ మల్లయ్యకు చెందిన ఒక్కో గొర్రె, కాట్రియాల తండా వాసి చందర్‌కు చెందిన ఆవును హతమార్చింది. అయితే బాధితుల ఫిర్యాదులను పరిశీలించిన అటవీ అధికారులు పరిహారం చెల్లిస్తున్నారు. చిరుత దాడిలో మృతి చెందిన మూగ జీవాలకు సంబంధించి ఆయా యజమానులు 8 మందికి కలిపి రూ.90 వేల నష్టపరిహారాన్ని ఇటీవల అందించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో..


కాగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నవాబుపేట మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాల మీదుగా సంచరిస్తున్న చిరుతలు మూగజీవాలను బలితీసుకుంటున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి, కొత్తతండా పరిసర ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతతోపాటు హైనా కదలికలు గతంలోనే రైతులను భయాందోళకు గురిచేశాయి. ఈ నేపథ్యంలోనే మేకలు, పశువులు మృత్యువాతపడ్డాయి. తాజాగా నవాబుపేట మండలం చాకలిపల్లి శివారులోని గిరిజన తండాల్లో చిరుత కదలికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికి పదిసార్లు పశువుల పాకలపై దాడులు చేసి మేకలు, గొర్రెలు, పశువులను బలితీసుకున్నాయి. ఇప్పటివరకు సుమారు పదికిపైగా మూగజీవాలు చనిపోగా, రైతులకు రూ.వేలాది నష్టం జరిగింది. దీనిపై పలుసార్లు జిల్లా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నీర్‌సాబ్‌కుంట, చాకల్‌పల్లి తదితర ప్రాంతాల్లోనూ చిరుత కదలికలు ఉండగా, బోన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

10 సీసీ కెమెరాల ఏర్పాటు..



చిరుతలు దాడి చేసి పశువులను బలితీసుకుంటున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. చిరుతలను బంధించేందుకు అటవీ శాఖ నుంచి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటవీ ప్రాంతంలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎనిమిది చిరుత పులులు ఉన్నట్టు గుర్తించాం. వీటి దాడిలో మృతి చెందిన దూడలు, గొర్రెలు, మేకలకు సంబంధించి బాధితులకు పరిహారాన్ని అందిస్తున్నాం.

—పద్మజారాణి, డీఎఫ్‌వో, మెదక్



మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో చిరుత కోసం ఏర్పాటు చేసిన బోను. (ఇన్‌సెట్‌లో) మంచిర్యాల జిల్లా నక్కలపల్లిలో హతమైన దూడ



దూడను చంపిన పులి

వేమనపల్లి: మంచిర్యాల జిల్లా నీల్వాయి ఫారెస్టు రేంజ్ పరిధిలోని నక్కలపల్లి బీట్ అటవీ ప్రాంతంలో పులి దూడపై దాడి చేసి హతమార్చింది. ఫారెస్టు రేంజర్ అరవింద్ కథనం ప్రకారం.. నక్కలపల్లి గ్రామానికి చెందిన నాయిని పోశంకు చెందిన దూడ ఆదివారం మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లిన దూడ తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం గాలించాడు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన వారు కట్టెల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా అక్కడ దూడ మృతి చెంది ఉన్న విషయాన్ని గమనించి నీల్వాయి ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి సమాచారం అందించారు. రేంజర్ అరవింద్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించారు.

ఖడేకు స్వర్ణం



సింగపూర్: భారత యువ స్విమ్మర్ వీర్‌ధవల్ ఖడే.. సింగపూర్ నేషనల్ ఏజ్ గ్రూప్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిశాడు. పురుషుల 50 మీటర్ల ఫ్రీస్టయిల్ రేసును అతను 23.02 సెకండ్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచాడు. గతంలోనూ ఖడే ఇదే ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 'దేశం తరపున విజయం సాధించడం చాలా సంతోషానిస్తున్నది. నిజాయితీగా చెప్పాలంటే నేను మరింత మెరుగైన టైమింగ్‌ను ఆశించా. సింగపూర్‌లో జరిగే రేసుల నుంచి చాలా విషయాలను నేర్చుకోవచ్చు. రాబోయే నెలల్లో మరింత మెరుగుపడాలి' అని ఖడే పేర్కొన్నాడు. కామన్వెల్త్ గేమ్స్ సన్నాహకాల గురించి మాట్లాడుతూ... 'గత ఐదు నెలలుగా బెంగళూరులో శిక్షణ తీసుకుంటున్నా. సరైన దిశలోనే సన్నాహకాలు సాగుతున్నాయి. నా టైమింగ్ బాగానే ఉంది. క్రమంగా మెరుగుపడుతున్నా. ఈ సమయంలో గాయాలు కాకుండా చూసుకోవాలి. గతంలో రాణించిన అనుభవం ఇప్పుడు ఉపయోగపడుతుంది' అని ఖడే వ్యాఖ్యానించాడు.

అద్వానీ శుభారంభం



యాంగాన్: భారత స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ.. 17వ ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో శుభారంభం చేశాడు. సోమవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో అద్వానీ 4-0తో యో బెక్ షిన్ (సింగపూర్)ను ఓడించాడు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఈ భారత స్టార్ క్యూయిస్ట్, బెస్ట్ ఆఫ్ సెవెన్‌లో 98 బ్రేక్స్, మూడు వరుస సెంచరీలతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో భారత ఆటగాడు రూపేశ్ షా, మార్గారిడో(మలేషియా)ను ఓడించాడు. మహిళల స్నూకర్స్ వ్యక్తిగత విభాగంలో విద్యాపిళ్లై 2-1తో తాండర్ మౌంగ్ (మయన్మార్)పై, అమీ కమానీ 2-0తో ఎంగ్వే (మయన్మార్)పై విజయాలు నమోదు చేశారు.

కెవ్వు..కార్తీక్

కుర్రాళ్లకు దీటుగా రాణిస్తున్న దినేశ్

దూకుడే తారక మంత్రంగా బ్యాటింగ్



కృష్ణకుమార్ దినేశ్ కార్తీక్..అలియాస్ డీకే ఓ అలుపెరుగని క్రికెట్ యోధుడు. వయస్సు పెరిగినా వన్నె తరుగని ఆటతీరుతో అలరిస్తున్న ఆటగాడు. ధోనీ లాంటి దిగ్గజాల నీడలో కెరీర్‌లో ఓ వెలుగు వెలుగకపోయినా..అందివచ్చిన అవకాశాలను అద్భుతంగా ఒడిసిపట్టుకున్న క్రికెటర్. ఏ ఫార్మాట్‌కైనా అతికినట్లు సరిపోయే కార్తీక్..బంగ్లాదేశ్‌తో ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. కోట్లాది మంది అభిమానులు ఊపిరి బిగపట్టుకుని చూసిన నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో బంగ్లాదేశ్ ఆశలను ఆవిరి చేస్తూ ఆఖరి బంతికి సిక్స్‌తో జట్టును గెలుపు సంబురాల్లో నిలిపాడు. విజయంపై విశ్వాసం సన్నగిల్లిన వేళ ..ఒంటిచేత్తో భారత్‌ను గెలుపు తీరాలకు చేర్చి తనలో కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు. మ్యాచ్‌కు అద్భుతమైన ముగింపు పలికి క్రికెట్ ప్రపంచం ప్రశంసలు పొందుతున్న కార్తీక్‌పై ప్రత్యేక కథనం.

(నమస్తే తెలంగాణ క్రీడా విభాగం)

దినేశ్ కార్తీక్ పట్టుదలకు పెట్టింది పేరు. జట్టులో చోటు దక్కినప్పుడు పొంగిపోలేదు, వేటు వేసినప్పుడు కుంగిపోలేదు. అవకాశమిస్తే సత్తాచాటుతానని ఎన్నోసార్లు తనదైన ఆటతీరుతో నిరూపించాడు. దేశవాళీ టోర్నీల్లో దుమ్మురేపినా..అదృష్టం కలిసిరాక జాతీయజట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. అయినా ఏనాడు ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. 2004లో ఇంగ్లండ్‌పై క్రికెట్ మక్కా లార్డ్స్ మైదానంలో భారత్ తరపున అరంగేట్రం చేసినప్పటి నుంచి నిదహాస్ ట్రోఫీ ఫైనల్ వరకు దినేశ్ జట్టు అవసరాలకు తగ్గట్లు తనను మార్చుకున్నాడు. మహేంద్రసింగ్ ధోనీ లాంటి సీనియర్ వల్ల పలుమార్లు అవకాశాలు దక్కకపోయినా..ఏనాడు నిరుత్సాహానికి లోనుకాకుండా జట్టు విజయాల్లో భాగమయ్యాడు. సీనియర్ల గైర్హాజరీలో ముక్కోణపు టోర్నీలో బరిలోకి దిగిన భారత్‌కు వెన్నెముకలా నిలిచాడు. యువకులతో కూడిన ద్వితీయ శ్రేణి జట్టుకు పెద్దన్నగా నిలిచాడు. కెప్టెన్ రోహిత్‌శర్మ నమ్మకాన్ని నిలబెడుతూ తన సామర్థ్యమేంటో చాటిచెప్పాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా తన బ్యాటింగ్ శైలిని మార్చుకోవడంలో కార్తీక్ సఫలమయ్యాడు. కుర్రాళ్లకు తానేమీ తీసిపోనన్నట్లు మూడు పదుల వయస్సులోనూ అలవోకగా భారీ షాట్లు కొట్టిన తీరు అందరినీ ఆశ్చర్యంలో పడేయకమానదు. ఆదివారం నాటి ఫైనల్లో 12 బంతుల్లో 34 పరుగులు అవసరమైనప్పుడు క్రీజులోకొచ్చిన కార్తీక్..ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచి తన ఉద్దేశమేంటో బంగ్లా టైగర్స్‌కు స్పష్టంగా చేసి చూపాడు. ఏ దశలోనూ పట్టువిడవకుండా 19వ ఓవర్ వేసిన రుబెల్ హుస్సేన్ బౌలింగ్‌లో ఏకంగా 22 పరుగులు పిండుకున్నాడు. ఆఖరి ఓవర్లో గెలుపునకు 12 కావాల్సిన దశలో ఓవైపు విజయ్ శంకర్ కనీసం బంతిని బ్యాట్‌కు తాకించేందుకు ఆపసోపాలు పడుతుంటే తాను మాత్రం కొడితే బౌండరీకే అన్నరీతిలో చెలరేగాడు. చివరి బంతికి 5 పరుగులు కావాల్సినప్పుడు సౌమ్య సర్కార్ వేసిన బంతిని కవర్స్‌లో కొట్టిన సిక్స్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు.

కార్తీక్ 3.0: ఒకప్పటి కార్తీక్‌కు ఇప్పటి అతని తీరుకు చాలా తేడా కనిపిస్తున్నది. ఇది వరకటిలా జిడ్డుగా కాకుండా పరిస్థితులకు తగ్గట్లు భారీ షాట్లను అలవోకగా ఆడేస్తున్నాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా జట్టు గెలుపు కోసం తెగించి కొట్లాడేందుకు సిద్ధమవుతున్నాడు. 8 బంతుల్లో 29 పరుగులతో చెలరేగాడు అంటే కార్తీక్ ఆటలో ఎంత విధ్వంసం ఉందో అర్థమవుతున్నది. చెత్త షాట్లకు పోకుండా బంతి గమనానికి తగ్గట్లు తన శైలిని మార్చుకుంటూ తనలో కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు ఈ తమిళనాడు సీనియర్ క్రికెటర్. దీని వెనుక ఎంతో శ్రమ దాగి ఉందని మ్యాచ్ ముగిసిన అనంతరం కార్తీక్ అన్నాడు. ఈ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ తనపై నమ్మకముంచి అన్ని విధాలా సహకరించిందని చెప్పుకొచ్చాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా వన్డేలు, టీ20ల్లో గత ఎనిమిది నెలల కాలంలో కార్తీక్ నాటౌట్‌గా నిలిచిన సందర్భాలు అనేకం. ఏ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చినా..ఒదిగిపోతూ అవసరాలకు అనుగుణంగా బ్యాటింగ్ చేయడంలో దినేశ్ ఆరితేరాడు. ఇలా బ్యాటింగ్ వరకే పరిమితం గాకుండా వికెట్ కీపింగ్‌లోనూ యువ కీపర్లకు సవాలు విసురుతున్నాడు. రానున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాలు చేస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్‌కు కార్తీక్ రూపంలో మంచి మ్యాచ్ ఫినిషర్ దొరికాడని చెప్పొచ్చు.

నాయర్ మార్చేశాడు: దినేశ్ కార్తీక్ కెరీర్‌ను అభిషేక్ నాయర్ మార్చేశాడు. బాల్యాన్ని మధ్య ప్రాచ్య దేశాలతో పాటు చెన్నైలో కార్తీక్ ఒకింత విలాసవంతంగా గడిపాడు. అయితే క్రికెట్‌గా కెరీర్‌ను ఆరంభించిన మొదట్లో నాయర్‌తో కలిసి ముంబైలో ఓ చిన్న ఇంట్లో దినేశ్ ఉండాల్సి వచ్చింది. అంతగా వసతులు లేని ఆ ఇంట్లో అన్నింటికీ సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హోటల్లో ఉండేందుకు కార్తీక్ ఆసక్తి చూపించినా.. దానికి నాయర్ ఒప్పుకోలేదు. దీంతో పాటు అతని శిక్షణ పద్ధతులను కూడా అభిషేక్ పూర్తిగా మార్చేశాడు. ఫిట్‌నెస్, స్ట్రోక్ ప్లే, మానసిక సంసిద్ధత తదితర అంశాల్లో కార్తీక్‌ను కోచ్‌లు సాన బట్టారు. నమ్మకాలపై అతిగా ఆధారపడే కార్తీక్ క్రమేపీ వాటికి దూరంగా ఉండటం మొదలుపెట్టాడు. ఫలితంగా ఓ సీజన్‌లో 14 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 704 పరుగులతో సత్తాచాటాడు. మళ్లీ వెనుదిరిగి చూడకుండా తన ఆటకు మరింత మెరుగులు అద్దుకున్నాడు. జాతీయజట్టులో చోటు ఉన్నా లేకున్నా అధైర్య పడకుండా అందివచ్చిన అవకాశాలను ఒడిసిపట్టుకుంటూ రాణిస్తున్నాడు. భవిష్యత్తులోనూ ఇదే జోరు కొనసాగిస్తే..భారత్‌కు మిడిలార్డర్ కష్టాలు తీరినట్లే.

కార్తీక్.. ఎప్పుడైనా సిద్ధమే!

ఆ షాట్లు అతనికే సొంతమన్న రోహిత్



కొలంబో: మ్యాచ్‌లో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు తలెత్తినా.. వాటిని ఎదుర్కొనేందుకు దినేశ్ కార్తీక్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడని కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. తన అనుభవం, నైపుణ్యం మ్యాచ్‌ను ఫినిష్ చేసేందుకు చక్కగా సరిపోతాయన్నాడు. 'దక్షిణాఫ్రికాలో మాతో పాటే పర్యటించాడు. కానీ ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. అయినప్పటికీ ఫైనల్లో అతను ఆడిన తీరు అత్యద్భుతం. ఈ ఇన్నింగ్స్ అతనిలో చాలా నమ్మకాన్ని పెంచింది. అన్నింటి కంటే ఎక్కువగా తనను తాను బాగా నమ్ముతాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకెళ్లినా.. చివర్లో ఆడినా కచ్చితంగా ప్రభావం చూపుతాడు. ఇలాంటి వ్యక్తే జట్టుకు కావాలి' అని రోహిత్ పేర్కొన్నాడు. మ్యాచ్‌ను ఫినిష్ చేయడం కోసమే కార్తీక్‌ను ఆర్డర్‌లో వెనక్కి పంపామని తన నిర్ణయాన్ని కెప్టెన్ సమర్థించుకున్నాడు. అయితే ఆరో నంబర్‌లో బ్యాటింగ్‌కు వెళ్లకపోవడంతో అతను ఆందోళనపడ్డాడని చెప్పాడు. 'నేను 13వ ఓవర్‌లో ఔటయ్యా. వెంటనే కార్తీక్ రావాలి. కానీ శంకర్‌కు అవకాశం ఇచ్చా. దీనికి దినేశ్ కాస్త నొచ్చుకున్నాడు. వెంటనే నేను వెళ్లి.. మ్యాచ్ ఫినిషింగ్‌ను నీవే చేయాలని చెప్పా. నీకున్న నైపుణ్యం చివరి మూడు, నాలుగు ఓవర్లలో చాలా అవసరం' అని రోహిత్ వివరించాడు.

వారెవ్వా.. ఏం షాట్లు

కార్తీక్ ఆడిన షాట్లపై కెప్టెన్ ప్రశంసల వర్షం కురిపించాడు. '18, 20వ ఓవర్ ముస్తాఫిజుర్ వేస్తాడని భావించాం. అతని నిలువరించాలంటే అనుభవజ్ఞుడు కావాలి. కానీ రూబెల్, సౌమ్య బౌలింగ్‌లో దినేశ్ కొట్టిన ఆఫ్ కట్టర్లు సూపర్బ్. ఏడో నంబర్‌లో అతన్ని బ్యాటింగ్‌కు పంపాలన్న మా నిర్ణయం కరెక్ట్ అని రుజువైంది' అని ఈ ముంబైకర్ వెల్లడించాడు.

ఆ సిక్స్ చూడలేదు..

ఆఖరి బంతికి కార్తీక్ కొట్టిన సిక్స్‌ను తాను చూడలేదని రోహిత్ చెప్పాడు. 'చివరి ఓవర్‌లో ఆఖరి రెండు బంతులకు ఐదు పరుగులు కావాలి. ఐదో బంతిని గాల్లోకి లేపి శంకర్ ఔటయ్యాడు. ఇక మిగిలింది ఒక్క బంతి. దీనికి ఐదు పరుగులు రావాలి. క్రీజులో కార్తీక్ ఉన్నాడు కాబట్టి ఎలాగైనా ఫోర్ కొడతాడని భావించా. దీంతో మ్యాచ్ డ్రా అయితే సూపర్ ఓవర్‌కు దారి తీస్తుంది. సూపర్ ఓవర్‌లో నేనే బ్యాటింగ్‌కు దిగాలని భావించి ప్యాడ్లు కట్టుకోవడానికి లోపలికి వెళ్లా. కానీ కార్తీక్ ఏకంగా సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించేశాడు. అందుకే డ్రెస్సింగ్ రూమ్‌లోనే ఉన్నా ఆ సూపర్ సిక్సర్‌ను చూడలేకపోయా' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.

ఫెదరర్‌కు షాక్

ఫైనల్లో డెల్‌పోట్రో సంచలన విజయం

ఇండియానావెల్స్ ట్రోఫీ కైవసం



ఇండియానావెల్స్: టాప్ సీడ్ రోజర్ ఫెదరర్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. 2018లో వరుసగా 17 విజయాలు నమోదు చేసిన స్విస్ దిగ్గజానికి ఇండియానావెల్స్ ఫైనల్లో ఊహించని షాక్ తగిలింది. వరుస వైఫల్యాలు, ఫిట్‌నెస్ సమస్యలతో కెరీర్‌నే ప్రశ్నార్థకం చేసుకున్న అర్జెంటీనా ఆటగాడు డెల్‌పొట్రో.. ఏకంగా ఫెదరర్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో డెల్‌పోట్రో 6-4, 6-7 (8/10), 7-6 (7/2)తో ఫెదరర్‌ను ఖంగుతినిపించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన డెల్‌పోట్రో తొలి సెట్‌ను కాసింత సులువుగానే దక్కించుకున్నాడు. అయితే రెండో సెట్‌లో స్విస్ దిగ్గజం నుంచి గట్టి పోటీ ఎదురైంది. టై బ్రేకర్‌లో 8-7 వద్ద ఉన్నపుడు డెల్‌పోట్రో అనవసర తప్పిదాల వల్ల మూడు మ్యాచ్ పాయింట్లు చేజార్చుకున్నాడు. దీంతో మ్యాచ్ మూడో సెట్‌కు దారితీసింది. మూడో సెట్‌లో ఇద్దరూ పదునైన సర్వీస్‌లతో ఆకట్టుకున్నారు. అయితే ఫెదరర్ అద్భుతమైన బ్యాక్ హ్యాండ్‌తో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-4 ఆధిక్యంలోకి వచ్చాడు. రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నట్టైతే ఫెదరర్ రేసులోకి వచ్చేవాడు. కానీ డెల్‌పోట్రో దూకుడుతో మ్యాచ్ టై బ్రేకర్‌కు దారితీసింది. టై బ్రేకర్‌లో ఫెదరర్ రెండు డబుల్ ఫాల్ట్స్ చేయడంతో ప్రత్యర్థి 6-1 ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. ఆ తర్వాత ఫెదరర్ ఫోర్‌హ్యాండ్ షాట్‌కు చెక్ పెట్టి మూడో మ్యాచ్‌పాయింట్‌ను సాధించడం ద్వారా డెల్‌పోట్రో విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఇండియానావెల్స్ ట్రోఫీని గెలువడం డెల్‌పోట్రోకు ఇదే తొలిసారి. తాజా విజయంతో ఇతడు 2014 తర్వాత తొలిసారిగా టాప్ టెన్‌లో స్థానం దక్కించుకున్నాడు. ఎడమ చేతి మణికట్టు సర్జరీ తర్వాత ఈ ట్రోఫీ గెలువడం ఎంతో ఆనందంగా ఉందన్నాడు

> టై బ్రేకర్‌లో నేను ఆశించిన స్థాయిలో సర్వ్ చేయలేకపోయాను.అతడు చక్కగా ఆడాడు. నేను పూర్తి స్థాయి ఆటతీరు చూపించలేకపోయాను. కొన్నిసార్లు మ్యాచ్ మన ఆధీనంలోనే ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ ఆ ఊపు ప్రత్యర్థి చేతుల్లోకి ఎలా వెళుతుందో అర్థం కాదు. -ఫెదరర్


డెల్‌పోట్రో

కామన్వెల్త్ గేమ్స్‌కు బోల్ట్



సిడ్నీ: జమైకన్ చిరుత, దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ వచ్చే నెలలో జరుగబోయే కామన్వెల్త్ గేమ్స్‌కు సిద్ధమయ్యాడు. అది కూడా వంద మీటర్ల పరుగు పందెం కోసం సన్నద్ధమవుతున్నాడు. బోల్ట్ రిటైర్ అయ్యాడు కదా..? మళ్లీ ఎందుకు వెళుతున్నాడని ఆశ్చర్యపోకండి. బోల్ట్ ఒక అథ్లెట్‌గా కాదు, ప్రేక్షకుడిగానే వెళ్లనున్నాడు. ఈ విషయాన్ని జమైకన్ చాంపియన్ యొహన్ బ్లేక్ తెలిపాడు. గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్ 4 నుంచి 15 వరకు జరుగబోయే కామన్వెల్త్ గేమ్స్‌లో బ్లేక్ పాల్గొంటున్నాడు. వంద మీటర్ల పరుగు పందెంలో పాల్గొనబోతున్న బ్లేక్ ఆదివారం సిడ్నీకి వెళ్లాడు. అయితే తాను జమైకా నుంచి వచ్చేటపుడు బోల్ట్ ట్రాక్‌పై కనిపించాడని, ఆస్ట్రేలియాలో విజయం సాధించకపోతే సమస్యలు తలెత్తుతాయంటూ సూచనలు చేసినట్టు తెలిపాడు. తమలాంటి వారి కోసం బోల్ట్ ఆట నుంచి తప్పుకుని అవకాశాలు కల్పించాడని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తానని 100, 200 మీటర్ల ప్రపంచ రికార్డు హోల్డర్ బ్లేక్ చెప్పాడు. బోల్ట్ గత ఏడాది ఆగస్టులో ఆటకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో కనిపించడం..ఆస్ట్రేలియా క్రికెటర్లకు వికెట్ల మధ్య పరిగెత్తడంలో శిక్షణ ఇవ్వడం, ఇతరత్రా కార్యక్రమాలతో బిజీగా గడుపుతున్నాడు.

అర్హతకు అడుగు దూరంలో విండీస్


సామ్యూల్స్ (86)

హరారే: వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌నకు అర్హత సాధించేందుకు వెస్టిండీస్ మరో అడుగు దూరంలో ఉంది. సోమవారం జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో విండీస్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో విండీస్ ప్రస్తుతం 6 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నది. జింబాబ్వే నిర్దేశించిన 290 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి అందుకుంది. సామ్యూల్స్(86), హోప్(76), లెవిస్(64) అర్ధ సెంచరీలతో రాణించారు. ముజర్బానీ(2/36), క్రెమర్(2/63) రెండేసి వికెట్లు తీశారు. తొలుత టేలర్(138) సెంచరీతో జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 289 పరుగులు చేసింది. హోల్డర్(4/35), రోచ్(3/55)..జింబాబ్వేను కట్టడిచేశారు. అర్ధసెంచరీతో జట్టు గెలుపులో కీలకమైన సామ్యూల్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బుధవారం స్కాట్లాండ్‌తో విండీస్ తలపడుతుంది.

రెండో ర్యాంక్‌లో చాహల్



దుబాయ్: ముక్కోణపు టీ20 సిరీస్‌లో విశేషంగా రాణించిన భారత స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, వాషింగ్టన్ సుందర్.. ఐసీసీ ర్యాంకింగ్స్‌ను కూడా గణనీయంగా మెరుగుపర్చుకున్నారు. సోమవారం విడుదల చేసిన తాజా జాబితాలో లెగ్ స్పిన్నర్ చాహల్ 12 స్థానాలు ఎగబాకి రెండో ర్యాంక్‌లోకి చేరుకున్నాడు. కెరీర్ అత్యుత్తమ రేటింగ్ పాయింట్ల (706)ను కూడా సమకూర్చుకున్నాడు. సుందర్ (496 పాయింట్లు) 151 స్థానాలు మెరుగుపర్చుకుని 31వ ర్యాంక్‌లోకి వచ్చాడు. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఎక్కువగా పవర్‌ప్లేలో బౌలింగ్ చేసిన సుందర్ 5.70, చాహల్ 6.45 ఎకానమీతో ఆకట్టుకున్నారు. జైదేవ్ ఉనాద్కట్ (435 పాయింట్లు), శార్దూల్ ఠాకూర్ (358 పాయింట్లు) సంయుక్తంగా వరుసగా 52, 76వ ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ 8వ ర్యాంక్‌లో ఉండగా, లోకేశ్ రాహుల్ 12వ, రోహిత్ శర్మ 13వ, శిఖర్ ధవన్ 17వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 124 రేటింగ్ పాయింట్లతో మూడోస్థానంలో ఉంది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా చెరో 126 పాయింట్లతో టాప్-2లో ఉన్నాయి.

'ప్రాక్టీస్'లో భారత్-ఏ ఓటమి

ముంబై: ముక్కోణపు టీ20 సిరీస్ నేపథ్యంలో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత మహిళల ఏ జట్టుకు ఓటమి ఎదురైంది. సోమవారం జరిగిన ఈ వామప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 45 పరుగుల తేడాతో గెలిచింది. ఈ సిరీస్‌లో మూడో జట్టుగా ఆస్ట్రేలియా బరిలోకి దిగుతున్నది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 176/4 స్కోరు చేసింది. బీమోంట్ (41 బంతుల్లో 57 నాటౌట్), కెప్టెన్ హీథర్ నైట్ (24 బంతుల్లో 52), బ్రయోని స్మిత్ (38 బంతుల్లో 50) అర్ధసెంచరీలతో చెలరేగారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. హేమలత (41), వనిత (23), రొజారియో (10), రాధా యాదవ్ (17) మెరుగ్గా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో శ్రుబ్‌సోలే, ఫరాంట్ చెరో 2 వికెట్లు తీశారు.

ముంబై ఇండియన్స్ జట్టులో మెక్లీనగన్



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ జట్టులో ఒక్క మార్పు చోటు చేసుకుంది. వెన్ను నొప్పితో బాధపడుతున్న ఆసీస్ పేసర్ జాసన్ బెహ్రెన్‌డార్ఫ్ స్థానంలో కివీస్ పేసర్ మిచెల్ మెక్లీనగన్‌ను తీసుకుంది. ఈ మేరకు ఐపీఎల్ టెక్నికల్ కమిటీ దీనికి ఆమోద ముద్ర వేసింది. ఈ ఏడాది జనవరిలో జరిగిన వేలంలో బెహ్రెన్‌డార్ఫ్‌ను ముంబై కోటిన్నరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అయితే వెన్నునొప్పితో అతను లీగ్ మొత్తానికే దూరం కావడంతో ఈ మార్పు అనివార్యమైంది. గత మూడు సీజన్లు కూడా మెక్లీనగన్ ముంబై ఇండియన్స్‌కే ప్రాతినిధ్యం వహించాడు. కానీ ఈసారి వేలంలో అతన్ని ఎవరూ తీసుకోలేదు. అయితే ఇప్పుడు కోటి రూపాయల ఒప్పందంతో మళ్లీ ముంబై జట్టులోకి వచ్చాడు.

ఐదు గంటల విచారణ


రబాడ

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడ చేసుకున్న రెండు మ్యాచ్ నిషేధం అప్పీల్‌పై సోమవారం సుదీర్ఘంగా విచారణ జరిగింది. దాదాపు ఐదు గంటల పాటు పేసర్‌ను విచారించినట్లు సమాచారం. న్యూజిలాండ్‌కు చెందిన జ్యుడీషియల్ కమిషనర్ మైకేల్ హెరాన్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఈ విచారణ జరిపారు. 48 గంటల తర్వాత అంటే బుధవారం దీనిపై తుది తీర్పును వెల్లడించనున్నారు. విచారణకు ముందు సఫారీ జట్టు కెప్టెన్ డుప్లెసిస్.. రబాడతో సమావేశమయ్యాడు. టీమ్ మేనేజర్ మహ్మద్ ముసాజీ, న్యాయవాది డాలి ఎంపోయా ఈ విచారణలో పాల్గొన్నారు. పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన రెండో టెస్టు సందర్భంగా ఆసీస్ కెప్టెన్ స్మిత్‌ను ఉద్దేశపూర్వకంగా భుజంతో గుద్దినందుకు రబాడకు మూడు డీమెరిట్ పాయింట్లు విధించారు. ఓవరాల్‌గా అతని ఖాతాలో 8 డీమెరిట్ పాయింట్లు ఉండటంతో రెండు మ్యాచ్‌ల నిషేధం అనివార్యమైంది.

ఆల్ ఇంగ్లండ్ చాంప్ యుక్వి

బర్మింగ్‌హామ్: బ్యాడ్మింటన్ యోధుడు లిన్‌డాన్‌కు యువ సంచలనం షి యుక్వి షాక్ ఇచ్చాడు. ఆల్‌ఇంగ్లండ్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో యుక్వి 21-19, 16-21, 21-19తో డాన్‌ను ఓడించాడు. డాన్ ఈ మ్యాచ్‌లో తన సహజసిద్ధమైన దూకుడును కనబరచలేకపోవడం..యుక్వికి కలిసొచ్చింది. ఇద్దరూ డ్రాప్ షాట్లు, పదునైన స్మాష్‌లతో పోరాడారు. చివరి గేమ్‌లో కుర్రాడి దూకుడు ముందు డాన్ తేలిపోయి మ్యాచ్ సమర్పించుకున్నాడు.

షమీ నాకు తెలుసు: అలీషాబా



న్యూఢిల్లీ: పేసర్ మహ్మద్ షమీ కేసులో మరో మలుపు. మ్యాచ్ ఫిక్సింగ్ కోసం తన నుంచి డబ్బులు తీసుకున్నాడని వస్తున్న ఆరోపణలపై పాకిస్థాన్ యువతి అలీషాబా ఎట్టకేలకు స్పందించింది. షమీ తనకు తెలుసని, చాలా రోజుల నుంచి పరిచయం ఉందని ఆమె వెల్లడించింది. 'అవును నేను షమీని కలిశా. దుబాయ్‌లో ఉండే మా సోదరిని కలిసేందుకు నేను తరచుగా అక్కడికి వెళ్తుంటా. ఓ సెలబ్రిటీగా షమీని చాలా ఇష్టపడుతా. అందరిలాగే అతన్ని కలువాలని కోరుకున్నా. అందులో తప్పేమి ఉంది. జహన్ ఆరోపిస్తున్నట్లుగా మా మధ్య భారీ ఒప్పందాలేమీ జరుగలేదు. దక్షిణాఫ్రికా టూర్ ముగించుకుని షమీ దుబాయ్ మీదుగా వస్తున్నాడని తెలిసింది. నేను అదే సమయంలో అక్కడికి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు కలిశాం' అని అలీషాబా పేర్కొంది. తాను, షమీ కేవలం స్నేహితులం మాత్రమేనని చెప్పిన అలీషాబా.. అతనితో రూమ్ పంచుకున్నట్లు వస్తున్న వార్తలను ఖండించింది. 'అబద్ధాలు చెప్పలేని వ్యక్తి దేశానికి ద్రోహం చేస్తాడా? అతనికి ఉన్న లక్షల మంది ఫాలోవర్స్‌లో నేను ఒకదానిని. తరచు మెసేజ్‌లు పంపుతాను. దుబాయ్‌లో కలిసి ఓ రోజు అతనితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశా. కానీ రూమ్‌కు వెళ్లలేదు. మా మధ్యలో ఆర్థిక లావాదేవీలు కూడా జరుగలేదు. ఈ విషయాన్ని ఎక్కడైనా ధైర్యంగా చెబుతా' అని అలీషాబా వెల్లడించింది. మరోవైపు సోమవారం ఉదయం షమీపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించి రహస్య వాంగ్మూలాన్ని కోర్టుకు సమర్పించింది. కోల్‌కతాలోని అలిపోర్ కోర్టుకు హాజరైన ఆమె న్యాయమూర్తి ముందు తన వాదనలను వినిపించింది. ఆ తర్వాత కాళీఘాట్‌కు వెళ్లి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలిసేందుకు లిఖితపూర్వక దరఖాస్తును అందజేసింది.

బాస్టిన్, ఇవనోవిచ్‌కు పుత్రోత్సాహం





బెర్లిన్: జర్మనీ మాజీ సాకర్ స్టార్ బాస్టియన్ స్వీన్‌స్టీగర్, సెర్బియా టెన్నిస్ క్వీన్ అనా ఇవనోవిచ్ తల్లిదండ్రులయ్యారు. ఆదివారం ఇవనోవిచ్ పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా తన ఆనందాన్ని అభిమానులతో సోషల్ మీడియా ద్వారా పంచుకున్నది. 'కొత్త ప్రపంచంలోకి కుమారునికి స్వాగతం పలుకుతున్నాను. మాటల్లో వర్ణించలేనంత ఆనందంగా ఉంది' అని ఇవనోవిచ్ ట్విట్టర్‌లో రాసుకొచ్చింది. టెన్నిస్ ప్రపంచాన్ని తనదైన ఆటతీరుతో అలరించిన ఈ సెర్బియన్ స్టార్..2016లో స్వీన్‌స్టీగర్‌ను పెండ్లి చేసుకున్న సంగతి తెలిసిందే.

వాట్సాప్ ద్వారా మన కంప్యూటర్లలోకి చైనా చొరబాటు


• వెల్లడించిన భారత సైన్యం



బెంగళూరు, మార్చి 19: భారత్‌లోని కంప్యూటర్లను హ్యాక్ చేసేందుకు చైనా హ్యాకర్లు వాట్సాప్‌ను మార్గంగా వాడుకుంటున్నారని భారతీయ సైన్యం తెలిపింది. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేసిన సైన్యం.. సోషల్ మీడియా వాడకంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించింది. దేశ సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) పరిధిలో విధులు నిర్వహిస్తున్న సైన్యం.. వాట్సప్‌తోపాటు ఇతర సోషల్ మీడియా వేదికల వినియోగంపై జాగ్రత్త వహించాలని పేర్కొన్నది. చైనీయులు డిజిటల్ ప్రపంచంలోకి చొచ్చుకెళుతున్నారని సైన్యం అధికారిక ట్విట్టర్ నుంచి అడిషినల్ డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ ఇంటర్ ఫేస్ (ఏడీజీపీఐ) ఒక వీడియోను ట్వీట్ చేశారు. +86తో మొదలయ్యే ఫోన్ నంబర్ల ద్వారా వాట్సప్‌లను ఉపయోగించుకుని భారత కంప్యూటర్లను చైనీయులు హ్యాక్ చేస్తున్నారని తెలిపారు. +86 నంబర్‌తో కూడిన ఫోన్ నంబర్లను గ్రూపులో చేర్చుకునే ముందు అప్రమత్తంగా ఉండాలని ఆ వీడియో హెచ్చరించింది. మొబైల్ ఫోన్ వినియోగదారులు తమ సిమ్‌ను మారిస్తే పాతదాన్ని పూర్తిగా ధ్వంసం చేయాలని సూచించింది.

కొనసాగుతున్న కేజ్రీవాల్ 'సారీ'లు!

గడ్కరీ, సిబల్‌లకు క్షమాపణలు



న్యూఢిల్లీ, మార్చి 19: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యవహార శైలి మారింది. పది రోజుల క్రితం శిరోమణి అకాలీదళ్ నేతకు క్షమాపణలు చెప్పిన కేజ్రీవాల్... తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ కుమారుడు అమిత్ సిబల్‌కు సారీ చెప్తూ లేఖలు రాశారు. తాను ఎలాంటి నిర్ధారణ చేసుకోకుండానే గడ్కరీపై కొన్ని వ్యాఖ్యలు చేశానని కేజ్రీవాల్ లేఖలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గడ్కరీకి లేఖ ద్వారా విన్నవించడమే కాకుండా తనపై దాఖలైన పరువునష్టం కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టుకు కూడా తెలిపారు. పరువునష్టం దావాలో ఇద్దరమూ ఓ అంగీకారానికి వచ్చామని, కేసును వెనకకు తీసుకుంటున్నట్లు గడ్కరీ, కేజ్రీవాల్ సంయుక్తంగా కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. 'మీపై నేను కొన్ని వ్యాఖ్యలు చేశాను. నిర్ధారించుకోకుండా చేసిన వ్యాఖ్యలు మిమ్మల్ని బాధపెట్టడం వల్లనే నాపై పరువునష్టం దావా వేశారని భావిస్తున్నాను. మీతో నాకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదు. నా వ్యాఖ్యల పట్ల నేను విచారం వ్యక్తం చేస్తున్నాను' అని గడ్కరీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఫలితంగా సోమవారం నాడు హైకోర్టులో ఇద్దరు కలిసి కేసును ఉపసంహరించుకుంటున్నట్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇలాఉండగా, మరో క్రిమినల్ పరువునష్టం దావాలో కపిల్ సిబల్ కుమారుడు, సీనియర్ న్యాయవాది అమిత్ సిబల్‌కు కూడా కేజ్రీవాల్, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా క్షమాపణలు చెప్పారు. ఇదే విషయాన్ని ఢిల్లీ హైకోర్టుకు కూడా ఉమ్మడిగా విన్నవించారు.

పొగాకు వాడకంపై నన్ను ఎవరైనా హెచ్చరించి ఉంటే బాగుండేది!



• ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ ఆవేదన

ముంబై, మార్చి 19: పొగాకు, సుపారీ వాడినందుకు విచారపడుతున్నానని, 40 ఏండ్ల క్రితం ఎవరైనా ఈ అలవాటు మానుకోవాలని హెచ్చరించి ఉంటే బాగుండేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్‌పవార్ అభిప్రాయపడ్డారు. 2022 నాటికి నోటి క్యాన్సర్‌ను నిర్మూలించాలనే లక్ష్యంతో సోమవారం ముంబైలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) మిషన్ నిర్వహించిన సదస్సులో క్యాన్సర్ బారిన పడి దానినుంచి విజయవంతంగా బయటకొచ్చిన పవార్ మాట్లాడారు. ఆపరేషన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డానని, కొన్ని దంతాలు కూడా తొలగించారని, మాట్లాడటం, భోజనం చేయడం, నోరు ఎక్కువగా తెరువడం కూడా కష్టంగా ఉండేదని ఆయన పేర్కొన్నారు. పొగాకు అలవాటు శాపంగా మారిన లక్షల మంది భారతీయుల మాదిరిగా తాను కూడా బాధ పడ్డానని, పొగాకు వినియోగం అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించానని అన్నారు. నోటి క్యాన్సర్ల నిర్మూలన కోసం పనిచేస్తున్న ఐడీఏకు అందరూ మద్దతు ఇవ్వాలని, పొగాకు వాడకాన్ని మానివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సోమవారం డెన్మార్క్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్ఎస్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు శ్యాంబాబు తదితరులు

మోదీ ముక్త్ భారత్‌కు రాజ్ ఠాక్రే పిలుపు



ముంబై, మార్చి 19: మోదీ ముక్త్ భారత్‌కు, ప్రతిపక్షాల ఐక్యత కోసం మహారాష్ట్ర నవనిర్మాణ సేన నాయకుడు రాజ్ ఠాక్రే పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ చేస్తున్న అబద్ధపు వాగ్దానాలతో దేశం విసిగిపోయిందన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పీడ వదిలించేందుకు, మోదీ లేని భారత్‌ను చూసేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యం కావాలని అన్నారు. భారత్‌కు 1947లో మొదటిసారి, ఎమర్జెన్సీ అనంతరం 1977లో రెండోసారి స్వాతంత్ర్యం వచ్చిందని, మోదీని వదిలించుకుంటే 2019లో మూడో స్వాతంత్ర్యం వస్తుందని రాజ్‌ఠాక్రే వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశాన్ని ఎన్నికల నినాదంగా మార్చరాదని చెప్పారు. మోదీ పర్యటించిన దేశాలలో ఎక్కడి నుంచీ పెట్టుబడులు రాలేదని, ఆయన పకోడీల తయారీకి పిండికోసం వెళ్లినట్టుందని ఎద్దేవా చేశారు. సినీ నటి శ్రీదేవి దేశం కోసం ఏం చేశారని, ఆమెకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మీడియా, న్యాయవ్యవస్థను, సీబీఐ వంటి సంస్థలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

వందకోట్ల కేటాయింపు కేసీఆర్ ఉగాది కానుక

• ఎన్నారైశాఖకు నిధులపై హర్షం

E Sరాటాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నారైశాఖకు రూ. వంద కోట్లు కేటాయించడం పట్ల టీఆర్ఎస్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు శ్యాంబాబు ఆకుల హర్షం వ్యక్తంచేశారు. ఇది తెలంగాణ ఎన్నారైలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఉగాది కానుక అని అభివర్ణించారు. డెన్మార్క్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, ఎంపీ కవిత, ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులను గల్ఫ్ ఎన్నారైల సంక్షేమం కోసం వినియోగించాలని కోరారు. డెన్మార్క్, ఫిన్లాండ్, స్వీడన్, నార్వే, ఆస్ట్రియా, పోలాండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, ఐర్లాండ్ దేశాల్లోని విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వీటిని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ ప్రసాదరావు కల్వకుంట్ల, ఉపాధ్యక్షుడు సతీశ్ గామినేని, జయచందర్ గంటల, చంద్రశేఖర్ వెన్నుపురెడ్డి, సురేశ్ కట్ట, శివ, చందు పల్లె, సంతోష్ గంజి పాల్గొన్నారు.

నేడు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ మంగళవారం సమావేశం కానున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన త్రిసభ్య కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించాలని భావిస్తున్నారు. రెండు ప్రాజెక్టుల్లో నీటి వాడకంపై ఏపీ, తెలంగాణ మధ్య చర్చలు సాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకొన్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన సైతం నీటి వినియోగంపై ఏపీ ఇండెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కృష్ణా బోర్డు సైతం వత్తాసు పలుకుతున్నదనే ఆరోపణలున్నాయి. మన రాష్ట్రం మాత్రం శ్రీశైలం నీటి వాడకంపై అభ్యంతరాలేమీ చెప్పడం లేదు. కానీ నాగార్జునసాగర్‌లో మాత్రం ఎండీడీఎల్ దిగువన నీటిని వినియోగిస్తామంటే అంగీకరించబోమని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల అధికారులతో కృష్ణాబోర్డు సమావేశం గత వారం నుంచి వాయిదా పడుతూవస్తున్నది. రెండు రాష్ట్రాల ఈఎన్సీలతోపాటు కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి మంగళవారం నాటి సమావేశంలో పాల్గొంటారు.

ఘనవ్యర్థాల నిర్వహణకు త్వరలో మార్గదర్శకాలు

• పట్టణాల్లో సమగ్ర సర్వే: పురపాలక ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఘన వ్యర్థ పదార్థాల సేకరణ, నిర్వహణకు నిబంధనలు రూపొందిస్తున్నామని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం గతంలోనే ఘన వ్యర్థ పదార్థాల సేకరణ, నిర్వహణపై ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. సోమవారం సచివాలయంలో పురపాలకశాఖ రాష్ట్రస్థాయి సలహాబోర్డు సమావేశంలో చెత్తసేకరణ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై చర్చించారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా నుంచి ఇప్పటికే మార్గదర్శకాలు రూపొందించాలని సూచించామని.. దీనికి ఈ రంగాల్లో ఇప్పటికే ఉన్న స్టేక్ హోల్డర్ల నుంచి వివరాలు తీసుకోవాలని కోరినట్టు అరవింద్‌కుమార్ పేర్కొన్నారు. మాల్స్, సినిమాహాల్స్, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, దవాఖానల్లో తడి చెత్త, పొడి చెత్త నిల్వలపై తనిఖీలు చేసి నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణమండలి అధికారులను ఆదేశించారు. త్వరలో రాష్ట్రప్రభుత్వం ఘనవ్యర్థాల నిర్వహణ నిబంధనలను అమల్లోకి తీసుకొస్తుందని వివరించారు. ఈ సమావేశంలో సీడీఎంఏ డైరెక్టర్ టీకే శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గోవాలో ముగిసిన భారత్, ఫ్రాన్స్ నౌకాదళ విన్యాసాలు



పనాజీ/ న్యూఢిల్లీ, మార్చి 19: భారత్, ఫ్రాన్స్ నావికాదళాలు సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి. గోవాలోని అరేబియా సముద్ర తీరాన 'వరుణ – 18' అనే పేరుతో ఈ నెల 15 నుంచి మొదలైన హార్బర్ ఫేజ్ విన్యాసాలు సోమవారంతో ముగిసాయి. సముద్ర జలాల పరిధిలో మంగళవారం నుంచి శనివారం వరకు సాగుతాయి. రక్షణ రంగంలోనూ సముద్ర తీర ప్రాంత భద్రతపై సహకారాన్ని పెంపొందించుకోవాలని భారత్, ఫ్రాన్స్ నిర్ణయించిన నేపథ్యంలో ఇరు దేశాల నావికాదళాలు సంయుక్త విన్యాసాలు జరిపాయి. భారత నావికాదళం వెస్టర్న్ ఫ్లీట్ ఆఫీసర్ కమాండర్ అడ్మిరల్ ఎంఏ హంపిహోలీ మాట్లాడుతూ అరేబియా సముద్రం, బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలోని నైరుతి ప్రాంతంలో ఈ విన్యాసాలు నిర్వహిస్తామని చెప్పారు. గోవాలోని అరేబియా సముద్ర తీరాన నిర్వహించిన విన్యాసాల్లో ఫ్రాన్స్ జలాంతర్గామి జీ డీ వియన్నే, భారత జలాంతర్గామి కల్వరి పీ8 – 1, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ త్రికండ్ యుద్ధ నౌకలు, డోర్నియర్ మారిటైమ్ పెట్రోలింగ్, ఎంఐజీ 29 కే యుద్ధ విమానాలు పాలొన్నాయి. రెండోదశ విన్యాసాలు వచ్చేనెలలో చెన్నై తీర ప్రాంతంలో, మూడోదశ విన్యాసాలు మే నెలలో లా రీయూనియన్ ద్వీపంలో జరుగుతాయి. ఫ్రాన్స్ నౌకాదళానికి అడ్మిరల్ డిడియర్ పైటాన్ సారథ్యం వహించారు.

రోహింగ్యాలకు సదుపాయాలపై మధ్యంతర ఉత్తర్వులివ్వం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 19: శరణార్థ శిబిరాలలో తలదాచుకుంటున్న రోహింగ్యాలకు కల్పించాల్సిన సదుపాయాలపై ఎటువంటి మధ్యంతర ఉత్తర్వ్యులివ్వరాదన్న కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలు మీడియాలో ప్రధాన శీర్షికలుగా కనిపించవచ్చని, అది మయన్మార్, బంగ్లాదేశ్‌లతో భారత్‌కు గల దౌత్య సంబంధాలపై ప్రభావం చూపవచ్చని ప్రభుత్వం తెలిపింది. శిబిరాల్లోని రోహింగ్యాలకు విద్య, వైద్యం అందించే విషయమై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని కోర్టు స్పష్టం చేసింది.